
www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 28 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు వైశాఖ శుద్ధ అష్టమి
05 - 11 మే 2025
వెల : ₹20/-



# రక్తపు చుక్కల రణఘోష

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక




# భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపులు

గత 12 సంవత్సరాలుగా మేము జంటనగరాలలో 14 కు పైగా ఉన్న మా భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపుల ద్వారా అందిస్తున్న సేవలను షుమారు నెలకు 20,000 మందికి పైగా ప్రజలు వినియోగించుకుంటూ, ప్రతి నెలా కోటి రూపాయల వరకు ఆదా చేసుకుంటున్నారు. మా వద్ద షుగర్, బి.పి., గ్యాస్ ట్రబుల్, గుండె జబ్బు, నరాల బలహీనత, ఎలర్జీ మొదలైన రోగాలకు మరియు కాల్షియం, విటమిన్‌లకు సంబంధించిన షుమారు 600 రకాల జనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయి. మేము నాణ్యమైన మందులు మరియు సిప్లా, ఎలంబిక్, ర్యాన్‌బ్యాక్సీ, అబ్బోట్ వంటి ప్రముఖమైన కంపెనీల మందులను మాత్రమే అమ్ముతున్నాము.

## Rate Chart of Few Generic Medicines

| S.No. | Brand Name | Company Price | Generic Brand Name | Generic Medicine | Prescribed Price | BVP Price |
|---|---|---|---|---|---|---|
| 1 | Amaryl 2 (10's) | 166.64 | Glimicut-2mg (10's) | Glimipride 2mg | 62 | 10 |
| 2 | Rosuvas-10mg (10's) | 210 | Rosu-HDL (10's) | Rosuvastatin 10mg | 185 | 34 |
| 3 | Clopitab-75 (10's) | 85 | Clopizen 75mg (10's) | Clopidogrel 75mg | 77.50 | 18 |
| 4 | Telma-40 (10's) | 96.39 | Telmiwock 40mg (10's) | Telmisartan 40mg | 72.57 | 19 |
| 5 | Shelcal (15's) | 131 | Sheldeal (15's) | Calcium Carbonate 500mg+D3 | 90 | 17 |
| 6 | Pantop-40mg (10's) | 155 | Pantosec 40mg (10's) | Pantoprazole 40mg | 130.51 | 26 |
| 7 | Zincovit (15's) | 105 | Zincotop (15's) | B Complex with Vitamins | 81 | 47 |
| 8 | Amlopres-AT (10's) | 34.96 | Amlip AT (10's) | Amlodipine+Atenolol | 72.60 | 12 |
| 9 | Augmentin Duo 625 (6's) | 126.70 | Megamentin 625mg (6's) | Amoxycillin+Potassium Clavulanate | 96 | 71 |
| 10 | Pregalin-m-75mg (10's) | 174 | Pregabanyl (10's) | Pregabalin+Mehylcobalamin | 130 | 42 |
| 11 | Glycomet-gp1 (10's) | 100.50 | Glymp M1 (10's) | Glimipride+Metformin | 96.25 | 12 |

* రూ. 500/- ఆపై విలువగల ఆర్డర్‌లకు డోర్ డెలివరీ ఉచితం *

KOTI - 93929 36187 | MOOSAPET - 78936 45599 | PADMARAO NAGAR - 88859 69292 | KPHB ROAD #4 - 93917 99239
MADHURA NAGAR - 93929 36185 | VIVEKANANDA NAGAR COLONY - 93919 07080 | CHANDA NAGAR - 93919 16073
S.R. NAGAR - 93919 04207 | MALKAJGIRI - 040-35490428 | CHIKKADPALLY - 93919 03805 | MUSKIPET - 040-35102572
SANTOSH NAGAR - 72070 57737 | KUKATPALLY - 93914 24994 | SHANTINAGAR - 040-35166998

For any Enquiries & Other Shops Details, Contact Manager: 93905 08904 / 74160 57751
e-mail: agm@bvpgenerics.org, mngr.ops@bvpgenerics.org.

# జాగృతి చదువుదాం.. చదివిద్దాం..

ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

## రండి.. జాతీయభావాల వేదిక జాగృతి చందాదారులుగా చేరుదాం.. చేర్పిద్దాం!

ఒక సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి. లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1474/-
https://payit.cc/S32796

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్ (మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/-
+ మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ.624/-)

విడి ప్రతి
రూ.20/-

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

వివరాలకు సంప్రదించండి సర్క్యులేషన్ మేనేజర్ : 040-2756 1453, 99599 97013

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | – |
| సబ్ ఎడిటర్ : | – | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140532 5, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**


– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

జమ్ముకశ్మీర్ చరిత్రలోనే కాదు, భారతదేశ చరిత్రలో కూడా ఏప్రిల్ 22 చీకటిదినమే. ఆ రోజే 26 మంది అమాయక పర్యాటకులను పాకిస్తాన్ ప్రేరేపిత ముస్లిం ఉగ్రవాదులు లోయలోని పెహల్గావ్‌లో కాల్చి చంపారు. పెహల్గావ్ కాల్పులు అక్షరాలా, అచ్చంగా పట్టపగలు భారత సార్వభౌమాధికారం మీద దాడి. మానవత్వం మీద దాడి. ముస్లిం మతోన్మాదులు భారతీయుల మీద ఇలా దాడులకు తెగబడడం ఎన్నోసారి? ముంబై పేలుళ్లు, గోకుల్ చాట్ పేలుళ్లు ఎన్నని! ప్రపంచమంతా ఇస్లాం మాత్రమే ఉండాలన్న పిచ్చి భ్రమ, కశ్మీర్ విముక్తి సాకును చూపి ఎన్ని పర్యాయాలు ఇలా రక్తపాతానికి ఒడిగట్టారు? ఆ నెత్తుటి కథనాలు ఇక వినలేమన్నట్టే ఉంది నేటి భారత పరిస్థితి. అందుకే యుద్ధం గురించి లెక్కకు మించి పౌరులు గళం విప్పుతున్నారు. సర్జికల్ స్ట్రయిక్స్‌తోను బుద్ధిరాని పాకిస్తాన్‌కు పూర్తిస్థాయి యుద్ధమే, తిరిగి తలెత్తకుండా చావగొట్టడమే సరైందన్న వాదన బలపడుతోంది. 1948 నుంచి, 1999 కార్గిల్ యుద్ధం వరకు పాకిస్తాన్‌ది అదే ధోరణి. హిందువుల రక్తంతో ఆడుకోవడమే. తాజా దాడి ఆ వైఖరికి పరాకాష్ట. మతం అడిగి మరీ చంపారు. భారతీయ సమాజం ఇంకా సహనంతో ఉండాలని, ఉంటుందని అనుకోవడం ఇక సాధ్యం కాదు.

ఇజ్రాయెల్ మీద హమాస్ ఉన్మాదులు చేసిన దాడి వంటిదే పెహల్గావ్ దురంతమన్న అభిప్రాయం ఇప్పుడు రాజ్యమేలుతున్నది. హమాస్ రక్తపిపాసులు దాడికి దిగిన కొన్ని గంటలలోనే ఇజ్రాయెల్ అతి బీభత్సమైన తీరులో ప్రతిఘటనకు దిగింది. అలాంటిదే భారత్ కూడా జరిపి ఉండాల్సిందన్నదే చాలామంది కోరిక. పుల్వామా దాడి తరువాత ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు జరిగాయి. అవి తలకెక్కలేదని పాకిస్తాన్ తనకు తాను వెల్లడిస్తున్న పరిణామాలే ఏప్రిల్ 22 తరువాత జరిగాయి. 'మా ప్రతిచర్య ప్రపంచం ఊహించనంత తీవ్రంగా ఉంటుంది' అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. దోషం తమవైపే ఉందని ప్రపంచమంతా నిర్ధారణకు వచ్చిన తరువాత కూడా పాకిస్తాన్ కవ్వింపు చర్యలనే ఆశ్రయిస్తున్నది. మోదీ చేత అలాంటివే ఇంకొన్ని ప్రకటనలు చేయించాలన్న దురద పొరుగు పాలకులలో కనిపించింది. రాముడు యుద్ధానికి రాక తప్పని పరిస్థితులు రావణుడే కల్పించుకున్నాడు. రాముడి చేతిలో చిత్తయినాడు. ఇప్పుడు పాకిస్తాన్ పరిస్థితి అలాంటిదేనని ఆర్ఎస్ఎస్ అధినేత డాక్టర్ మోహన్ భాగవత్ సరిగానే వ్యాఖ్యానించారు. సింధు జలాల ఒప్పందాన్ని

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు వైశాఖ శుద్ధ అష్టమి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**రక్తపు చుక్కల రణఘోష** 6లో

ఆధ్యాత్మికం
**ప్రహ్లాద వరదా! ప్రణమామ్యహమ్** 24లో



ప్రత్యేక వ్యాసం
**1857** 26లో



# జాగృతి

## సంపాదకీయం


భారత్ రద్దు చేయగానే సిమ్లా ఒప్పందాన్ని కాలరాస్తున్నట్టు పాక్ ప్రకటించడం యుద్ధానికి మార్గాన్ని మరింత సుగమం చేయడమే. దాని ఫలితం ఐదురోజులు వరసగా (ఏప్రిల్ 29న ఈ సంపాదకీయం రాసే వరకు) అధీనరేఖ వద్ద పాక్ సైనికులు కాల్పులకు తెగబడ్డారు. అంటే సిమ్లా ఒప్పందాన్ని ఉల్లం ఘించాం, ఇదిగో చూడండి అన్నారు. ఆ చర్య యుద్ధాన్ని ఆరంభించడమే. కార్గిల్ యుద్ధంలో పాక్ ఓటమి తరువాత 2003లో కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఆ మేరకు 2006 వరకు ఒక్క తూటా కూడా పేలలేదు. ఆ తరువాత ఎన్నిసార్లు సిమ్లా ఒప్పందాన్ని ఆ దేశం ఉల్లంఘించిందో లెక్కలేదు.

# యుద్ధమేఘాలు

పెహల్గావ్ ఘటన అనంతర పరిణామాలలో 29న కేంద్ర హోంశాఖ జరిపిన కీలక సమావేశం ఒకటి. బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఎన్ఎస్‌జీ అధిపతులు కూడా పాల్గొన్నారు. యుద్ధం దిశగా వేసిన అడుగులు కూడా ఎక్కువే. 16 పాకిస్తాన్ యూట్యూబ్ చానళ్లకు మన దేశంలో 63 మిలియన్‌ల వీక్షకులు ఉన్నారట. ఇది విస్తుగొలిపే విషయమే. ఇవన్నీ నిలిపివేశారు. పెహల్గావ్ దాడి మీద జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఇది రాజ్యాంగ విలువల మీద దాడి అంటూ తీర్మానం కూడా చేసింది. ఇది ముమ్మాటికీ మొసలి కన్నీరు. నేషనల్ కాన్ఫరెన్స్ వైఖరి ఏనాడూ విశ్వసించదగినదిగా లేదు. కాబట్టే ఈ తీర్మానానికి ఎవరూ విలువ ఇవ్వలేదు. పెహల్గావ్ దాడి తమ రాష్ట్రహోదా డిమాండ్‌కు అడ్డం పడిందన్న బాధే ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను వేధిస్తున్నట్టు కనిపిస్తున్నది. అంతర్జాతీయంగా భారత్‌కు మద్దతు పెరుగుతూనే ఉంది. తమ దేశం ఉగ్రమూకలకు మూడు దశాబ్దాలుగా పోషకురాలుగా ఉందంటూ పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ స్కైన్యూస్ విలేకరి ముందు నిస్సంకోచంగా ప్రకటించడం ఆ దేశానికిక ఎలాగూ ముప్పే. సాక్షాత్తు రక్షణమంత్రి అలా ప్రకటిస్తే భారత్ మౌనంగా ఉండిపోవడమూ సాధ్యం కాదు. అందుకే ఏప్రిల్ 28న ఐక్యరాజ్య సమితిలో భారత్ తరపు శాశ్వత సభ్యురాలు యోజనా పటేల్ పొరుగుదేశం తెంపరితనాన్ని ఇంకాస్త గట్టిగా చాటగలిగారు.

కానీ దేశంలో విపక్షాల వైఖరి ఆత్మహత్యా సదృశంగా ఉన్నది. పుల్వామాను లోక్‌సభలో విజయానికి ఉపయోగించుకున్నారు అంటూనే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఇప్పుడున్న పరిస్థితిని తనకు ఉపయోగపడుతుందేమోనని దింపుడు కళ్లం ఆశతో చూస్తున్నది. మోదీ తలలేని ఒక బొమ్మను సామాజిక మాధ్యమాలలో పెట్టి ప్రధాని మోదీ ఎక్కడ? అంటూ వ్యాఖ్య రాసింది. బీజేపీ మండిపడింది. అందుకు కర్ణాటక మంత్రి దినేశ్ గుండూరావ్ ఇచ్చిన వివరణ మరీ వికారంగా ఉంది. ప్రధాని విలేకరుల సమావేశంలో మాట్లాడతారా? ఏదైనా వివరణ ఇస్తారా? ఏం జరుగుతున్నదో (పెహల్గావ్ పరిణామాలు) ప్రజలు ఆయనను అడిగే అవకాశం ఉందా? పుల్వామా ఆయనకు లోక్‌సభ ఎన్నికలలో ఉపయోగపడింది. గోద్రా గుజరాత్ ఎన్నికలకు ఉపయోగించింది. ఇప్పుడు బిహార్ ఎన్నికలలో లాభపడేందుకు ఆయన ఆలోచిస్తున్నారు. మీరు దేశం గురించి కూడా ఆలోచించాలి.' అన్న వారి అమూల్యాభిప్రాయం తెలియచేయడానికే ఈ పద్ధతిని అనుసరించారట. పైన చెప్పుకున్న పాకిస్తాన్ వాదనలతో పాటు, కాంగ్రెస్ ప్రకటనలు, ఖలిస్తాన్ తీవ్రవాదుల వాచాలత చాలా దగ్గర పోలికలతో ఉన్నాయి. ఖలిస్తాన్ ఉగ్రవాది గురు పత్వంత్‌పన్ను ఇంకా రెచ్చిపోయాడు. భారత్‌లోని రెండుకోట్ల మంది సిక్కులు పాకిస్తాన్‌కు 'ఇటుకల గోడ' మాదిరిగా రక్షణకు నిలబడతారట. పాకిస్తాన్ మీదకు యుద్ధానికి పంజాబ్ గుండా భారత సైన్యం వెళ్లలేదని కూడా చెప్పాడు. యుద్ధం కోరుకోవద్దు. అవసరమైతే ఆగొద్దు. మోదీ వెనుక జాతి నిలబడి ఉంది. పాకిస్తాన్ పీచమణచడం ఎంత ముఖ్యమో, దాని భక్తుల మెదలు వంచడమూ అంతే అవసరం. ★






40లో

కథ

**చేనేత మగ్గం**

- ఎస్. నాగేందర్‌నాథ్ రావు





| | | |
|---|---|---|
| పొంతన లేని విమర్శలు-అసంబద్ధ వివరణలు! (తెలంగాణ) | - | 20 |
| ఉగ్రదాడితో రాష్ట్రంలో అప్రమత్తత (ఆంధ్రప్రదేశ్) | - | 22 |
| ఆ నెత్తుటి తర్పణకు నూరేళ్లు (ప్రత్యేక వ్యాసం-1) | - | 29 |
| దేవభూమిలో దొంగ బంగారం (కామ్రేడ్ స్కాం) | - | 32 |
| కొమ్మూరి ప్రజ్ఞావతి (మహిళ) | - | 34 |
| సంపాదనకు భారత్.. స్థిరపడేందుకు లండన్..! (క్రీడ) | - | 43 |
| బాలజాగృతి | - | 46 |
| భేషుగ్గా... సారంగపాణి జాతకం (సినిమా) | - | 50 |




# రక్తపు

# ముక్కల రణఘోష

## “కలీమా (లా ఇలాహ ఇల్లల్లాహ్) చదువు!”

**పక్క గుడారం దగ్గర హెూరెత్తిన తుపాకీ మోతలతో తమ గుడారంలోకి వెళ్లి నేలపైన పడుకున్న సంతోష్ జగ్దలే (54)ను పిలిచి ముస్లిం ఉగ్రవాదులు  తుపాకీ ఎక్కుపెట్టి అరిచారు. ఇంకా చెప్పాలంటే మతోన్మాదం ఆయుధం గురి పెట్టి ఆదేశించింది. ఆయన హిందువు, చెప్పలేకపోయారు. లిప్తలోనే ఆయన తలపైన, చెవిలో, వీపు మీద తుపాకీలతో కాల్చారు. అక్కడికక్కడే కూలిపోయారాయన. ఇదంతా ఆయన కుటుంబ సభ్యుల ఎదుటే. ఏప్రిల్ 22న దక్షిణ కశ్మీర్‌లోని పెహల్గావ్ వద్ద జరిగిన ఊచకోతలో కన్నుమూసిన ఓ  పర్యాటకుడి విషాదాంతమిది. అలాంటివి 26 విషాదాంతాలు. ఫలితం– ‘ప్రపంచం నివ్వెరపోయే విధంగా మా ప్రతిచర్య ఉంటుంది’ అని సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ గర్జించవలసి వచ్చింది. ఇప్పటి దాకా భారత్ వేసిన ప్రతి అడుగు ఆ దిశగానే పడుతున్నది కూడా. ముస్లిం ఛాందసవాదం మీద భారత్ వాదనే నిజం, ఇక ప్రపంచం, కుహనా సెక్యులరిజం నోరు మూస్తే మంచిది అని ఆయన హితవు పలికారు. ప్రతి భారతీయుడి గుండె మండిపోతున్నది. ప్రతి భారతీయుడి రక్తం కాగిపోతున్నది. యుద్ధభేరీ మోగే క్షణం కోసం ఎదురుచూస్తున్నది.**

పెహల్గావ్‌లో ఏం జరిగింది? ఇది ఆధునిక ప్రపంచంలో బతికే వాళ్లు చేయగలిగేదేనా? లేకుంటే మధ్యయుగాల మనస్తత్వపు చర్యా? మతమేమిటో నిలదీస్తూ మతోన్మాదం రెచ్చిపోయింది. ఉగ్రవాదానికి మతం లేదు అంటూ ఎప్పటి నుంచో ఓండ్ర పెడుతున్న సెక్యులరిస్టుల, ఉదారవాదుల, మూడో స్వభావపు రాజకీయ పార్టీల ముఖాల మీద ఉమ్మినట్టే మతోన్మాదులు నెత్తురు చిందించారు. ఆ నెత్తురుకు ధర్మం ఉంది. అదే హిందూ ధర్మం. హిందూరక్తాన్ని ఎంచుకుని మరీ రుచి చూశారు. తమ హింస లక్ష్యాన్ని ‘పేంట్స్ విప్పి’ బుజ్జగింపు రాజకీయాల ముఖాల మీదే నిస్సిగ్గుగా ప్రదర్శించారు. అలాంటి ఉగ్రవాదులకు ఊపిరి పోస్తున్న దేశం పాకిస్తాన్. ఇప్పుడు యుద్ధమేఘాల కింద ఉంది. ఆశ్చర్యంగా పరమ నీచమైన చర్యలు చేయించి కూడా భారత్ పట్ల మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నది. రెచ్చగొట్టే ధోరణిలోనే ఉంది. ఆ రోగ్ నేషన్ దగ్గర అణ్వాయుధాలు కూడా ఉన్నాయట. వాటిని ఇప్పటికే భారత్ వైపు మోహరించిందట.

పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి ఆయువుపట్టు మతోన్మాదమే. వాళ్లు కలీమా చదవమన్నారు, లేదంటే పేంట్స్ లాగి పరీక్షించారు. కలీమా సందేశం, అర్థం–అల్లా తప్ప వేరొక దైవం లేదు. ఇది చెప్పలేకపోతే ప్రాణాలు తీశారు. ప్రపంచంలోనే అత్యంత హీనమైన నేరమిది. హేయమైన చర్య ఇది. ఆనాడు నేలకొరిగిన పర్యాటకులంతా దాదాపు హిందువులే అని ముందే తెలిసినా ఇలా ప్రశ్నించడం ఎందుకు? తమ మతోన్మాదంలోని కొండగుర్తును ప్రదర్శించడానికి! యావత్ ప్రపంచం కళ్లు తెరిపించడానికి! ముస్లిం మతోన్మాదం కోసం ఇతర మతాల అమాయకులను చంపడానికి వెనుకాడబోమని బెదిరించడానికి! ఇంత దారుణమైన మతోన్మాదానికి నిరంతరం కొమ్ముకాస్తున్న సెక్యులరిజం ఇప్పుడు కూడా నోరు విప్పడం లేదు. ఉగ్రవాదులకు అలసిచ్చే పార్టీలు మాత్రమే అధికారంలోకి వస్తాయని తెలిసినా, ఎందరు ఘంటాపథంగా హెచ్చరించినా.. పీక మీద హక్కుల కత్తి పెట్టి జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహింపచేసిన భారత అత్యున్నత న్యాయస్థానానికైనా ఇంక మాట్లాడడానికి ఏమైనా ఉందా అని ఆ 26 అమాయక ప్రాణాలు ఆక్రోశిస్తున్నాయి. మీరు ప్రతిష్ఠించిన ప్రజాప్రభుత్వం నిర్వాకం చూడమని దొంగల పార్టీలను, న్యాయస్థానాలను అవి కన్నీటితో అర్థిస్తున్నాయి. జవాబు ఉంటుందా? సమాధానం వస్తుందా?

భారతీయుల రక్తం సలసల కాగుతోంది. వక్ఫ్ చట్ట సవరణ మీద చిల్లర గోల చేసే ఆ కాస్త అవకాశం ఇలా పోయినందుకు చింతిస్తూనే పాకిస్తాన్ దుశ్చర్యను, ఉగ్రవాదుల ఘాతుకాన్నీ ఒవైసీ

వంటి చాలామంది భారత్ వ్యతిరేకులు, ఆ మత గురువులు కూడా ఖండించక తప్పలేదు. అగ్రదేశాలన్నీ ఇప్పుడు నిజంగానే పశ్చాత్తాప పడుతున్నాయి. ఔను, మేం మూడు దశాబ్దాలుగా ఈ రక్తపాతాన్ని ప్రోత్సహిస్తున్నాం, ఇదంతా అమెరికా, బ్రిటన్‌ల కోసమే అంటూ పాకిస్తాన్ రక్షణ మంత్రి స్వయంగా చేసిన ప్రకటన ఇప్పుడు ఒక కలకలం. దీనికి ఎలా స్పందించనున్నాయి, అగ్రదేశాలు? అయినా ప్రపంచ మీడియాకు ఇంకా జ్ఞానోదయం కాలేదు. పెహెల్గావ్‌లో దాడి చేసింది 'మిలిటెంట్లు' అని రాస్తున్నారు. కాదు, వాళ్లు 'టెర్రరిస్టులు'. ఇంకా ఎందుకు కపటత్వం? ఎందుకీ ఆత్మ వంచన అంటూ సాక్షాత్తు అమెరికా విదేశాంగ శాఖ 'న్యూయార్క్‌టైమ్స్' అనే ప్రపంచ ప్రఖ్యాత పక్షపాత బురదగుంటకు బుద్ధి చెప్పవలసి వచ్చింది. గడ్డి పెట్టవలసి వచ్చింది. ఇంకా బీబీసీ ఇదే పంథాలో ఉగ్రవాదులతో నెత్తుటి కరచాలనం చేస్తున్నది. భారత్‌లో కొన్ని పత్రికల ధోరణి కూడా ఇదే. దేశద్రోహం.

యుద్ధం ఎంత వినాశకరమో తెలిసినా శాంతిప్రియులైన భారతీయులు సమరాన్నే కోరుకుంటున్న క్షణమిది. 1948, 1965, 1971, 1999 యుద్ధాలలో నేల కరిచినా, రవంత కూడా గుణపాఠం నేర్వని పాకిస్తాన్‌కు రణంతోనే జ్ఞానోదయం అవుతుందన్నదే ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్న జనాభిప్రాయం. అదే నేటి నినాదం. ఆ నాలుగు యుద్ధాల వలె కాదు, అంతకు వందరెట్లు నాశనం కావాలా దేశం అని కోరుకుంటున్నారు. సింధు జలాలు ఆపితే రక్తమే ప్రవహిస్తుందంటాడో పశుప్రాయుడు. తన తల్లిని ఉగ్రవాదమే నడిరోడ్డు మీద కుక్కను చంపినట్టు చంపినా ఈ ఉగ్రవాదికే వంత పాడతాడు భుట్టో వారసుడు.

పాకిస్తాన్-ముస్లిం మతోన్మాదం అవిభక్త కవలలు. పాకిస్తాన్-ఉగ్రవాదం ఒక నాణేనికి రెండు ముఖాలు. పాకిస్తాన్- భారత్ మీద ద్వేషం అవిభాజ్యాలు. కాబట్టి పాకిస్తాన్ అంతు చూడక తప్పదు. ఇది వాస్తవిక దృష్టి కాదు అనడానికి ఇప్పుడు ఎవరూ సాహసించరు. దొడ్డితోవన ఉగ్రవాదులను సమర్థించేవాళ్లు, అడ్డదారిన ముస్లిం ఉగ్రవాదాన్ని నెత్తికెత్తుకునే వాళ్లు కూడా సాహసించలేరు. ప్రపంచాన్ని, లేదా ఆసియాను ఔరంగజేబ్ కాలానికి, ఇంకా వీలైతే అల్లావుద్దీన్ ఖిల్జీ కాలానికి తీసుకుపోదామనుకునే పాకిస్తాన్ విచ్ఛిన్నం కావడం తక్షణ అవసరం. అందుకు పెహెల్గావ్ దాడి అత్యవసర కారణంగా మారినా ఆశ్చర్యపడక్కరలేదు. ★

ఆర్టికల్ 370 తరువాత జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం తోక ముడిచింది. కేంద్రం అభిమతానికి విరుద్ధంగా శాసనసభకు ఎన్నికలు జరిగాయి. రాష్ట్రపతి పాలనలో దాదాపు ప్రశాంతంగా ఉన్న జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నాయకత్వంలో 'ప్రజా ప్రభుత్వం' అధికారంలోకి వచ్చిన తరువాత మరొకసారి ముస్లిం ఉగ్రవాదులకు ద్వారాలు తెరిచినట్టయింది. ఫలితమే పెహెల్గావ్ దురంతం. తరువాత పరిణామాలు శరవేగంగా జరిగిపోయాయి. మాటలకు అందని ఆ నెత్తుటి కాండ క్రమం ఇది:



**ఏప్రిల్ 22- మంగళవారం:**
**ఉగ్రదాడి.. 26 మంది దుర్మరణం**

జమ్మూ కశ్మీర్‌లో అనంత్‌నాగ్ జిల్లా, పెహెల్గావ్‌కు ఆరు కి.మీ.ల దూరంలో మినీ స్విట్జ ర్లాండ్‌గా పేరొందిన బైసరన్ లోయలో మధ్యాహ్నం పూట పర్యాటకులపై టెర్రరిస్టులు జరిపిన కాల్పుల్లో 26 మంది మరణించారు. అనేక మంది గాయ పడ్డారు. పర్యాటకులు శిబిరాల్లో సేదతీరుతూ ఆహారం తీసుకుంటున్న సమయంలో అక్కడికి నలుగురు టెర్రరిస్టులు సైనిక దుస్తుల్లో వచ్చారు. పురుషులే లక్ష్యంగా దాడి చేశారు. అత్యంత సమీపం నుంచి తుపాకీ కాల్పులు జరిపారు. అనంతరం లోయకు వెనుకనే ఉన్న పైన్ వృక్షాలతో కూడిన అడవిలోకి టెర్రరిస్టులు కనుమరుగైపోయారు. భద్రతాదళాలు కాల్పుల శబ్దానికి అప్రమత్త మయ్యాయి. వెంటనే బైసరన్‌కు చేరుకున్నాయి. టెర్రరిస్టుల కోసం గాలింపు చర్యలు మొదలు పెట్టాయి. గాయపడిన వారిలో కొందరిని గుర్రాలపై తరలించారు. సహాయ చర్యల కోసమని హెలికాప్టర్లను రంగంలోకి దించారు.

**దాడి చేసింది టీఆర్‌ఎఫ్**

దాడికి పాల్పడింది తామేనని పాకిస్తాన్ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రమూక 'లష్కరే తోయిబా' అనుబంధ సంస్థ 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' – టీఆర్‌ఎఫ్ ప్రకటించింది.

**ప్రధాని ఫోన్.. శ్రీనగర్‌కు అమిత్ షా**

సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాతో ఫోన్లో మాట్లాడారు. ప్రధాని ఆదేశానుసారం అదే రోజు రాత్రికి శ్రీనగర్‌కు చేరుకున్నారు. భద్రతా బలగాలకు చెందిన ఉన్నతాధికారులతో సమావేశ మయ్యారు. పరిస్థితిని సమీక్షించారు.

**ఏప్రిల్ 23 - బుధవారం**
**పాకిస్తాన్‌పై 5 ప్రతీకార చర్యలు**

పెహెల్గావ్ ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ సౌదీ అరేబియా పర్యటన రద్దు చేసుకొని ఏప్రిల్ 23 బుధవారానికి హుటాహుటిన దేశ రాజధానికి చేరుకున్నారు. రావడం రావడమే

విమానాశ్రయంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌తో సమావేశమయ్యారు. పరిస్థితిని సమీక్షించారు. అనంతరం అదే రోజు సాయంత్రం ప్రధాని నివాసంలో మోదీ అధ్యక్షతన భద్రతపై కేబినెట్ కమిటీ–సీసీఎస్ సమావేశమైంది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్, తదితరులు సమావేశానికి హాజరయ్యారు. అనంతరం కేంద్ర విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ సమావేశ వివరాలను వెల్లడించారు. పెహల్గావ్ దాడిని సీసీఎస్ ఖండించింది. బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఉగ్రవాదానికి కొమ్ము కాస్తూ, భారత్‌లో ఉగ్రదాడులకు ఉసిగొల్పుతున్న పాకిస్తాన్‌కు గట్టి బుద్ధి చెప్పడానికి ఐదు చర్యలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. అవి..

- 1960 నాటి సింధూ జలాల ఒప్పందం నిలుపుదల
- సరిహద్దు వద్ద అటారీ చెక్ పోస్టు మూసివేత. అధికారిక పత్రాలతో భారత్‌లోకి ప్రవేశించిన పాకిస్తానీయులు మే 1వ తేదీలోగా స్వదేశానికి తిరిగివెళ్లిపోవాలి.
- సార్క్ వీసా పొడిగింపు పథకం – ఎస్‌వీఈఎస్ కింద పాకిస్తానీయులు భారత్‌లో ఉండరాదు. గతంలో వారికి జారీ చేసిన ఎస్‌వీఈఎస్ వీసాలు వెంటనే రద్దవుతాయి. ఎస్‌వీఈఎస్ వీసాలతో భారత్‌లో ఉన్నవారు 48 గంటల్లోగా విడిచిపెట్టి వెళ్లిపోవాలి.
- ఇస్లామాబాద్‌లో భారత హైకమిషన్ నుంచి సైనిక, నావికాదళం, వాయుసేనకు చెందిన సలహాదారుల ఉపసంహరణ.
- ఇస్లామాబాద్‌లో భారత్ హైకమిషన్‌లో సిబ్బంది సంఖ్య 30కి కుదింపు.

**ఏప్రిల్ 24 – గురువారం**

**భారతీయ ఆత్మపై దాడి: ప్రధాని మోదీ**

ఉగ్రవాదులను, వారికి ఊతమిస్తున్నవారిని ఊహకందని రీతిలో దెబ్బకొడతామని ప్రధాని మోదీ ఏప్రిల్ 24, గురువారం అన్నారు. బిహార్‌లోని మధుబనిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని పెహల్గావ్ దాడిలో అమరులైనవారికి నివాళు లర్పించారు. నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం, 'దాడిలో అనేకులు ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. ఒకరు కుమారుడ్ని కోల్పోతే, మరొకరు సోదరుడ్ని, ఇంకొకరు జీవిత భాగస్వామిని కోల్పోయారు. బాధితుల్లో ఒకరు బెంగాలీ మాట్లాడితే, మరొకరు కన్నడ, ఇంకొకరు మరాఠీ, మరికొందరు ఒడియా, గుజరాతీ, బిహారీ.. ఇలా దేశంలో వేర్వేరు



ప్రాంతాలవారు ఉన్నారు. అటు కార్గిల్ నుంచి ఇటు కన్యాకుమారి వరకు మానవత్వం ఉన్న ప్రతీ భారతీయుడు బాధిత కుటుంబాలకు అండగా ఉన్నారు. క్రూరులైన శత్రువులు చేసిన దాడి అమాయకులైన పర్యాటకుల మీదనే కాక భారతదేశపు ఆత్మపైన చేసిన దాడి. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న వారిని నామరూపాల్లేకుండా చేస్తాం. అందుకు సమయం ఆసన్నమైంది" అని ప్రధాని అన్నారు. అప్పటిదాకా హిందీలో మాట్లాడిన మోదీ.. తన మాటలు యావత్ ప్రపంచానికి వినపడాలి అన్నట్టుగా ఇంగ్లీషులో ప్రసంగించడం ప్రారంభించారు. ఆ క్రమంలో "దాడులతో భారత్ అచేతనంగా మిగిలిపోదు. ప్రతీకార చర్యలు తప్పకుండా ఉంటాయి. ప్రపంచంలో వారు(ఉగ్రవాదులు) ఏ మూల నక్కినా పట్టుకొని తీరుతాం. వారి వీచమణుస్తాం. బాధితులకు న్యాయం జరిగేవరకు మేం విశ్రమించేది లేదు. దాడిని ఖండించి మాకు అండగా నిలిచిన అమెరికా, రష్యా, చైనా, ఐరోపా యూనియన్ దేశాలకు ధన్యవాదాలు" అని ప్రధాని అన్నారు.

**పాక్ నోట యుద్ధం మాట.. భారత్‌పై చర్యలు**

పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన ఆ దేశపు జాతీయ భద్రతా కమిటీ ఏప్రిల్ 24, గురువారం సమావేశమైంది. అనంతరం విడుదల చేసిన ప్రకటనలో భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడాన్ని యుద్ధానికి ఉసిగొల్పే చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. భారత్ చేపట్టిన చర్యలను ఏకపక్షమైనవి, అన్యాయమైనవి, రాజకీయ ప్రేరేపితమైనవి, న్యాయబద్ధంగా చెల్లుబాటు కానివని పేర్కొంది. ఈ నేపథ్యంలో భారత్‌పై ప్రతీకార చర్యలను పాకిస్తాన్ ప్రకటించింది. అవి..

- వెంటనే అమల్లోకి వచ్చేలా వాఘా సరిహద్దు మూసివేత. ఈ మార్గం గుండా భారత్ రాకపోకలు నిలిపివేత. వాఘా సరిహద్దు గుండా సరైన పత్రాలతో పాకిస్తాన్‌లోకి ప్రవేశించిన భారతీయులు ఏప్రిల్ 30 నాటికి స్వదేశానికి తిరిగి వెళ్లిపోవాలి.
- భారత్‌తో సిమ్లా ఒప్పందంతోపాటు అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలు నిలుపుదల.
- సార్క్ వీసా పొడిగింపు పథకం – ఎస్‌వీఈఎస్ కింద సిక్కు యాత్రికులు మినహా భారతీయులకు జారీ చేసిన వీసాలు తక్షణమే రద్దు. ఎస్‌వీఈఎస్ కింద పాకిస్తాన్‌లో ఉంటున్న భారతీయులు 48 గంటల్లోగా దేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవాలి.
- భారత్‌కు చెందిన లేదా భారత్ నడుపుతున్న అన్ని విమానాలకు పాకిస్తాన్ గగనతలం మూసివేత.
- భారత్‌తో, భారత్‌కు పరోక్షంగా సహకరిస్తున్న దేశాలతో అన్ని రకాల వాణిజ్యం నిలిపివేత.
- ఇస్లామాబాద్‌లో ఉంటున్న భారత సైనిక, నావికాదళం, వాయుసేనకు చెందిన సలహాదారులు ఏప్రిల్ 30నాటికి పాకిస్తాన్ విడిచిపెట్టి వెళ్లిపోవాలి.
- ఇస్లామాబాద్‌లో భారత్ హైకమిషన్‌లో సిబ్బంది సంఖ్య ఏప్రిల్ 30నాటికి 30కి కుదింపు.

**ఏప్రిల్ 25– శుక్రవారం**

**సింధూలో రక్తాన్ని పారిస్తాం.. పాక్ పిచ్చికూతలు**

భారత్ పెహల్గావ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా సింధూ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేసిన తరుణంలో పాకిస్తాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో భారత్‌పై పిచ్చికూతలు కూశాడు. సింధూ నదిలో నీరు పారకుంటే రక్తం ఏరులై ప్రవహిస్తుందంటూ రెచ్చగొట్టేలా వాగాడు. సింధూ నది పాకిస్తాన్ సొంతమని అన్నాడు. అసలు సింధూ నాగరికతకు పాకిస్తానీయులే సంరక్షకులని ఉన్నవీ

## దాడి చేసింది రాక్షసులు



"నిజమైన హిందువు ఎవరినీ కూడా మీరు ఏ మతస్తులు అని ఒక్కనాటికీ అడగడు.. చంపడు. ఇది మన ఆచార, విచారాలకు విరుద్ధమైనది. పెహల్గావ్‌లో జరిగింది మతమౌఢ్యంలో వేళ్లూనుకున్న ఓ రాక్షస చర్య. ఆ పనిచేసినవారు ధర్మాన్ని అనుసరించేవారు కాదు... రాక్షసులు. రావణుడు బాగా చదువుకున్న వాడు. శివభక్తుడు. కానీ ఇంత తెలివితేటలు ఉండి కూడా అతడు అధర్మం బాట పట్టాడు. మారడానికని అవకాశాలు ఇచ్చినప్పటికీ అతడు నిరాకరించాడు. దాంతో శ్రీరామచంద్రుడు గత్యంతరం లేక అతడ్ని చంపాల్సివచ్చింది. అదే విధంగా, నేడు ఎవరైతే ద్వేషం, ఉగ్రవాదం బాట పట్టారో అలాంటివారిని ధర్మ రక్షణ కోసమని తప్పనిసరిగా మట్టుపెట్టాలి. నేడు ఈ నవీనకాలపు రావణుడ్ని నామరూపాల్లేకుండా చేయడానికి మనకు 18 చేతులు ఉన్న దుర్గామాత శక్తి కావాలి. ఆ శక్తి మన నిర్మాణంలో, ఐకమత్యంలో, స్పష్టమైన నైతికతలో ఉంది."

– ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్

లేనివీ కల్పించి కల్లబొల్లి కబుర్లు చెప్పాడు.

భుట్టో కన్నా నాలుగు ఆకులు ఎక్కువే చదివాడు, పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్. సింధూ నదిలో ప్రతి నీటి బొట్టూ పాకిస్తాన్‌దేనని వాగాడు. ఇదే సమయంలో లష్కరే తోయిబా చీఫ్, ముంబై పేలుళ్ల సూత్రధారి హఫీజ్ సయీద్ పిచ్చి ప్రేలాపనలతో కూడిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో "కశ్మీర్‌లో ఆనకట్ట కట్టేసి పాకిస్తాన్‌కు నీళ్లు రాకుండా చేస్తామని మీరు(భారత్) అంటున్నారు. పాకిస్తాన్‌ను నాశనం చేయడానికి చూస్తున్నారు. మీరే కనుక నీళ్లు ఆపేస్తే.. నీళ్లు లేని నదుల్లో రక్తం ఏరులై పారుతుంది" అని సయీద్ బెదిరించాడు.

**ఏప్రిల్ 27- ఆదివారం**

**పెహల్గావ్ దుర్మార్గులకు గట్టిగా బదులిస్తాం**

ప్రధాని నరేంద్ర మోదీ పెహల్గావ్ ఉగ్రదాడికి పాల్పడినవారికి, కుట్రదారులకు గట్టిగా బదులిస్తామని పునరుద్ఘాటించారు. బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసాను కూడా ఇచ్చారు. ఏప్రిల్ 27 ఆదివారంనాడు మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో మాట్లాడుతూ "నేడు ఎంతో ఆవేదన నిండిన హృదయంతో మాట్లాడుతున్నాను. ఏప్రిల్ 22న పెహల్గావ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడి ప్రతి ఒక్క పౌరుని హృదయాన్ని ముక్కలు చేసింది. ప్రతి ఒక్క భారతీయుడు బాధిత కుటుంబాల పట్ల తీవ్రమైన సానుభూతిని వ్యక్తం చేశారు. ఏ రాష్ట్రానికి చెందినవారైనా, ఏ భాషను మాట్లాడేవారైనా సరే ఈ దాడిలో ప్రియమైనవారిని కోల్పోయిన బాధితుల బాధను తమదిగా భావించారు. ఉగ్రదాడికి సంబంధించిన ఫోటోలు చూసి ప్రతి ఒక్క భారతీయుడు రగిలిపోయారనే విషయాన్ని నేను అర్థం చేసుకోగలను. పెహల్గావ్‌లో ఈ దాడి ఉగ్రవాదాన్ని పోషించే వారి నిస్పృహను, వారి పిరికితనాన్ని ప్రతిబింబిస్తోంది" అని మోదీ తెలిపారు. కశ్మీర్ గురించి మాట్లాడుతూ "కశ్మీర్‌లో శాంతి తిరిగి నెలకొంటున్న సమయంలో, విద్యాసంస్థలు చురుగ్గా పనిచేస్తున్నప్పుడు, భవన నిర్మాణ కార్యకలాపాలు అనూహ్యంగా పుంజుకుంటున్నప్పుడు, ప్రజాస్వామ్యం మరింత పటిష్టమైనప్పుడు, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయికి పెరిగినప్పుడు, ప్రజల ఆదాయం వృద్ధి చెందుతున్నప్పుడు, యువత కోసమని కొత్తగా అవకాశాలు పుట్టుకొస్తున్న వైనాన్ని చూసి జాతి శత్రువులకు, జమ్ము కశ్మీర్ శత్రువులకు కన్ను కుట్టింది. టెర్రరిస్టులు, వారి మాస్టర్లు కశ్మీర్‌ను మరోసారి ధ్వంసం చేయాలనుకుంటున్నారు. అందుకనే ఇంత పెద్ద దాడి చేశారు" అని ఆయన అన్నారు. ఉగ్రవాదంపై జరిపే ఈ యుద్ధంలో జాతి ఐక్యత, 140 కోట్ల మంది భారతీయుల సంఘీభావం జాతికి గొప్ప బలమని మోదీ తెలిపారు. జాతి గొప్పదనాన్ని గురించి వివరిస్తూ "ఈ ఐక్యతే ఉగ్రవాదంపై మనం చేసే తిరుగులేని పోరాటానికి ప్రాతిపదిక అవుతుంది. మన జాతికి వచ్చిన ఈ సవాల్‌ను ఎదుర్కోవడం కోసమని మనం మన సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. ఒక జాతిగా మనం గట్టి సంకల్ప బలాన్ని ప్రదర్శించాలి. నేడు యావత్ ప్రపంచం ఈ ఉగ్రదాడి వైపు చూస్తోంది. యావత్ జాతి ఏక కంఠంతో మాట్లాడుతోంది" అని చెప్పారు. అంతర్జాతీయ సమాజం నుంచి వెల్లువెత్తిన సంతాప సందేశాలను మననం చేసుకుంటున్నట్టుగా "యావత్ ప్రపంచం భారతీయుల ఆగ్రహాన్ని తనదిగా భావించింది. ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రపంచం నలుమూలల నుంచి సంతాప సందేశాలు వస్తూనే ఉన్నాయి. ఈ దారుణమైన ఉగ్రదాడిని గట్టిగా ఖండించిన అంతర్జాతీయ నేతల నుంచి నాకు ఫోన్‌కాల్స్, సందేశాలు వచ్చాయి. వారు బాధిత కుటుంబాలకు



పెహల్గావ్


సంతాపం తెలిపారు. యావత్ ప్రపంచం ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్న 140 కోట్ల మంది భారతీయులకు అండగా నిలిచింది" అని ప్రధాని తెలిపారు. బాధితులను ఉద్దేశించి మాట్లాడుతూ "బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుందనే భరోసాను నేను వారికి ఇస్తున్నాను. వారికి తప్పకుండా న్యాయం జరుగుతుంది. ఈ దాడికి పాల్పడినవారికి, దాడి వెనుక కుట్రదారులకు గట్టిగా బదులిస్తాం" అని మోదీ తెలిపారు.

**రక్షణ మంత్రితో డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ భేటీ**

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ – సీడీఎస్ అనిల్ చౌహాన్ ఏప్రిల్ 27 ఆదివారం మంత్రి నివాసంలో భేటీ అయ్యారు. కీలకమైన ఈ భేటీలో పాకిస్తాన్‌పై సైనిక చర్యల విషయాలను చౌహాన్ రక్షణ మంత్రికి వివరించినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అంతకుమునుపు రాజ్‌నాథ్ సింగ్‌తో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ దినేష్ త్రిపాఠి, బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరీ కూడా సమావేశ మయ్యారు. పెహల్గావ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో భద్రత పరిస్థితి గురించి వారు మంత్రికి వివరించినట్టు తెలుస్తోంది. ఈ సమావేశానికి ఆర్మీ డైరెక్టర్ జనరల్ (మిలటరీ ఆపరేషన్స్) హాజరైనట్టు సమాచారం. పాక్ బలగాలు సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న సమయంలో రక్షణ మంత్రితో ఉన్నతాధికారులు భేటీ కావడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

**భారత్‌కు ఎఫ్‌బీఐ పూర్తి మద్దతు**

పెహల్గావ్ ఉగ్రదాడి విషయంలో భారత్‌కు పూర్తి మద్దతు ఇస్తామని అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఏప్రిల్ 27, ఆదివారం తెలిపారు. ఉగ్రదాడిని ఆయన ఖండించారు. ఈ దాడి ఉగ్రవాదం నుంచి యావత్ ప్రపంచం నిత్యం ఎదుర్కొంటున్న ముప్పులను గుర్తు చేస్తోందని ఎక్స్ సోషల్ మీడియాల చేసిన పోస్టులో పటేల్ పేర్కొన్నారు. దాడి అనంతరం భారత్ భద్రతాదళాలు స్పందించిన తీరును ఆయన ప్రశంసించారు.




**యుద్ధానికి నావికాదళం సన్నాహాలు.. క్షిపణి పరీక్షలు**

పాకిస్తాన్‌తో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత్ అరేబియా మహా సముద్రంలో క్షిపణి పరీక్షలు జరిపింది. ఇదే విషయమై భారత నావికాదళం అధికార ప్రతినిధి ఏప్రిల్ 27 ఆదివారం ఎక్స్‌లో చేసిన ఒక పోస్టులో "ఇటీవల అరేబియా మహాసముద్రంలో భారత నావికాదళానికి చెందిన ఐఎన్ఎస్ సూరత్ యుద్ధనౌక నుంచి ఎంఆర్–ఎస్ఏఎం క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. దీనికి తోడు ఎలాంటి పరిస్థితిని ఎదుర్కోవడానికైనా తాము సిద్ధం అని ప్రపంచానికి చాటి చెప్పడానికి యుద్ధ నౌకల నుంచి క్షిపణలను ప్రయోగించడం జరిగింది" అని తెలిపారు. ఏప్రిల్ 24 గురువారం నాడు నావికాదళానికి చెందిన ఒక గైడెడ్ విధ్వంసక క్షిపణి ఒక సీ–స్కిమ్మింగ్ లక్ష్యాన్ని ధ్వంసం చేసింది. సముద్ర మట్టానికి చాలా తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్లు, తదితరాలను సీ–స్కిమ్మింగ్

## పెహల్గావ్ అమరులు

- మధుసూదన్‌రావు సోమిశెట్టి, బెంగళూరు, కర్ణాటక (స్వస్థలం, కావలి ఏపీ)
- జేఎస్ చంద్రమౌళి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్.
- దిలీప్ దెసాలే, ముంబాయి, మహారాష్ట్ర
- హేమంత్ జోషి సుహాస్, ముంబయి, మహారాష్ట్ర
- అతుల్ శ్రీకాంత్ మోని, థానె, మహారాష్ట్ర
- సంజయ్ లక్ష్మణ్ లెలె, థానె, మహారాష్ట్ర
- సంతోష్ జగ్దాలే, పుణె, మహారాష్ట్ర
- కస్తోబే గనోవోటే, పుణె, మహారాష్ట్ర
- బిటైన్ అధికారి, కోల్‌కతా, పశ్చిమ బెంగాల్
- సమీర్ గుహ, కోల్‌కతా, పశ్చిమ బెంగాల్,
- మనీశ్ రంజన్, బిహార్
- భరత్ భూషణ్, బెంగళూరు, కర్ణాటక
- మంజునాథరావు, శివమొగ్గ, కర్ణాటక
- యతీశ్ పర్మార్, భావ్‌నగర్, గుజరాత్
- సుమిత్ పర్మార్, భావ్‌నగర్, గుజరాత్
- శైలేష్ భాయ్ కలథియా, సూరత్, గుజరాత్
- వినయ్ నర్వాల్, కర్నాల్, హరియాణా
- ఎన్. రామచంద్రన్, కొచ్చిన్, కేరళ
- దినేష్ అగర్వాల్, చండీగఢ్
- సయ్యద్ ఆదిల్ హుసేన్ షా, పెహల్గావ్, జమ్మూకశ్మీర్
- నీరజ్ ఉద్వానీ, యూఏఈ (స్వస్థలం రాజస్థాన్)
- సుశీల్ నాథ్యాల్, ఇండోర్, మధ్యప్రదేశ్
- ప్రశాంత్ శత్పతి, బాలేశ్వర్, ఒడిశా
- టేజ్ హాల్యింగ్, జిరో, అరుణాచల్ ప్రదేశ్
- శుభమ్ ద్వివేదీ, కాన్పూర్, ఉత్తరప్రదేశ్
- సుదీప్ సోయిపాని, రూపందేహి, నేపాల్

## మన జాతి ఐక్యత, నైతిక నిష్ఠపై దాడి



"జమ్ము కశ్మీర్‌లోని పెహల్గావ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి గర్హనీయమైనది, హృదయవిదారకమైనది. మృతులకు మా నివాళి అర్పిస్తున్నాం. ఈ దాడిలో గాయపడినవారు త్వరగా కోరుకోవాలని ప్రార్థిస్తున్నాం. ఇది మన జాతి ఐక్యత, నైతిక నిష్ఠపై జరిగిన దాడి. అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు విభేదాలను విస్మరించి ఈ ఉగ్రవాద చర్యను ఖండించాలి. ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలి. ఈ దాడికి బాధ్యులైనవారిని తగినవిధంగా శిక్షించాలి".

– ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ దత్తాత్రేయ హొసబలె

లక్ష్యాలు అని అంటారు. ఇవి రాడార్లు, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లు కనిపెట్టకుండా ఉండటానికని చాలా తక్కువ ఎత్తులో ఎగురుతుంటాయి.

**పాక్ మంత్రి పిచ్చి ప్రేలాపనలు**

భారత్ పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలతో హనీఫ్ అబ్బాసీ అనే ఆ దేశపు మంత్రికి మతిభ్రమించినట్టుంది. భారత్‌పై దాడి చేయడానికని తమ వద్ద 130 అణుబాంబులు, ఘోరీ, షహీన్, ఘజ్నవి లాంటి క్షిపణులు సిద్ధంగా ఉన్నాయని ఏప్రిల్ 27 ఆదివారం వాగాడు. అంతేకాకుండా అవి ఎక్కడ ఉన్నాయో ఎవ్వరికీ తెలియదని, భారత్ కవ్విస్తే కనుక అణుబాంబులతో దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ మతిమాలిన మంత్రి చెప్పాడు.

**ఎన్ఐఏకి దర్యాప్తు బాధ్యతలు.. దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు**

కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ పెహల్గావ్ ఉగ్రదాడి కేసును జాతీయ దర్యాప్తు ఏజెన్సీ– ఎన్ఐఏకు ఏప్రిల్ 27 ఆదివారం బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో దర్యాప్తు వివరాలతో ఒక ప్రకటనను ఎన్ఐఏ విడుదల చేసింది. ప్రకటన ప్రకారం ఐజీ, డీఐజీ, ఎస్పీ నేతృత్వంలోని ఎన్ఐఏ బృందాలు ప్రత్యక్ష సాక్షుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నాయి. టెర్రరిస్టులు ఏ విధంగా దాడి చేసిందీ తెలుసుకోవడానికి ఎన్ఐఏ బృందాలు బైసరన్ లోయకు ఆగమన, నిష్క్రమణ ప్రాంతాలను నిశితంగా శోధిస్తున్నాయి. ఆధారాలను సేకరించడానికని ఫోరెన్సిక్, తదితర నిపుణుల సహకారంతో దాడి జరిగిన ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి.

**నలువైపులా కమ్ముకున్న నలుగురు టెర్రరిస్టులు**

దాడిలో ముగ్గురు పాక్ టెర్రరిస్టులు, ఒక కశ్మీరీ టెర్రరిస్టును కలుపుకొని మొత్తం నలుగురు టెర్రరిస్టులు పాల్గొన్నారని ఎన్ఐఏ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కశ్మీరీ టెర్రరిస్టును అదిల్ థోకర్‌గా గుర్తించారు. టెర్రరిస్టులు కోకెనగర్ అడవుల నుంచి బైసరన్ పచ్చిక బయలుకు 20 నుంచి 22 గంటలపాటు నడుచుకుంటూ వచ్చి ఏప్రిల్ 22న చేరుకున్నారు. వారు అక్కడికి చేరుకున్న సమయానికి దాదాపు 1200 మంది పర్యాటకులు వారి వేసవి సెలవులను ఆనందంగా గడుపుతున్నారు. టెర్రరిస్టుల్లో ఇద్దరు దుకాణాల వెనుక దాక్కున్నారు. మిగిలిన ఇద్దరు జిప్‌లైన్ ప్రాంతంలో పొజిషన్ తీసుకున్నారు. పర్యాటకులు ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతుండగా, దుకాణం వెనుక దాక్కున్న టెర్రరిస్టులు వెలుపలకు వచ్చారు. ఎదురుపడిన పర్యాటకులను కల్మా వల్లించమన్నారు. ఆ పని చేయలేకపోయిన వారిపై ఏకే–47, ఎం4 రైఫిళ్లతో విచక్షణారహితంగా కాల్పులు జరపడం మొదలుపెట్టారు. పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దిక్కు తోచని స్థితిలో పరుగులు తీస్తుంటే జిప్‌లైన్ ప్రాంతం దగ్గర ఉన్న మిగిలిన ఇద్దరు టెర్రరిస్టులు వారిపై దారుణంగా కాల్పులు జరిపారు.

**చెట్టు పైకి ఎక్కి వీడియో తీసిన స్థానిక ఫోటోగ్రాఫర్**

దాడి జరుగుతున్నప్పుడు అక్కడే ఉన్న స్థానిక ఫోటోగ్రాఫర్ ప్రాణభయంతో చెట్టుపైకి ఎక్కి దాక్కున్నాడు. అతడు చెట్టుపై నుంచి తన మొబైల్ ఫోన్‌తో దాడి మొత్తాన్ని వీడియో తీశాడు. ఆ వీడియో ప్రస్తుతం ఎన్ఐఏ చేతిలో ఉంది. దర్యాప్తునకు అది ఓ కీలకమైన ఆధారంగా పనికొస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

**సైన్యాధికారి వాంగ్మూలం కీలకం**

పర్యాటకుల్లో జమ్ము కశ్మీర్‌లో పనిచేస్తున్న ఓ సైన్యాధికారి కూడా ఉన్నారు. ఆయన తన

## దశాబ్దాల నరమేధం

**ఆగస్టు 15, 1993:** ఉగ్రవాదుల మెరుపు దాడిలో 8 మంది అమర్‌నాథ్ యాత్రికుల దుర్మరణం.

**జులై 4, 1995:** పెహల్గావ్ సమీపంలోని లిద్దర్‌వాట్‌లో ఇంగ్లండ్, అమెరికా, జర్మనీ, నార్వే దేశాలకు చెందిన ఆరుగుర్ని అపహరించుకుపోయిన ఉగ్రవాదులు. నార్వే దేశీయుడు దుర్మరణం. మిగిలిన వారు కనిపించకుండాపోయారు.

**జులై 28, 1998:** శేష్‌నాగ్ క్యాంప్‌సైట్ వద్ద ఉగ్రవాదుల మెరుపుదాడిలో 20 మంది అమర్‌నాథ్ యాత్రికుల దుర్మరణం.

**మార్చి 21, 2000:** అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్ పర్యటన నేపథ్యంలో, రాత్రి వేళ అనంత్‌నాగ్ జిల్లాలోని చిట్టిసింగ్‌పొరా గ్రామంలో సిక్కు మతస్తులపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 36 మంది మృతి.

**ఆగస్టు 2, 2000:** అమర్‌నాథ్ యాత్ర చరిత్రలోనే అతిపెద్ద దాడి అన్నట్టుగా నున్‌వాన్ బేస్ క్యాంప్ పైన జరిగిన దాడిలో 21 మంది యాత్రికులు, ఏడుగురు స్థానిక దుకాణందారులు, ఇతరులను కలుపుకొని మొత్తం 32 మంది దుర్మరణం. మరో 60 మందికి గాయాలు.

**జులై 20, 2001:** శేష్‌నాగ్ సరస్సు సమీపంలో ఒక క్యాంప్‌పై గ్రెనేడ్ దాడిలో యాత్రికులు, సహాయక సిబ్బంది, ఇద్దరు పోలీసు అధికారులతో పాటుగా 15 మంది మృతి. మరో 15 మందికి గాయాలు.

**అక్టోబరు 1, 2001:** శ్రీనగర్‌లోని జమ్మూకాశ్మీర్ శాసనసభ భవన సముదాయంపై దాడిలో 36 మంది దుర్మరణం.

**మార్చి 30, 2002:** జమ్మూలో రఘునాథ్ దేవస్థానంపై జంట దాడుల్లో ముగ్గురు భద్రతా సిబ్బందితో పాటుగా ఏడుగురు మృతి. మరో 20 మందికి గాయాలు.

**ఆగస్టు 6, 2002:** పెహల్గావ్ సమీపంలోని నున్‌వాన్ బేస్ క్యాంప్ పైన జరిగిన దాడిలో ఆరుగురు అమర్‌నాథ్ యాత్రికులతో పాటుగా తొమ్మిది మంది దుర్మరణం.

**నవంబరు 23, 2002:** దక్షిణ కశ్మీర్‌లోని లోయర్ ముండా వద్ద జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిపై సంభవించిన పేలుడులో ఇద్దరు పిల్లలు, ముగ్గురు మహిళలు, తొమ్మిది మంది భద్రతా సిబ్బందితో పాటుగా 19 మంది మృతి.

**నవంబరు 24, 2002:** జమ్మూలో రఘునాథ్, పంజ్‌బఖ్తర్ దేవస్థానాలపై ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 13 మంది దుర్మరణం. మరో 45 మందికి గాయాలు.

**మార్చి 23, 2003:** పుల్వామా జిల్లాలోని నాడిమార్గ్ గ్రామంలో ఇద్దరు

కుటుంబంతో సెలవులు గడపడానికని బైసరన్ పచ్చిక బయలుకు వచ్చారు.

దాడి మొదలుకాగానే ఆయన తనకున్న అనుభవంతో, అత్యంత తెలివితేటలతో తన కుటుంబ సభ్యులను కాపాడుకున్నారు. మిగిలిన సాధారణ పర్యాటకులు దాడి షాక్ నుంచి ఇంకా బైటపడలేదు. కనుక వారు ఇచ్చే వాంగ్మూలంలో స్పష్టత ఉండదు. అదే సైన్యాధికారి విషయానికి వచ్చేసరికి ఆయన ఎలాంటి తడబాటు లేకుండా దాడి వివరాలను పూసగుచ్చినట్టుగా తన వాంగ్మూలంలో వివరించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిజానికి ఈ దుర్ఘటన వివరాలు ఇప్పటికీ పూర్తిగా దేశం ముందుకు వచ్చాయని అనుకోనక్కర లేదు. ఒక్కొక్కటిగా అవి బయటపడతాయి. అందులో విస్తుపోయే అంశాలకే ఎక్కువ చోటు కూడా.

**భారత్ మన్నించదు.. మరచిపోదు...**

భారత్‌పై జిహాదీలు జరుపుతున్న మతిలేని యుద్ధంలో మరో పర్వం రక్తంతో తడిసి ముద్దయ్యింది. ఏప్రిల్ 22న మధ్యాహ్నం దక్షిణ కశ్మీర్‌లోని పెహల్గావ్‌లో ముస్లిం మతోన్మాద ఉగ్రవాదం మారణ హోమం సాగించింది. ఉగ్రవాదానికి మతంతో ముడిపెట్టవద్దు అని మానవాళికి నీతులు చెప్పే సూడో సెక్యులరిస్టుల అసలు రంగును బట్టబయలు చేస్తున్నట్టుగా కంటికి కనిపించినవారినల్లా ‘నీ మతమేమిటో చెప్పు’ అని అడిగింది. రద్దీగా ఉండే ఇరుకిరుకు రైలు బోగీల్లోనూ, రోడ్లపైనా ఎక్కడ పడితే అక్కడ తోటివారిని ఇబ్బందులు పెడుతూ చేసే ప్రార్థనలోని పంక్తులను చూడకుండా చెప్పాలని హుకుం జారీ చేసింది.

**“శ్రేయాన్ స్వధర్మో విగుణః**
**పరధర్మాత్ స్వనుష్ఠితాత్**
**స్వధర్మే నిధనం శ్రేయః**
**పరధర్మో భయావహః”**

అన్న గీతాకారుడి మాటను తరతరాలుగా, తు.చ. తప్పకుండా పాటిస్తున్నవారి త్రికరణశుద్ధి తుచ్ఛులైన ఉగ్రవాదులకు తప్పుగా మారింది. వారి మతోన్మాదం ఏ స్థాయికి చేరుకుందంటే ఎదురుగా భయంతో వణికిపోతున్న మగవాడు “మనవాడా? పరాయి వాడా?” అని తెలుసుకోవడానికి వేసుకున్న ప్యాంటును బలవంతంగా ఊడదీయించారు. “మనవాడు” కాదని ఖాయమైపోయాక అమాయకులైన హిందువులపై మతిభ్రమించిన పాకిస్తాన్ శునకాల చేతుల్లోని తుపాకులు తూటాలు కురిపించాయి. వద్దు.. వద్దు అని వేడుకుంటున్నా.. ప్రాణభయంతో కంచెలను దాటి పారిపోతున్నా కనికరించలేదు ఆ కర్కశ మూక. ఇంకా 16 రోజుల పండుగ మురిపెం తీరని కొత్త జంటను సైతం విడిచిపెట్టలేదు. “మినీ స్విట్జర్లాండ్” మరుభూమిగా మారిపోయింది. అయినవారితో ఆనందంగా గడపాలని ఎక్కడెక్కడి నుంచో వచ్చిన 26 మంది ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. పెళ్లి నాడు పాదాలకు అంటిన పారాణి ఆరకముందే ముష్కరుల చేతిలో కడతేరిపోయిన భర్త పార్థివ దేహం వద్ద అందరూ ఉన్నా ఎవరూ లేని అనాథలా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఆడపడుచును చూసి మానవత్వం మంటకలిసిపోయింది. కారుణ్యం కలికానికి కూడా అందకుండా పోయింది. దయ దరిదాపుల్లో లేకుండా పోయింది. జాలి గాలిలో కలిసిపోయింది. విచక్షణ వీపు చూపించింది.

జరిగింది పర్యాటకులపై దాడి మాత్రమే కాదు, అది ఒక పథకం ప్రకారం ఒక మతాన్ని నామరూపాల్లేకుండా చేసే కార్యక్రమంలో ఓ భాగం. ఇంకా వివరంగా చెప్పాలంటే ఎంతటి గండరగండులకైనా వెన్నులో వణుకు పుట్టించే పక్కా ప్రణాళికకు, మధ్యయుగంనాటి క్రూరత్వా నికి అంటు కట్టిన హిందూ వ్యతిరేక కార్యక్రమం. సెక్యులరిస్టులుగా చెప్పుకునే మీడియా ఇది “పర్యాట కులపై దాడి” అని ప్రచారం చేస్తూ మతోన్మాద హింసను కప్పిపుచ్చడానికి శతవిధాలుగా ప్రయత్నిస్తోంది. ఇది హిందువులను లక్ష్యంగా చేసుకొని ఇస్లామ్ టెర్రరిస్టులు జరిపిన దాడి అని అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**పాకిస్తాన్ చేతులకు అంటిన హిందూ రక్తం**

దాడిపై జరిపిన ప్రాథమిక దర్యాప్తు, నిఘా వర్గాల ప్రకారం ఘాతుకం వెనుక సూత్రధారులు పాకిస్తాన్‌లో ఉన్నారు. మరీ ముఖ్యంగా ఈ దాడిలో అత్యంత నికృష్టుడైన అంతర్జాతీయ టెర్రరిస్టు హాఫీజ్ సయీద్ ప్రత్యక్ష ప్రమేయం ఉంది. తుచ్ఛుడైన ఈ ముష్కరుడికి భారత్‌లో జరిగిన నరమేధాలకు వెనుకుండి చేయించిన నీచాతినీచమైన చరిత్ర ఉంది.

దాడి ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఎవరిపై, ఎంత క్రూరంగా జరిగిందీ చూసినవారి చూపుడువేలు ఇస్లామ్ ఉగ్రవాదం మన భూభాగంపై మరోసారి పెచ్చరిల్లడానికి ఊతమిచ్చి, మనకు పశ్చిమాన ఒళ్లంతా విషాన్ని, కపటత్వాన్ని నింపుకొన్న పొరుగు దేశం వైపు చూపిస్తుంది.

ఇటీవల చోటు చేసుకున్న ఈ ఘాతుకం భారత్‌కు

పిల్లలు, 11 మంది మహిళలతో పాటుగా 24 మంది కశ్మీరీ పండిట్‌ల ఊచకోత.

**జులై 22, 2003:** కట్రాకు రెండు కి.మీ.ల దూరంలోని బన్‌గంగ వద్ద జంట పేలుళ్లలో ఒక చిన్నారితో పాటుగా ఆరుగురు వైష్ణోదేవి భక్తుల మృతి.

**జూన్ 13, 2005:** పుల్వామాలో కారు బాంబు పేలుడులో ఇద్దరు స్కూలు పిల్లలు, ముగ్గురు సీఆర్‌పీఎఫ్ అధికారులతో పాటుగా 13 మంది దుర్మరణం.

**మే 25, 2006:** శ్రీనగర్ శివార్లలో బాటాపోరా ప్రాంతంలో జరిగిన గ్రెనేడ్ దాడిలో ఇద్దరు పిల్లలతో పాటుగా నలుగురు గుజరాతీ పర్యాటకులు మృతి. మరో ఆరుగురికి గాయాలు. అంతకు కొద్ది గంటల ముందే అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ శ్రీనగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ముగించారు.

**జూన్ 12, 2006:** కుల్‌గావ్‌లో ఉగ్రదాడిలో తొమ్మిది మంది నేపాలీ, బీహారీ కూలీలు దుర్మరణం.

**జులై 21, 2006:** గండేర్‌బల్ జిల్లాలోని బేహామా వద్ద అమర్‌నాథ్ యాత్రికుల బస్సుపై దాడిలో ఐదుగురు మృతి.

**జులై 10, 2017:** అనంత్‌నాగ్ వద్ద అమర్‌నాథ్ యాత్రికుల బస్సుపై మెరుపు దాడిలో ఏడుగురు దుర్మరణం. మరో 21 మందికి గాయాలు. బాధితుల్లో అత్యధికులు గుజరాతీలు.

**మే 13, 2022:** రాయిసి వద్ద వైష్ణోదేవి భక్తులను తీసుకువెళుతున్న బస్సుకు ఉగ్రవాదులు నిప్పు పెట్టడంతో నలుగురు మృతి, 24 మందికి గాయాలు.


**2006 నాటి కుల్‌గావ్ దాడి బాధితులు**

**జూన్ 9, 2024:** రాయిసి వద్ద వైష్ణోదేవి భక్తులను తీసుకువెళుతున్న బస్సు పైకి ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో లోయలో పడిన బస్సు. 10 మంది దుర్మరణం, 33 మందికి గాయాలు.

# బాధితుల కన్నీటి గాథలు

## వెళ్లి మోదీకి చెప్పుకో అన్నారు



"నేను, నా భర్త మంజునాథ్, మా అబ్బాయి ముగ్గురం కర్ణాటకలో శివమొగ్గ నుంచి పెహల్గామ్‌కు వచ్చాం. అప్పుడు టైమ్ మధ్యాహ్నం రెండున్నర అయ్యిందనుకుంటా. అప్పుడే అక్కడకు వచ్చిన కొందరు కాల్పులు జరపడం మొదలు పెట్టారు. హిందువులను కనిపెట్టి మరీ కాల్చి చంపుతున్నారు. ఆ కాల్పుల్లో నా భర్త అక్కడికక్కడే మరణించాడు. నాకైతే మతిపోయింది. నా భర్తను చంపారు కదా.. నన్ను కూడా చంపెయ్యండి అన్ని వాళ్లను చూస్తూ గట్టిగా అరిచాను. వాళ్లలో ఒకడు నా వైపు చూసి.. 'నిన్ను చంపను కానీ.. వెళ్లి మోదీకి ఏం చెప్పుకుంటావో చెప్పుకో పో..' అని అన్నాడు. అప్పుడే స్థానికుల్లో కొందరు నన్ను, నా కొడుకును కాపాడారు. నాకు అదంతా ఒక పీడకలగా అనిపిస్తోంది."

– పల్లవి, శివమొగ్గ

## నా కళ్లముందే నా తండ్రిని కాల్చి చంపేశారు



"నా తల్లిదండ్రులతోపాటు మా కుటుంబమంతా బైసరన్ వెళ్లాం. ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుంటే మేమంతా భయంతో పక్కనే ఉన్న టెంటులోకి వెళ్లి నేలపైన పడుకున్నాం. అప్పటికే అక్కడ మరో ఏడుగురు ఉన్నారు. టెర్రరిస్టులు మాకు పక్కనే ఉన్న టెంటులో కాల్పులు జరిపి మా టెంటు దగ్గరకు వచ్చారు. మా నాన్నను (సంతోష్ జగ్దలే (54)) చూసి 'చౌదరీ.. బైటకు రా' అని గట్టిగా అరిచారు. ప్రధాని మోదీని దూషించారు. మా నాన్న బైటకు వెళ్లగానే కల్మా చెప్పమన్నారు. మా నాన్న చెప్పకపోయేసరికి ఆయన తలపైన, చెవిలో, వీపు మీద తుపాకీతో కాల్పులు జరిపారు. మా నాన్న కుప్పకూలిపోయారు. ఆ తర్వాత వాళ్లు నా పక్కనే ఉన్న మా అంకుల్‌ను కాల్చి చంపారు. నన్ను, మా అమ్మను, మా చుట్టమైన మహిళను వాళ్లు ఏమీ చేయకుండా వదిలేశారు. అప్పుడు మమ్మల్ని పోనీల్లో (చిన్న గుర్రం) తీసుకువచ్చిన వారే మాకు సాయం చేశారు. దాదాపు అరగంట తర్వాత పోలీసులు వచ్చారు"

– అసావరీ జగ్దలే, పుణె

## ప్రాణాల మీదకు తెచ్చిన ఐడీ కార్డు



హైదరాబాద్, కోఠిలో ఎస్ఐబీలో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బిహార్‌కు చెందిన మనీష్ రంజన్ రేకు ఆయన దగ్గర ఉన్న ఐడీ కార్డు ప్రాణాల మీదకు తెచ్చింది. ఇటీవల ఆయన తన భార్య, పిల్లలతో కలిసి జమ్మూ కశ్మీర్‌కు వెళ్లారు. అందరూ పెహల్గామ్ చేరుకున్నారు. మనీష్ అక్కడ ట్రెక్కింగ్ చేస్తుండగా సైనిక దుస్తుల్లో ఉన్న టెర్రరిస్టులు ఆయన్ను చుట్టుముట్టారు. వచ్చింది నిజమైన సైనికులనుకొన్న తెలంగాణ ఐబీ ఆఫీసర్ వారికి తన ఐడీ కార్డును చూపించారు. ఆయన భార్య, పిల్లలు చూస్తుండగానే టెర్రరిస్టులు మనీష్‌పై కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే కన్నుమూశారు. ఘాతుకానికి ఒడిగట్టిన టెర్రరిస్టులు అమరుడి భార్య, పిల్లలను హెచ్చరించి వదిలేశారు.





పాదాలకు అంటిన పారాణి ఆరకుండానే నవ వధువు నుదుటి బొట్టును ఉగ్రవాదం చెరిపేసింది. అమరుడైన నావికాదళం అధికారి వినయ్ నర్వల్ పార్థివ దేహానికి ఆయన సతీమణి హిమాన్షి నర్వల్ కన్నీటి వీడ్కోలు.

వ్యతిరేకంగా పాకిస్తాన్ బహురూపాలుగా పన్నుతున్న కుటిలమైన వ్యూహంలో భాగమే.

**కశ్మీర్ ఆర్థికాభివృద్ధిని చూసి ఓర్వలేక..**

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు నుంచి పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు తెచ్చేంతవరకు జమ్ము కశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించి, సాధారణ పరిస్థితులు నెలకొల్పడానికని సంవత్సరాల తరబడి అహర్నిశలు శ్రమించింది. ఆ శ్రమ పండించిన శాంతి ఫలాలను కేంద్రపాలిత ప్రాంతం రుచి చూడటం మొదలుపెట్టింది.

పర్యాటకం మూడు పువ్వులు, ఆరుకాయలు అన్నట్టుగా విరగకాస్తోంది. హోటళ్లు అతిథులతో కళకళలాడిపోతున్నాయి. స్థానికులకు మునుపెన్నడూ ఎరుగని రీతిలో ఉపాధి దొరుకుతోంది. కశ్మీరీలు నెమ్మది నెమ్మదిగా కల్లబొల్లి వేర్పాటువాద కథనాలను వినడం మానేస్తున్నారు. ఇదంతా పొరుగునే ఉన్న పాకిస్తాన్‌కు మింగుడుపడటంలేదు. వెంటనే తన చంకలో ఉన్న ఉగ్రవాద మూకల్ని ఉస్కో అంది. భువిపై భూతలస్వర్గంలాంటి జమ్ము కశ్మీర్‌ను చూడటానికి వచ్చే హిందువులను భయభ్రాంతులకు గురిచేయమంది. తద్వారా ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదుగుతున్న పర్యాటకాన్ని నేలమట్టం చేయాలనేది దాయాది దుష్ట పన్నాగం. పనిలోపనిగా కశ్మీర్‌పై "భద్రమైంది కాదు" అనే ముద్ర మరోసారి పడుతుంది. అదే సమయంలో ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా కశ్మీరీలకు, మిగిలిన భారతీయులకు మధ్య ఓ పూడ్చలేని అగాధాన్ని పుట్టించడానికి పొరుగుదేశం పాచిక వేసింది.

**కశ్మీర్ అంశాన్ని మళ్లీ తెరపైకి తేవడానికి..**

ఈ మారణహోమం సరిగ్గా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్‌లో, భారత ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ అరేబియాలో పర్యటిస్తున్నప్పుడు జరిగింది. దాని వెనుక లక్ష్యం ఊహించిందే.. అదేమిటంటే "కశ్మీర్‌లో హింస" అంటూ గగ్గోలు పెట్టే పతాక శీర్షికలను అంతర్జాతీయ మీడియాలో వచ్చేలా చేయడం. కశ్మీర్‌కు అయిన గాయాలను నయం చేసి, సమైక్యతా భావనను నెలకొల్పేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను దెబ్బ తీయడం. అంతర్జాతీయ దౌత్యపరమైన రాడార్ దృష్టిలో కశ్మీర్ నిత్యం తగులబడుతున్నట్టుగా కనపడటం.

పాకిస్తాన్ డీప్ స్టేట్ కోరుకుంటున్నది శాంతిని కాదు ఎడతెగని అశాంతిని, అల్లకల్లోలాన్ని. అది ఎంతటి వెర్రిమాలోకం అంటే నరమేధాన్ని సృష్టించడం ద్వారా అంతర్జాతీయంగా సానుభూతిని సంపాదించు కోవచ్చునని కలలు కంటోంది.

**అంతర్గత సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి..**

పాకిస్తాన్ సర్కారు నానారకాల సమస్యలతో

# న్యూయార్క్ టైమ్స్ వక్రీకరణ


The New York Times

**At Least 24 Tourists Gunned ... Militants in Kashmir**

TERRORISTS

Prime Minister Narendra Modi of India called the ... worst against civilians in the region for years, a "te... vowed to bring the perpetrators to justice.


ప్రపంచ మీడియాలో చాలా వికారాలు ఉంటాయి. ఉదారవాదం పేరుతో, సెక్యులరిజం పేరుతో, మెజారిటేరియనిజానికి వ్యతిరేకత పేరుతో ఆ మీడియా ఆ వికారాలను ప్రదర్శిస్తూ ఉంటుంది. పెహల్గావ్ ఉగ్రవాద దాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెంటనే ఖండించారు. మృతుల కుటుంబాలకు వెంటనే సానుభూతి తెలియచేశారు. కానీ కరుడ గట్టిన భారత వ్యతిరేకతను ప్రదర్శించే న్యూయార్క్ టైమ్స్ పత్రిక వ్యాఖ్యాన్ని ఇదే సందర్భంలో అమెరికా సరి చేసింది. పెహల్గావ్‌లో "మిలిటెంట్లు" కాల్పులు జరిపి 24 మందిని చంపారని ఆ పత్రిక రాసింది (వాస్తవానికి మృతులు 26). దీనితో అమెరికా విదేశ వ్యవహారాల శాఖ రంగంలోకి దిగి, వాళ్లు మిలిటెంట్లు కాదు, టెర్రరిస్టులు అని సరిదిద్దింది.

మిలిటెంట్లు అంటే ఎవరు? ఒకదానిని ప్రగాఢంగా విశ్వసిస్తూ, ఆ సూత్రం పునాదిగా రాజకీయ, సామాజిక మార్పును తేవడానికి తీవ్రంగా పనిచేసేవాడు మిలిటెంట్. ఇది కచ్చితంగా తీవ్ర స్థాయిలో ఉంటుంది. అలాగే ఇతరులకు ఆమోదయోగ్యంగా ఉండదు.

టెర్రిస్టులు అంటే ఎవరు? తమ రాజకీయ లక్ష్యాలను చేరుకునేందుకు చట్ట విరుద్ధమైన హింసతో ప్రధానంగా పౌరులను భయకంపితులను చేసేవాడు టెర్రరిస్టు. ఇప్పుడు న్యూయార్క్ టైమ్స్ దృష్టిలో కశ్మీర్ ఉగ్రవాదులు సామాజిక రాజకీయ మార్పును తేవడానికి తీవ్ర పంథాలో పనిచేస్తున్నవాళ్లు మాత్రమే.

నిజానికి 26 మంది మృతులలో 25 మంది హిందువులే. ఒకరు ముస్లిం.

# సింధు జలాల ఒప్పందం సిగ్గు చేటు



సింధు నదీజలాల ఒప్పందం విషయంలో ప్రథమ ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూ ఘోర తప్పిదం చేశారని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. సింధు నదిజలాల ఒప్పందం మీద నెహ్రూ 1960లో సంతకం చేసి అతిపెద్ద వ్యూహాత్మక తప్పిదానికి పాల్పడ్డారని శర్మ వివరించారు. భారత్ నదులకు ఎగువ భాగాన ఉన్నప్పటికీ అమెరికా, ప్రపంచ బ్యాంకుల ఒత్తిడుల మేరకు 80 శాతం సింధు నది బేసిన్ జలాలను పాకిస్తాన్‌కు ఇవ్వడానికి అంగీకరించారని, సింధు, జీలం, చీనాబ్ నదులపై హక్కును అప్పగించారని శర్మ ఆరోపించారు. దీనితో రావి, బియాస్, సట్లేజ్ వంటి చిన్న నదులే మనకు మిగిలాయని వివరించారు.

అగచాట్లు పడుతోంది. బలోచిస్తాన్‌లో తిరుగుబాటు పతాక స్థాయికి చేరుకుంది. ఖైబర్ పక్తున్‌క్వా పాకిస్తాన్ చేజారిపోతోంది. జనరల్ ఆసిమ్ మునీర్ నేతృత్వంలో సైన్యం వైఫల్యాలు కోకొల్లలు. ఇలాంటి పరిస్థితుల్లో వాటి నుంచి దేశ ప్రజల దృష్టిని, అంతర్జాతీయ సమాజం దృష్టిని మళ్లించడానికి పాకిస్తాన్ అలమటించిపోతోంది. అలా దృష్టి మళ్లించడంలో భాగంగానే దాయాది దేశం పెహల్గావ్‌లో నరమేధానికి తెరతీసింది. పెహల్గావ్‌లో పేల్చిన ఒకొక్క తూటా హిందువులను మాత్రమే కాకుండా పాక్ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించడాన్ని కూడా లక్ష్యంగా చేసుకుంది.

**రక్తపాతంతో కొత్త జిహాదీలకు ఎర**

పాకిస్తాన్‌లో ఉగ్రవాదులకు పురుడుపోసే ప్రసూతి కేంద్రాలుగా మదర్సాలు, అతివాద మసీదులు, లష్కరే తోయిబా లాంటి ఉగ్రవాద మూకలు ఉన్నాయి. ఈ ఉగ్రవాద ప్రసూతి కేంద్రాలకు ఏదైనా రక్తపాతాన్ని కళ్లచూస్తేనే కాని కొత్తగా జిహాదీలను నియమించు కోవడం కుదరదు.

ఉగ్రవాద శిబిరాలను, సంస్థలనుపెంచి పోషించే ధూర్తులు యుక్తాయుక్త విచక్షణ లేకుండా సాగించే మారణహోమాలను పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటారు. ఆ ప్రచారంతో అమాయక యువతకు వల వేస్తారు. ఇస్లాం ఉగ్రవాదం అనే సాలెపురుగు గూటిలోకి చేరుస్తారు. అలా మతోన్మాద మాయలో పడిన యువతను ఆత్మాహుతి దళంలో సభ్యులుగానో, భద్రతా బలగాలపై రాళ్లు రువ్వే మూకగానో తయారు చేస్తారు.

**నమ్మకమనే వారధిపైనా దాడి**

ఉగ్రవాదుల చేతుల్లో 26 మంది దుర్మరణం వారి కుటుంబాలకు పెను విషాదాన్ని మిగిల్చింది. అది కశ్మీర్‌లో సాధారణ స్థితి తీసుకొని వచ్చే దిశగా జరుగుతున్న సున్నితమైన ప్రక్రియను దెబ్బ తీసింది. ఆర్థిక పునరుజ్జీవనానికి అతి పెద్ద ఆశాకిరణమైన పర్యాటకం ఇప్పట్లో పుంజుకోవడం కష్టమే.

తల్లిదండ్రులెవరూ కూడా వారి పిల్లల్ని గుల్‌మార్గ్ లేదా పెహల్గావ్‌కు ధైర్యం చేసి పంపించరు. ఏ ఒక్క కుటుంబమూ కూడా శ్రీనగర్‌లో నిర్భయంగా హౌస్ బోట్‌ను బుక్ చేసుకోదు. సరిగ్గా ఇదే భారత్ శత్రువులు కోరుకుంటున్నది. తాజా దాడి ఒక్క హిందువుల మీదనే కాదు కశ్మీర్, మిగిలిన భారత్ మధ్య నిర్మించుకున్న నమ్మకమనే సున్నితమైన వారధి మీద కూడా జరిగింది.

**దెబ్బకు దెబ్బ తీయాలి**

- నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ)ను అంటిపెట్టుకొని భారత్‌పై ఎప్పుడెప్పుడు దాడి చేద్దామా అని గోతికాడ నక్కల్లా టెర్రరిస్టులు దాక్కున్న కలుగులను ఒక్కటి కూడా వదిలిపెట్టకుండా నామరూపాల్లేకుండా చేయాలి.
- అందివచ్చిన ప్రతీ అంతర్జాతీయ వేదికను వాడుకుంటూ పాకిస్తాన్‌ను దౌత్యపరంగా, ఆర్థికంగా ఏకాకిని చేయాలి.
- భారతదేశంలోనే ఉంటూ, ఇక్కడి హిందువుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతుకుతూ 'మానవ హక్కులు' లేదా 'స్వరాజ్యోద్యమం' పేరుతో అలాంటి ఇస్లాం ఉగ్రవాదాన్ని సమర్థించేవారిని నిర్దాక్షిణ్యంగా ఏరిపారేయాలి.
- ఉగ్రదాడులకు తలొగ్గకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టడం ద్వారా ధార్మిక, పూర్వ సంస్కృతి పర్యాటకానికి ఊతమివ్వాలి.

**శత్రువులకు గట్టి బుద్ధి చెప్పాలి**


అమాయక హిందువులను చంపడంతో భారత్ సత్తువ కోల్పోతుందని ఎవరైనా అనుకుంటే అది ఒట్టి భ్రమగానే మిగిలిపోతుంది. అమరుడైన ఒక్కొక్క హిందువు కోసమని వేలాదిగా హిందువులు ధర్మం పట్ల, దేశం పట్ల అచంచలమైన భక్తితో ముందుకు వస్తారు. ధర్మం, దేశం రెండూ కూడా శతాబ్దాలుగా చౌరబాట్లు, జిహాద్‌లు, సామూహిక హత్యాకాండ, వలసవాద దోపిడీని తట్టుకొని నిలబడ్డాయి.

నిన్నటి చౌరబాటుదారులకు పట్టిన గతే నేటి ఉగ్రమూకలకు, వారిని వెన్నంటి నిలిచే పొరుగు దేశానికి పడుతుంది. భారత్ ఒక్కనాటికీ మరచిపోదు.. మన్నించదు. పెహల్గావ్ నరమేధానికి ప్రతిగా శత్రువుల ఊహాకందని రీతిలో ప్రతీకారం తీర్చుకుంటుంది. పెహల్గావ్ మృతుల ఆత్మలకు సద్గతులు కలగాలని భగవంతుని ప్రార్థిద్దాం.

– జాగృతి డెస్క్



# పాశ్చాత్య మీడియా పక్షపాత వైఖరి




**ఏప్రిల్ 22...జమ్ముకశ్మీర్‌లో పర్యాటకరంగం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదనడానికి ఉదాహరణగా నిలిచిన పెహల్గావ్‌లోని ప్రిస్టిన్ పర్వత ప్రాంతం ఒక్కసారిగా ఉగ్రవాదుల తుపాకుల మోతలు, ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులు...వారి బంధువుల ఆర్తనాదాలతో విలవిలలాడింది. మాస్కులు ధరించి వచ్చిన ముష్కరులు, హిందువులుగా గుర్తించిన వారిపై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్పులు జరిపి హతమార్చారు. ఆ ఉగ్ర ఘాతుకానికి బలైనవారిలో 25 మంది హిందువులు కాగా ఒక్కరు షియా వర్గానికి చెందిన ముస్లిం.**

గత ఆరేళ్లుగా ఎంతో ప్రశాంతంగా ఉన్న జమ్ము-కశ్మీర్ ఈ సంఘటనతో ఒక్కసారిగా కలవర పాటుకు గురైంది. ప్రపంచ మీడియా ఈ దారుణ సంఘటనను కవర్ చేయడంలో మరోసారి తన నిర్లక్ష్యాన్ని, వివక్షను ప్రదర్శించడం గమనార్హం. ముఖ్యంగా కశ్మీర్‌ను 'ఇండియన్ అడ్మినిస్టర్డ్ కశ్మీర్', 'తుపాకులు ధరించిన గుర్తు తెలియని వ్యక్తులు' అంటూ వార్తలు ప్రచురించి మరోసారి హిందువుల పట్ల తన వివక్షను వెల్లడించింది. 'ఇస్లామిక్ ఉగ్రవాదుల చేతుల్లో హిందువుల హత్య' అని రాయకుండా 'తుపాకులు ధరించిన గుర్తు తెలియని వ్యక్తులు', 'భారత్ అధీనంలోని కశ్మీర్' అంటూ రాయడం ద్వారా మరోసారి అస్పష్ట వైఖరిని అనుసరించడం పాశ్చాత్య మీడియాకే చెల్లింది. ఈ రకమైన రాతల ద్వారా బాధితులైన వారి గుర్తింపును కావాలనే నిర్లక్ష్యం చేసినట్లయింది. ఇస్లామిక్ ఉగ్రవాదుల స్థానంలో 'తుపాకులు ధరించిన వ్యక్తులు' అని పేర్కొనడం కూడా వాటి నిర్లక్ష్యానికి నిదర్శనం.

**యూదులకో నీతి... హిందువులకు మరో నీతి**

పిట్స్‌బర్గ్‌లో ప్రార్థనలు చేస్తున్న యూదులపై కాల్పులు జరిపి 26 మందిని హతమార్చినప్పుడు న్యూయార్క్ టైమ్స్ పత్రిక "యూదు వ్యతిరేక ఉగ్రవాదం" అని రాయడానికి ఎంతమాత్రం సంకోచించలేదు. ఈస్టర్ ఆదివారం పండుగ రోజున శ్రీలంకలో క్రైస్తవులపై కాల్పులు జరిపి హతమార్చి నప్పుడు బీబీసీ, సీఎన్ఎన్‌లు దీన్ని మతపరమైన ఉగ్రవాదంగా పేర్కొన్నాయి. మరి అదే భారత్‌లో హిందువులను హతమారిస్తే వీరు రాసే విధానం ఒక్కసారిగా మారిపోతున్నది. కశ్మీర్‌లో హిందువులను హతమార్చిన ఇస్లామిక్ ఉగ్రవాదులు ఒక్కసారిగా "తుపాకులు ధరించిన గుర్తుతెలియని వ్యక్తులు" మారిపోతారు. బీబీసీ, వాషింగ్టన్ పోస్ట్, అల్‌జెజీరాలు సరిగ్గా ఇదే పదాన్ని ఉపయోగించాయి. రాయిటర్స్, ఎన్‌వైటీ, ఏపీ సంస్థలు "మిలిటెంట్లు" అని రాసాయి. కొన్నిచోట్ల అల్ జెజీరా "తిరుగుబాటు దారులు" అని పేర్కొంది. ఈ ఉగ్రవాదుల దాడిని "కాల్పులు", "దాడి" లేదా "పర్యాటకులపై అరుదైన దాడి"గా పాశ్చాత్య మీడియా అభివర్ణించింది. ఇదొక ఉగ్రవాద మన్న దృక్పథంతో ఈ మీడియా సంస్థలు రాయక పోవడం విచారకరం. యాదృచ్ఛికంగా ఇటువంటి భాషా ప్రయోగం చేశారనుకోవడం అమాయకత్వమే. ఎందుకంటే దాడికి పాల్పడిన ముష్కరుల గుర్తింపును, మరణించిన హిందువుల గుర్తింపును వెల్లడి చేయకుండా సంఘటన తీవ్రతను కావాలనే తక్కువ చేసి చూపడం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది.

**లింగ వివక్షగా చిత్రించడానికి యత్నం**

పెహల్గావ్ ఉగ్రవాద సంఘటలో స్త్రీ, పురుషులనే అంశాన్ని ముందుకు తెచ్చి, కేవలం పురుషులను మాత్రమే హతమార్చారంటూ రాయడం ద్వారా రాయిటర్స్ సంస్థ ఈ ఇస్లామిక్ ఉగ్రవాద దాడిని పూర్తిగా వక్రీకరించే యత్నం చేసింది. ముఖ్యంగా పురుషులను, మహిళలు, పిల్లల నుంచి ఏ విధంగా వేరుచేసి హతమార్చింది వివరిస్తూ దీన్నొక లింగవివక్ష సంఘటనగా చిత్రీకరించింది. సీఎన్ఎన్ ఏకంగా బాధితుల్లో కొందరు ప్రధాని మోదీకి మద్దతు దారులుగా ఆరోపణలున్నట్టు రాసింది. ఇక ఏపీ సంస్థ అయితే భారత ప్రభుత్వ పాలనపై పోరాటం చేస్తున్న తీవ్రవాదులు ఇందుకు బాధ్యులు అని పేర్కొనడం ద్వారా, హంతకులను స్వాతంత్ర్య పోరాటదారులుగా చెప్పడానికి ప్రయత్నించింది. ఈ విధంగా సంఘటన జరిగిన తర్వాత మొట్టమొదట వచ్చిన వార్తల్లో ఎక్కడా మరణించిన వారు హిందువులని, హంతకులు ఇస్లామిక్ తీవ్రవాదులన్న

**'కార్టూన్ పోటీ-2025'లో తృతీయ బహుమతి పొందినది**










విషయమే పేర్కొనకపోవడం గమనార్హం.

**ఉగ్రవాదంపై పోరుకు వెన్నుపోటు**

ఇక్కడ గుర్తుతెలియని వ్యక్తులుగా ఇస్లామిక్ ఉగ్రవాదులను పేర్కొనడమే కాకుండా, భౌగోళిక–రాజకీయ అంశాల్లో కూడా పాశ్చాత్య మీడియా సంస్థలు కావాలనే పక్షపాతంతో వ్యవహరించాయను కోవాల్సి వస్తోంది. ముఖ్యంగా అవి ప్రయోగించిన పదబంధాలు దీన్ని స్పష్టం చేస్తున్నాయి. "ఇండియన్ అడ్మినిస్టర్డ్ కశ్మీర్", "ఇండియన్ కంట్రోల్డ్ కశ్మీర్" అని కొన్ని మీడియా సంస్థలు, మరికొన్ని మరింత ముందుకెళ్లి "వివాదాస్పద భూభాగం" అని కూడా రాశాయి. ఇవేవో యాదృచ్ఛికంగా ప్రయోగించిన పదజాలంగా భావిస్తే అమాయకత్వమే. ఈ ప్రాంతంపై భారత సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించే రీతిలో జాగ్రత్తగా ఉపయోగించిన పదబంధాలుగా భావించాల్సి వస్తోంది. కశ్మీర్‌పై సార్వభౌమాధి కారాన్ని భారత రాజ్యాంగమే స్పష్టంగా పేర్కొంది. కశ్మీర్, ఇండియన్ యూనియన్‌లో విలీనమైన తర్వాత అక్కడ అనుసరించిన ప్రజాస్వామ్య విధానాలు దీన్ని మరింత స్పష్టం చేశాయి కూడా. అయినప్పటికీ గ్లోబల్ మీడియా సంస్థలు మాత్రం ఇండియన్ యూనియన్‌లో రాజ్యాంగబద్ధంగా విలీనమైన ప్రాంతంగా కంటే పాకిస్తాన్ భాషలో దీన్ని 'ఎవరికీ చెందని భూమిగా' పేర్కొనడానికే ప్రాధాన్యతనివ్వడం గమనార్హం. ఆ విధంగా భారత్‌ను ఈ ప్రాంతాన్ని ఆక్రమించిన దేశంగా చూపడానికే యత్నించాయి తప్ప, ఈ ప్రాంతంలోని హిందువులను మతపరమైన ఉగ్రవాదం నుంచి రక్షిస్తున్న రాజ్యంగా చూపడంలేదు. మీడియా చేస్తున్న ఈ విధమైన పదప్రయోగాలు 1947 నాటి "ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ యాక్సెషన్" ప్రకారం కశ్మీర్ భారత్‌లో చట్టబద్ధంగా విలీనమైన ప్రాంతమన్న సత్యాన్ని పక్కన పెడుతున్నాయి. ఇదే సమయంలో జిహాదీ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ, తీవ్రవాద ఫ్యాక్టరీగా మారిన పాకిస్తాన్‌కు అనుకూలంగా ఈ పదజాల ప్రయోగాలు ఉంటున్నాయి. ఈ విధమైన రాతలు భారత్ కొనసాగిస్తున్న ఉగ్రవాదంపై పోరుకు వెన్నుపోటు పొడవడం తప్ప మరోటికాదు.

**తప్పుడు కథనాలు**

సంఘటన జరిగిన కొద్ది రోజులకు, అల్ జెజీరా "మేం శాపగ్రస్తులం: పెహల్గావ్ హత్యల తర్వాత దాడుల భయంలో కశ్మీరీలు" పేరుతో ఒక ఫీచర్ స్టోరీని ప్రసారం చేసింది. అసలు విషయాన్ని పూర్తిగా తప్పుదోవ పట్టించారనడానికి ఇంతకు మించిన ఉదాహరణ మరోటుండదు. కశ్మీర్‌కు దూరంగా ఎక్కడో ఒక దేశంలోని నగరంలో కూర్చొని వార్తలను తన చిత్తం వచ్చిన రీతిలో వండి వార్చడం తప్ప మరోటి కాదు. ఇక ఇస్లామిక్ ఉగ్రవాదులు, హిందువులను పొట్టన పెట్టుకున్న రెండు రోజుల తర్వాత గ్లోబల్ మీడియాలో విచిత్రంగా ముస్లింలకు వ్యతిరేకంగా ప్రతిక్రియ మొదలు అంటూ కథనాలు వండివార్చడం మరో విచిత్రం. "దాడికి వ్యతిరేకంగా జమ్ములో నిర్వహించిన ప్రదర్శనలకు 'రైట్ వింగ్ విజిలెంట్స్' నాయకత్వం వహించారు" అని గార్డియన్ దినపత్రిక రాసింది. నిరాయుధులైన అమాయక హిందువులపై మతఛాందస ఉగ్రవాదులు జరిపిన దాడికంటే ఈ పత్రిక ప్రయోగించిన 'రైట్ వింగ్ విజిలెంట్స్" అనే పదం దారుణంగా ఉందనే చెప్పాలి. విషాదమేమంటంటే బాధితులు హిందువులన్న అంశాన్ని ఏ పాశ్చాత్య మీడియా సంస్థ రాయ పోవడం. ఇది యాదృచ్ఛికమా లేక కావాలనే అట్లా చేశారా అన్నది ఇక్కడ ప్రధాన ప్రశ్న. ఇక బీబీసీ "బాధితుల్లో అధికులు హిందువులు" అని రాయడం కొంతలో కొంత మెరుగు. అయితే "మృతుల్లో ఒక ముస్లిం కూడా ఉన్నాడు" అని చెబుతూ, ఈ దాడి 'యాదృచ్ఛిక సంఘటన'గా స్థానికులు తెలిపారని పేర్కొంది. సీఎన్ఎన్, ఏపీ, ది గార్డియన్ వంటి మీడియా సంస్థలు బాధితులు "హిందువులు" అన్న పదాన్ని తమ తొలి నివేదికల్లో విస్మరించడం గమనార్హం.

**యూదుల దుకాణంపై ఇస్లామిస్టుల దాడి**

2015లో ప్యారిస్‌లోని యూదుల కిరాణా స్టోర్స్‌పై ఇస్లామిక్ ఉగ్రవాదులు యూదులు లక్ష్యంగా దాడులు చేశారని పాశ్చాత్య మీడియా కథనాలు రాసింది. న్యూజిలాండ్‌లోని క్రైస్ట్ చర్చ్ మసీదుపై దాడి జరిగినప్పుడు ఇదే మీడియా 'ముస్లిం' అన్న పదాన్ని స్పష్టంగా పేర్కొంది. మరి పెహల్గావ్‌లో హిందువులు, ఇస్లామిక్ ఉగ్రవాదుల కాల్పుల్లో మరణిస్తే, 'హిందువులు' అనే పదాన్ని రాయడానికి ఈ మీడియాకు చేతులు రాలేదు. కాల్పులు జరిపిన వారినేమో 'గన్‌మెన్' అని, మరణించినవారిని 'బాధితులు' అని మాత్రమే పేర్కొని చేతులు దులుపుకున్నాయి. ఇక్కడ ముఖ్యంగా ఇస్లామిక్ ఉగ్రవాదానికి ప్రధాన లక్ష్యంగా మారిన 'హిందువులను' వారి మతంతో పేర్కొనడానికి ఈ మీడియా సంస్థల ఎడిటోరియల్ బోర్డులు అంగీకరించడం లేదని భావించాల్సి వస్తున్నది. జరిగిన వాస్తవాన్ని వెల్లడించకుండా ఆయా సంస్థలు హిందువుల గౌరవాన్ని కించపరుస్తున్నాయనుకోవాలి. ఆ విధంగా హిందువులు తమ బాధను, మనోవేదనను బాహ్య ప్రపంచానికి వెల్లడించే హక్కును కూడా కోల్పోతు న్నారు. ప్రతి చిన్న విషయానికి అతిగా స్పందించే గ్లోబల్ మీడియా ఇస్లామిక్ ఉగ్రవాదుల చేతుల్లో హిందువులు మరణిస్తే, కప్పదాటు వైఖరిని ఎందుకు ప్రదర్శిస్తున్నది?

**కులీన మీడియా ఆధిపత్య ధోరణి**

దీనికి ప్రధాన కారణం ప్రపంచ వ్యాప్తంగా కులీన మీడియా ఒక ఆధిపత్య వాతావరణాన్ని నిర్మిస్తూ వచ్చింది. ఈ మీడియాకు బాధితులుగా ఉన్న హిందువులు కనిపించరు. అదీకాకుండా ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ పురోగమనంలో ఉండటం, అంతర్జాతీయ దౌత్యంలో భారత్ దృఢమైన వైఖరితో వ్యవహరిస్తుండటాన్ని, ఈ మీడియా అనుమానాస్పద దృక్కులతో చూస్తోంది. వలసవాద కాలం ముగిసిన తర్వాత పాశ్చాత్య మీడియా సంస్థలు "పీడకులు" "పీడితులు" అనే సంక్లిష్ట ద్వైదీభావంలో కొట్టుమిట్టాడు




తున్నాయి. ఈ చట్రంలో ఇరుక్కుపోయిన వారు కశ్మీర్ హింసలో బాధితులు హిందువులైనా వారిని హిందువులుగా గుర్తించడానికి అంగీకరించరు. అంతర్జాతీయ జిహాదీ సిద్ధాంతంతో పెచ్చరిల్లుతున్న ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని కేవలం "పాలకులకు వ్యతిరేకంగా జరిపే పోరాటం"గా మాత్రమే పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో కశ్మీర్‌లో జరుగుతున్న హిందువుల నరమేధం వీరి ద్వైదీభావ చట్రంలో ఇమడక పోయేసరికి, ఈ మరణాలను నరేంద్రమోదీకి వ్యతిరేకంగా రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ముఖ్యంగా 370 అధికరణాన్ని రద్దు చేయడాన్ని ప్రస్తుత పరిణామాలకు కారణంగా చూపడానికే మొగ్గుచూపుతున్నారు. ఇస్లామిక్ మతఛాందస వాదంతో ఉగ్రవాదులు, హిందువులను చంపేస్తున్నారన్న సత్యాన్ని ఒప్పుకోకుండా కప్పదాటు వైఖరినే అనుసరిస్తున్నారు. గ్లోబల్ మీడియా ఇదేవిధంగా హిందువులపై, ఇస్లామిస్ట్ ఉగ్రవాదాన్ని అంగీకరించకపోతే ఈ హింసాకాండ యధేచ్ఛగా కొనసాగుతూనే ఉంటుంది. ఫలితంగా కొన్ని మరణాలకు (ఉగ్రవాదుల) పెద్ద ఎత్తున మౌనం పాటించడం, నిజమైన బాధితులను పట్టించుకునేవారు లేని దుస్థితి ఏర్పడుతుంది. కశ్మీరీ పండిట్లను తమ సొంత రాష్ట్రం నుంచి తరిమేయడం, బాంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, పాకిస్తాన్‌లో దేవాలయాలను అపవిత్రం చేయడం వంటివి జరుగుతున్నప్పుడు, హిందువుల బాధలు పాశ్చాత్య మీడియాకు పట్టడంలేదు. పెహల్గావ్ సంఘటన విషయంలో పాశ్చాత్య మీడియా నిర్లక్ష్యంగా ఇటువంటి పదజాలాన్ని ప్రయోగించిందని భావించడానికి వీల్లేదు. ఇస్లామిక్ ఛాందసవాద హింసకు, హిందువులు బలవుతున్న విధానాన్ని ప్రపంచానికి తెలియకుండా చేయడానికి కొనసాగుతున్న ప్రయత్నాలను పెహల్గావ్ సంఘటన మరోసారి బహిర్గతం చేసింది.

**ప్రపంచదేశాల దన్ను**


పెహల్గావ్ ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయి. ఇరాన్, ఇజ్రాయిల్, ఇటలీ, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్, బాంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక, చైనా, పాకిస్తాన్ దేశాలు ఉగ్రవాద దాడిని ఖండించాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ మృతులకు సంతాపం తెలపడమే కాకుండా అపత్కాలంలో భారత్‌కు అండగా నిలుస్తామని చెప్పారు. రష్యా అధ్యక్షులు పుతిన్ దాడికి కారకులైన వారు కఠిన శిక్షకు అర్హులన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటామని పునరుద్ఘాటించారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలొనీ, యు.కె. ప్రధాని కీర్ స్టార్మర్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నేతన్యాహు, జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్, ఉక్రెయిన్ రాయబార కార్యాలయం కూడా సంఘటనను ఖండించింది. కాగా పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఖ్వాజా అసీఫ్, ఈ దాడికి తమ దేశానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

**చైనాకు భారత్ అవసరం**

చైనా విషయానికి వస్తే ప్రస్తుతం భారత్–పాక్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో తన ఆప్తమిత్రుడు పాకిస్తాన్‌కు ప్రత్యక్షంగా మద్దతు ఇచ్చే పరిస్థితి లేదు. ఆమెరికాతో వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న తరుణంలో చైనా ఇప్పుడు మార్కెట్ల కోసం వెంపర్లాడుతోంది. ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న ఇండియాను వదులుకోలేని పరిస్థితి! అదీకాకుండా గల్వాన్ సంఘటన తర్వాత ఇప్పుడిప్పుడే రెండు దేశాల మధ్య సంబంధాలు కొద్ది కొద్దిగా మెరుగుపడుతున్నాయి. కైలాస్ మానస సరోవర యాత్ర మళ్లీ ఈ ఏడాది ప్రారంభం కానుంది. ఇవన్నీ ఒక ఎత్తయితే, చైనాకు కూడా ఉగ్రవాదం వల్ల ఇబ్బందులు బాగా తెలుసు కనుక ఈ విషయంలో భారత్‌తో విభేదించడం సాధ్యం కాదు. ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు భారత్‌కు అండగా నిలిచాయి. గతంలో అమెరికా, పాకిస్తాన్‌కు వెన్నుదన్నుగా ఉండేది. కానీ మారిన పరిస్థితుల్లో డోనాల్డ్ ట్రంప్, ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇస్లామిక్ దేశాలన్నీ దాదాపుగా భారత్‌కే మద్దతిస్తున్నాయి. కశ్మీర్ సమస్య వాటి దృష్టిలో ఒక అరిగిపోయిన రికార్డు వంటిది. వాణిజ్య లాభాలు భారత్‌తో ఉంటే, ఒక్క మతం తప్ప మరే ఇతర ప్రయోజనం లేని పాకిస్తాన్‌తో అంటకాగడం ఆత్మహత్యా సదృశమన్న సంగతి వాటికి బాగా తెలుసు. పాకిస్తాన్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న టర్కీ కూడా ఉగ్రవాద దాడిని ఖండించింది. భౌగోళికంగా భారత్‌ను వ్యతిరేకిస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో టర్కీకి బాగా తెలుసు. అందుకని పాకిస్తాన్ ఎంతగా కలుపుకుపోదామనుకున్నా, టర్కీ మౌనంగా ఉంటోంది.

ఇక పాక్ మద్దతుదారైన మలేసియా కూడా ఇండియాకు వ్యతిరేకంగా మాట్లాడలేని పరిస్థితి. ఎందుకంటే అక్కడినుంచి అత్యధికంగా పామాయిల్ దిగుమతి చేసుకునేది మనదేశమే! అందువల్ల గత యుద్ధాలతో పోలిస్తే ఇప్పుడ పాకిస్తాన్ పూర్తి ఒంటరి! అసీమ్ మునీర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, తర్వాత ఉగ్రవాద దాడితో మొత్తం పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. సంఘటన తర్వాత దౌత్యపరంగా పాకిస్తాన్ తప్పులు మీద తప్పులు చేస్తోంది. ఇరాన్ మధ్యవర్తిత్వం వహిస్తానన్నా, అస్థిరత్వంతో కొట్టు మిట్టాడుతున్న ఆ దేశానికి ఎంతమేర ఈ సామర్థ్యం ఉన్నదనేది ప్రశ్నార్థకమే! ముఖ్యంగా పాక్ తీవ్ర వాదులతో ఇరాన్ కూడా ఇబ్బందులు పడుతోంది.

ప్రస్తుతం నరేంద్రమోదీ ప్రభుత్వం కూడా పాకిస్తాన్‌పై ఏదో ఒక చర్య తీసుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ఆరేళ్ల తర్వాత మళ్లీ ఇటువంటి దుస్సంఘటన జరగడంతో దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్రస్థాయిలో భావోద్వేగాలు వ్యక్తమవుతున్నాయి. అసలే క్రియాశీలకంగా పేరు సంపాదించుకున్న ఎన్‌డీఏ ప్రభుత్వం, దేశీయంగా, అంతర్జాతీయంగా లభిస్తున్న పూర్తి మద్దతు నేపథ్యంలో ఉపేక్షించి ఊరుకుంటుందనేది ఉత్తిమాట! అందునా ప్రధాని ఇప్పటికే ఉగ్రవాదులు ఊహించని రీతిలో శిక్షిస్తామని ప్రకటించారు కూడా! శిశుపాలుడి నూరు తప్పులను శ్రీకృష్ణుడు సహించాడు. తప్పిదాలను సరిచేసుకునేందుకు రావణాసురుడికి, శ్రీరామచంద్రుడు అనేక అవకాశాలు ఇచ్చి చివరకు సంహరించాడు. ప్రస్తుతం పాకిస్తాన్ పరిస్థితి కూడా అదే



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# జందెం జగడం–గడిచిన గండం

హిజాబ్‌కు అనుమతి, జరిపించిన కులగణనకు వ్యతిరేకత, సాక్షాత్తు శాసనసభలోనే పాకిస్తాన్‌కు జిందాబాద్ నినాదం వంటి వివాదాలలో చిక్కుకున్న కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మరొక వివాదాన్ని, విమర్శలను మూట కట్టుకుంది. జందెం ఒక వర్గంలో ద్విజన్మ సంస్కారానికి చిహ్నం. నిజానికి జందెం ఒక వర్గం సొత్తు కాదు. కొన్ని వృత్తి కులాలు కూడా ధరిస్తాయి. అయినా అది జాత్యహంకారానికి నిదర్శనం అని కొందరి దురభిప్రాయం. వర్ణ ధర్మం కులానికి, మతానికి అతీతం. వర్ణం కులం కాదు, ధర్మం మతం కాదు. సనాతన ధర్మం నాలుగు వర్ణ ధర్మాలను, నాలుగు ఆశ్రమ ధర్మాలను, రూపొందించింది. ధర్మం, అర్థం, కామం, మోక్షం, పురుషార్థాలు నియమించింది. "చాతుర్వర్ణం మయా సృష్టం గుణ కర్మ విభాగశః" అని గీతావాక్యం.




ఆనాటి వర్ణ వ్యవస్థ విద్యా, పరిపాలనా, వ్యాపార, సేవా, ధర్మాలకు మాత్రమే పరిమితం. వర్ణం వృత్తి ధర్మం. ప్రస్తుతం విస్తృత పరిధిలో వాటి ప్రాధాన్యత విస్మృతికి గురి అయింది. కులం అంటే వంశం; మతం అంటే నమ్మకం. కాలాంతరాన, వాటికి పెడార్థాలు కల్పించి అనర్థాలు సృష్టించింది ఒక వర్గం. ప్రతిభను దిగజార్చడమే దాని పరమార్థం.

గుణమే ప్రధానం అయినప్పుడు జందెంతో పందెం దేనికి. జన్యువులతో జగడం దేనికి? ఇలాంటి సమస్యలు లేవనెత్తడం కొన్ని అసాంఘిక శక్తులకు సరదా కావచ్చు. జగమెరిగిన వాడికి బ్రహ్మణుడికి జంధ్యమేల?" అన్న సామెత జగద్వితం. సమాజంలో వర్ణభేదం సహజం. ధనవంతుడికి పేదవాడి నీడంటే పడదు. దుర్మార్గుడికి మంచివాడంటే అసూయ; తెలివైనవాడిని చూస్తే బుద్ధిహీనుడికి మంట. స్వజాతివైరం జాతి మనుగడకే ప్రమాదం. ఎంతటి విద్యావంతులు కూడా తమ సంకుచితత్వాన్ని వీడకపోతే సమాజం పురోగమనానికి బదులు తిరోగమనానికే పరిమితం అయిపోతుంది.

పదవీ వ్యామోహంతో కర్ణాటక ప్రభుత్వం ఇటీవల హిందూ ముస్లింల నడుమ అగాధం సృష్టించింది. అది కార్చిచ్చులా చెలరేగి, దేశాన్ని కబళించే పరిస్థితి దాపురించింది. మైనారిటీలలో మెజారిటీగా మారిన ముస్లింలను ఓటు బ్యాంకు రాజకీయాలు పావులను చేసింది. మతకలహాలు, గృహదహనాలు మెండయ్యాయి. "సావిద్యాయా విముక్తయే?" విద్యవలన విముక్తికి బదులుగా, కబంధ హస్తాలలో విద్యా వ్యవస్థ చిక్కు పడి, అవస్థల పాలవుతున్నది.

ఈ కోణం నుంచి చూస్తే ప్రస్తుతం ఒక విద్యా సంస్థ వివాదాస్పదం అయింది. కర్ణాటకలోని బీదర్ జిల్లాలో వృత్తి విద్యా కోర్సుల ప్రవేశ పరీక్ష నిర్వహించడానికి ప్రభుత్వం, జిల్లా స్థాయిలో సాయిస్ఫూర్తి కళాశాలను నియమించింది. కళాశాల కులపతి పేరు చంద్రశేఖర్ బిరుదార్. ఆయన పేరు చివరనున్న బిరుదు బీదర్‌కు తాను జాగీర్దార్‌ని అన్న సూచనలా కనిపిస్తున్నది. భావి భారత విధాతలయిన యువతకు విశాల భావాలు, ఉన్నత ఆదరాశలు, ఆశయాలు, అవసరం. చదువు, సంస్కారాలకు వారు ప్రతినిధులు. బాహాటంగా, ఆచారం పేరిట "హిజాబు"తోగాని పరీక్ష రాయనని ఇదివరకు ఒక ముస్లిం విద్యార్థి వీరంగం సృష్టించిన విషయం విదితమే.

సుచివ్రత్ కులకర్ణి అనే కుర్రాడు జందెం తీయనని చెప్పి, పరీక్ష పోయినా ఫరవాలేదని తిరిగి వెళ్లిపోయాడు. జందెం, ముసుగు, ఒక్కటి కాదు. ఇది మోహానికి అడ్డురాదు. షర్టు లోపల దాగిన ఆ నూలుపోగు పైన పగబట్టి బిరదార్, అతడి అనుయాయి పవార్, పట్టుపట్టి ఇదివరకు ఒకరిద్దరు విద్యార్థుల జందేలు "కట్" చేసిగాని లోపలికి పరీక్ష రాయడానికి అనుమతివ్వలేదు. ఆత్మగౌరవం నిలుపుకోడానికి పరీక్షను వదులుకున్న కులకర్ణి ఉదంతం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ప్రతిభకు మూలం జందెం కాదు, జన్యువు! అన్న సత్యం మరుగున పడింది. ఇది ముఖ్యమంత్రికి తెలిసి జరిగినా, తెలియక జరిగినా ఆయనే బాధ్యుడు. కాంగ్రెస్ హిందూ వ్యతిరేక వైఖరికి మరొక రుజువు తప్ప వేరొకటి కాదనే అనుకోవాలి.

సమాజంలో అంతఃకలహాలు రేపితే అది జ్వాలాముఖిగా మారి ప్రపంచాన్ని దహించి వేస్తుంది. కర్ణాటక రాష్ట్రంలో మత, వర్ణ, విభేదాలు రాజకీయాలలో ప్రధాన పాత్రధారులు. కుల, మత, వర్ణ, విభేదాల ప్రాతిపదికగా, ఏ ప్రభుత్వం వ్యవహరించినా, ఏదో ఒకరోజు కూలిపోక తప్పదు. కర్ణాటక ప్రభుత్వం ముస్లిం ఓట్ల కోసం ఉద్యోగ, వ్యాపారరంగంలో ప్రవేశపెట్టిన రాయితీలు మిగతా మైనారిటీ వర్గాలలోనే కాకుండా, మంత్రివర్గంలోనూ వివాదస్పదం అయింది. కప్పను మింగిన పామును దేగ ఎగరేసుకుపోయిన చందాన, రాజకీయంతో రాష్ట్రంలో శృతిమించి రాగాన పడింది. బ్రాహ్మణులను త్రోసిరాజని, వక్కలిగ వర్గం; వక్కలిక వర్గాన్ని కాదని లింగాయతం, రాష్ట్ర అధికారపగ్గాల కోసం ద్వంద్వ యుద్ధాలు చేశాయి. ప్రతిభకు మారుగా కుల ప్రాతిపదికన కొలువు తీరిన మంత్రుల తీరు, కప్పల తడికగా తయారయింది. పీఠం కదిలిపోయే పరిస్థితి ఎదురుకాగానే, కర్ణాటక ప్రభుత్వం తోకముడిచి, క్షమాపణలు, బరాబరులు చేపట్టి ఆత్మరక్షణలో పడింది. బిరాదార్, పవార్, పర్యవేక్షక ద్వయానికి ఉద్వాసనతోపాటు, ప్రభుత్వం అపరాధం చెల్లించింది. జందెం జగడంలో లెక్కల పరీక్ష తప్పిపోయిన విద్యార్థి సుచిత్ర కులకర్ణిని బీదర్ జిల్లా ఇన్‌ఛార్జి అమాత్యవర్యులు ఈశ్వర్ ఖంద్రౌ రక్షణకు ప్రత్యక్షంగా, ప్రత్యేకంగా ఇప్పుడు రంగంలోకి దిగవలసి వచ్చింది. అడుసు తొక్కడం, కాలుకడగడం దేనికిది? ఏ విద్యాసంస్థలో చేరాలన్నా సాయం చేస్తారట.

కులకర్ణి పరీక్ష రాయకపోయినా బాల్కిలోని భీమణ్ణ ఖంత్రే ఇంజనీరింగ్ కళాశాలలో ఉచితంగా సీటు ఇప్పించడానికి సిద్ధం కావడం, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉచితాల ప్రహసనానికి మరో ఉదాహరణ. కులాల మాదిరిగా వీధి వీధికి ఇంజనీరింగ్ కళాశాలను ప్రసాదించిన కర్ణాటక ప్రభుత్వం ఉచితంగా ఈ నదుపాయాలను కల్పించిందని ఎవరైనా అనుకుంటే, అది వారి అజ్ఞానానికి పరాకాష్ట. ప్రతిభకు బదులు విద్యను విపణివీధిలో అమ్మకానికి పెడితే, అది ప్రజలకు ప్రభుత్వం పట్ల నమ్మకాన్ని వమ్ము చేస్తుంది. ఇక ముందు ఇలాంటి చిలిపి చేష్టలకు వీలు లేకుండా కర్ణాటక ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకపోతే, పతనావస్థకు బారిన కాంగ్రెసు అధఃపాతాళానికి అంకితం కాక తప్పదు.

– నిరామయ

# పొంతన లేని విమర్శలు-



**తెలంగాణ రాజకీయాల్లో టామ్ అండ్ జెర్రీ మాదిరి వ్యవహారం నడుస్తోందన్న సెటైర్లు వినిపిస్తున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రజోపయోగకరమైన చర్చలు, వాదనలకు బదులు.. అనవసరమైన ఆరోపణలు, ప్రత్యారోపణలే కనిపిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఇక, ప్రభుత్వ పాలన కూడా నిరాశా నిస్పృహలతో సాగిపోతోందన్న విశ్లేషణలు ఉన్నాయి. సాక్షాత్తూ ముఖ్యమంత్రి సహా మంత్రులు లేవనెత్తుతోన్న సందేహాలు, బహిరంగ సభల్లో అధికారుల పనితీరుపై చేస్తున్న వ్యాఖ్యలు, సమీక్షల్లో వెల్లడిస్తోన్న అభిప్రాయాలు వీటిని బలపరుస్తున్నాయి. ఓవైపు అధికార కాంగ్రెస్ పార్టీ... మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల తీరు, వ్యవహార శైలి.. ఆరోపణలు, ప్రత్యారోపణలు తెలంగాణ ప్రజలకు ఓ రకమైన వినోదంలా మారాయన్న వ్యంగ్యోక్తులు కూడా సాగుతున్నాయి.**

తెలంగాణలో తాజా పరిణామాలు చూస్తే.. బీఆర్ఎస్ పార్టీ (పూర్వనామం టీఆర్ఎస్) ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వరంగల్ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఆ సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేసింది. ఏడాదిన్నర కాలంగా ఫామ్ హౌజ్‌కు మాత్రమే పరిమితమైన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేకర రావు ఎట్టకేలకు ఈ సభలో ప్రసంగించారు. తాము ఏం చేయబోతున్న దీర నిర్మాణాత్మకంగా ఎలా ముందుకు సాగుతారో చెప్పకుండా అధికార కాంగ్రెస్ పార్టీపై అంతెత్తున విరుచుకుపడ్డారు. ఆ విమర్శలు కూడా ఏదో చేయాలి కాబట్టి అన్నట్లు మొక్కుబడిగా ఉన్నాయే తప్పితే.. ఆయన ప్రసంగం గతంలో మాదిరిగా ధాటిగాకాని, ప్రభుత్వాన్ని నిలదీసిన స్వరం కానీ ఎవరికీ అనిపించ లేదు. అంతా చప్పగా సాగింది. మంత్రులు ఏదో జరిగిపోయిందన్నట్లుగా వెంటనే ప్రతి స్పందించారు. మొక్కుబడిగా కాకుండా అప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటికి వచ్చి మరీ మీడియాతో మాట్లాడారు. ఆ మరునాడే రేవంత్ రెడ్డి కూడా కౌంటర్ ఇచ్చారు. అసలు ఏ అంశం మీద ప్రతిస్పందిచాలో, కూడదో అర్థం కాని పరిస్థితుల్లో మాట్లాడారు. తానేం చేశానో, తమ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పుకొచ్చారు. కానీ కేసీఆర్ ప్రసంగంలో,అదే సమయంలో మంత్రుల ప్రతిస్పందన అంత ప్రభావితంగాలేదు.

**ఆ జోష్ ఏమైపాయె?**

భారత రాష్ట్ర సమితిగా మారిన తెలంగాణ రాష్ట్ర సమితి వరంగల్ శివారులో సభ నిర్వహిం చింది. దాదాపు రెండు నెలల పాటు కసరత్తు చేసి మరీ సభ నిర్వహించారు. ప్రజలంతా కేసీఆర్ కోసం ఎదురు చూస్తున్నారన్న ఆలోచన కలిగించాలనుకు న్నారు. దానికి తగ్గట్లుగా ఖర్చుకు వెనుకాడకుండా సభ ఏర్పాట్లు చేశారు. కానీ, ఫలితం ఎంత అనేది మాత్రం అందరినీ పెదవి విరిచేలా చేసింది. బీఆర్ఎస్ శ్రేణుల్లో .. మరో సభకు వెళ్లాం.. వచ్చాం అన్న ఫీలింగ్‌తోనే తేలిపోయింది. బహిరంగసభ నిర్వహణకు ఉండాల్సిన.. ప్రధానంగా గత టీఆర్ఎస్ పార్టీ సభకు, కేసీఆర్ పాల్గొన్న సభకు ఉండాల్సిన భావోద్వేగం ఈ సారి కనిపించలేదు. బలవంతంగా చేసినట్లుగా అనిపించడంతోనే సభ అంతా కృత్రిమంగా కనిపించిన ఫీలింగ్ వచ్చిందని సొంత పార్టీ నేతలే అంటున్నారు.

వాస్తవానికి బీఆర్ఎస్ పార్టీకి బహిరంగ సభల్ని నిర్వహించడంలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వాళ్లు నిర్వహించే సభకు జనం రావడం మొదటినుంచీ పెద్ద విషయం కాదు. ఎందుకంటే ఆ పార్టీ పెట్టిన తర్వాత తెలంగాణ ఉద్యమం సెంటిమెంట్ జనాన్ని సభలకు లాక్కొచ్చేది. ఆ సెంటిమెంట్‌కు తోడు.. కేసీఆర్ మైమరిపించే ప్రసంగం కూడా తెలంగాణ వాసులకు బాగా నచ్చేది. దీంతో, జనం తండో పతండాలుగా వచ్చేవారు. ఇక, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత అప్పటి టీఆర్ఎస్‌కు అధికార పార్టీ హోదా కూడా వచ్చింది. ఇక జనం లోటు లేకుండా పోయింది. అలా సాగిపోయిన బహిరంగసభలు.. ఇప్పుడు చప్పగా సాగే స్థాయికి చేరుకున్నాయి. ఈ సభను విజయవంతం చేసేందుకు అన్ని స్థాయిల్లోని నేతలకు టార్గెట్ పెట్టారు. అయితే, గతంలో పండిన సెంటిమెంట్ ఇప్పుడు అంతగా కనిపించలేదన్నది అందరూ చెబుతున్నమాట.

**కుటుంబంలో ఆధిపత్య పోరు?**

ఇక, తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయినప్పటి నుంచి ఆ పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం

# –అ సంబద్ధ వివరణలు!

తగ్గిపోయింది. క్యాడర్‌లో జోష్ తగ్గిపోయిందనేకంటే అధినేతల తీరుతోనే వాళ్లలోనూ నిరాశ అలుముకుంది. అధికారంలో ఉన్నన్నాళ్లురాష్ట్రం తమ జాగీర్ అన్నట్లుగా.. ప్రగతి భవన్ పాలన సాగించిన కేసీఆర్.. ఓటమి పాలైన తరువాత ఒకరకంగా అదృశ్యమైపోయారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఒక్కసారి మాత్రమే ప్రజాక్షేత్రంలో కనిపించి, ఆ తర్వాత ఫామ్‌హౌజ్‌కే పరిమిత మయ్యారు. ఏం జరిగినా, ఏమైనా బయటకు రాలేదు. పార్టీ ముఖ్య నేతల్లో కూడా కొన్నాళ్ల పాటు స్తబ్దత అలుముకుంది. అంతేకాదు.. కేసీఆర్ ఇంట్లోనే కేటీఆర్, హరీష్ , కవితల మధ్య జరుగుతున్న అంతర్గత రాజకీయాలు, ఎవరి వర్గం వారి పోరాటం చూసి క్యాడర్ ఎవరి వైపు ఉండాలో తేల్చుకోలేకపోయింది. ఈ పరిస్థితుల్లో ఇక నడిపించే వాళ్లు, కేడర్‌కు దిశా నిర్దేశం ఇచ్చే వాళ్లు కరువై పోయి.. ఓ దశలో బీఆర్ఎస్ శ్రేణులు పక్కచూపులు చూసే పరిస్థితి వచ్చింది.

**ప్రసంగంలో ఏముంది?**

ఇప్పుడు రజతోత్సవ సభ అంటూ ఒక వేదికను తయారు చేసుకున్న కేసీఆర్.. ఫామ్‌హౌజ్ నుంచి బయటకు రావడానికి దానినో మార్గంగా ఎంచుకున్నారు. కానీ, టార్గెట్ రీచ్ కాలేకపోయారన్న వాదనలున్నాయి. ఎల్కతుర్తి సభ బలవంతంగా నిర్వహించినట్లు ఉంది తప్పితే.. బీఆర్ఎస్ స్పిరిట్, తెలంగాణ సెంటిమెంట్ ఏమాత్రం కనిపించలేదు.

ఇక, ఆ సభ ఉద్దేశ్యం ఏంటో, లక్ష్యం ఏంటో అర్థం కాని విధంగా కేసీఆర్ ప్రసంగం సాగింది. ఆత్మస్తుతి, పరనింద అన్నట్లుగానే ఆసాంతం ఆయన ప్రసంగం సాగింది. కేసీఆర్ ప్రసంగం అంటే చాలా మంది ఉత్సాహం చూపిస్తారు. ఆయన భాష, సెటైర్లు, విమర్శలు ఆసక్తికరంగా ఉంటాయనడంలో సందేహం లేదు. ఆయన చెప్పే సామెతలు , ప్రాసలు, పిట్టకథలు, పంచులు ఎదుట ఉన్న వారికి ఉత్సాహం తెప్పిస్తాయి. చప్పట్లు కొట్టేలా చేస్తాయి. దీంతో, పార్టీ కేడర్ మాత్రమే కాదు.. తటస్థులు కూడా కేసీఆర్ ప్రసంగం వినేందుకు ఆసక్తి చూపిస్తారు. ఈ సారి కూడా కేసీఆర్ ఆ దిశగా ప్రసంగాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేశారు గానీ.. అసలు లక్ష్యం అందులో కనిపించలేదు. భవిష్యత్ కార్యాచరణ ఏంటో, ప్రభుత్వ పొరపాట్లను ఎలా పాయింట్‌అవుట్ చేయాలో అన్న దిశగా కార్యకర్తలకు మార్గదర్శనం చేయలేకపోయారు. అంతేకాదు.. గతంలో కంటే భిన్నంగా ఈ ప్రసంగం సాగింది. వ్యక్తి టార్గెట్‌గా చేసే ప్రసంగం పార్టీవైపు మళ్లింది. ప్రధానంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ టార్గెట్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. కానీ, కేసీఆర్ ప్రసంగంలో రేవంత్ ప్రస్తావన ఒక్కసారి కూడా రాలేదు. కేవలం కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూనే ప్రసంగించారు. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీయే ప్రథమ శత్రువుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ అన్నింట్లోనూ ఫెయిలైందని తనదైన సర్టిఫికెట్ ఇచ్చారు. ఇక, అసెంబ్లీకి హాజరు కాకపోవడంపైనా ఆయన చెప్పిన కారణం, చేసిన పోలిక అందరికీ నవ్వు తెప్పించింది.

**వేలెత్తి చూపిన కుటుంబ వివాదం?**

ఇక, బీఆర్ఎస్ సభలో వేదికపై చోటు చేసుకున్న ఓ పరిణామం ఆ పార్టీలో నెలకొన్న కుటుంబ వివాదాన్ని వేలెత్తి చూపించింది. కేసీఆర్ కుటుంబ సభ్యుల ఆధిపత్య పోరుకు నిదర్శనంగా నిలిచింది. కవిత సభలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఆమెకు స్వాగతం చెబుతూ ఓ పాట పాడేందుకు ఒక గాయకుడిని వేదిక మీదికి పంపించారని చెబుతున్నారు. కానీ, అప్పటికే తన ధూమ్ ధామ్ టీమ్‌తో సభా వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోన్న రసమయి బాలకిషన్.. ఆ గాయకుడిని బౌన్సర్లతో స్టేజీ మీద నుంచి బలవంతంగా కిందకు దింపేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వెంటనే కేసీఆర్‌ను పొగుడుతూ వ్యాఖ్యానించారు. అంటే.. కేసీఆర్ కుటుంబంలో నెలకొన్న ఆధిపత్య పోరు ఇలా బయటపడిందన్న చర్చ నడిచింది.

**మంత్రుల హోం వర్క్**

ఇక, కేసీఆర్ సభ అంటేనే తమకు ఏదో అయిపోతోందని భావించిన ప్రభుత్వంలోని మంత్రులు ముందుగానే మీడియా సమావేశం ప్లాన్ చేసుకున్నారు. కేసీఆర్ సభ మొదలు కాకముందే తామేం మాట్లాడాలో, ఎలా కేసీఆర్ ప్రసంగాన్ని తిప్పికొట్టాలో అనే హోం వర్క్ చేసినట్లు అనిపించింది. ఇక, అక్కడ ఎల్కతుర్తిలో కేసీఆర్ ప్రసంగం పూర్తి కాగానే మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తదితరులు తమదైన శైలిలో విమర్శలు ఎక్కుపెట్టారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ ఇంటికి వెళ్లి మరీ అక్కడినుంచి కేసీఆర్‌పై సహజ రీతిలో నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు నెంబర్ వన్ విలన్ ఎలా అవుతుందో? అన్న వ్యాఖ్యకు గట్టి కౌంటర్ ఇవ్వలేకపోయారు. అలాగే, అసెంబ్లీకి కేసీఆర్ రాకపోవడంపైనా ప్రజలను ఆకట్టుకునే రియాక్షన్ మంత్రుల నుంచి కనిపించలేదు.

**రేవంత్ రియాక్షన్**

మంత్రుల విమర్శలదాడి పేలవంగా ఉందను కుంటే.. మరుసటి రోజు రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ ప్రసంగంపై స్పందించారు. అది ఆశించిన స్థాయిలో స్పందించవలసిన స్థాయి కనిపించలేదు. కేసీఆర్ ప్రసంగంలో అసలు పసలేదని, తమ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులవల్ల ఉన్న కడుపుమంటే కనిపిస్తోందంటూ మండి పడ్డారు. కేసీఆర్ ప్రసంగం అక్కసు కూడినది ఖమ్మంలో తాము రాహుల్ గాంధీ సభ పెట్టినప్పుడు వాళ్లు.. కనీసం బస్సులు కూడా ఇవ్వలేదని, కానీ.. తాము మాత్రం అడిగినన్ని బస్సులు ఇచ్చామని వివరణ ఇచ్చారు. అంతేకాదు.. తనకు, రాహుల్‌గాంధీకి మధ్య సత్సంబంధాలు ఉన్నాయని, ప్రతిపక్ష ఆరోపణలను నమ్మాల్సిన పని లేదని వ్యాఖ్యలు చేశారు. మొత్తానికి కేసీఆర్‌కు ఇవ్వాల్సిన స్థాయిలో రేవంత్ రెడ్డి కౌంటర్ ఇవ్వలేక పోయారు. ఫలితంగా తెలంగాణలో నిర్మాణాత్మక రాజకీయాల కంటే.. దుందుడుకు రాజకీయాలు మాత్రమే సాగుతున్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది.

**సుజాత గోపగోని**

**6302164068, సీనియర్ జర్నలిస్ట్**



విలేకరుల సమావేశంలో రేవంత్, డీకే




జమ్ముకాశ్మీర్‌లోని పహల్‌గాంలో ఉగ్రవాదులు భీకరదాడి చేసి 26 మందిని పర్యాటకులను హతమార్చిన సంఘటనను ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం మొత్తం ఖండించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పాక్ జాతీయుల ఆచూకీ తీయడంతో పాటు కీలక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది.

# ఉగ్రదాడితో రాష్ట్రంలో

పెహల్గావ్‌లో ఉగ్రవాదుల అమానుష దాడిని రాష్ట్రంలోని అన్ని రాజకీయపక్షాలు, హిందూ సంఘాలు, ముస్లింలు రోడ్లమీదకు వచ్చి ఉగ్రవాదుల చర్యలను ఖండించాయి. పిరికిపందల మాదిరిగా పర్యాటకులపై దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ప్రశాంతంగా ఉన్న భారత్‌పై దాడులు చేసి అమాయకులను పొట్టనపెట్టుకోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఉగ్రవాదుల చర్యల వెనుక పాకిస్థాన్ హస్తం, వారి ప్రోత్సాహం ఉందని, త్వరలో భారత్ తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. ఏప్రిల్ 22నాటి ఈ దాడుల నేపథ్యంలో దేశంలోని పాకిస్థానీయుల వీసాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. దేశం విడిచి వెళ్లవలసిందిగా నిర్దిష్ట గడువు విధించింది. కొత్త నిబంధనల ప్రకారం వీసా వ్యవధి ముగిసినప్పటికీ భారతదేశంలో బస చేసిన వారికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రూ. 3 లక్షల వరకు జరిమానా విధించే నిబంధనను ప్రభుత్వం రూపొందించింది. దాంతో దేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్న పాకిస్థానీ పౌరులను కూడా వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది.

రాష్ట్రంలో 21 మంది పాకిస్థానీయులు..

పాకిస్తాన్ పౌరులు ఎక్కడున్నా వారి ఆచూకీ కనుగొనాలని, విదేశాలకు సంబంధించిన వారు దేశంలో ఎక్కడ ఉన్నా గుర్తించాలని, వారి కదలికలపై ఆరా తీయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. గడువు దాటిన పాకిస్తానీ పౌరులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలను కేంద్ర హోంశాఖ ఆదేశించింది.

ఈ సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖ కూడా అన్ని జిల్లాల పోలీసు అధికారులను అప్రమత్తం చేసింది. రాష్ట్రంలో 21 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు పోలీసు శాఖ గుర్తించింది. జిల్లాల వారీగా విశాఖపట్నంలో ఇద్దరు, తూర్పు గోదావరి జిల్లాలో ఒకరు, కాకినాడలో ఇద్దరు, కృష్ణా జిల్లాలో ఒకరు, ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరు, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాలో ఒక్కొక్కరు, అనంతపురం, సత్యసాయి జిల్లాలలో ఇద్దరిద్దరు ఉన్నట్లు గుర్తించారు. అన్నమయ్య జిల్లాలో అధికంగా ఐదుగురు పాకిస్తాన్‌కు చెందిన వారు ఉన్నట్లు పోలీసు శాఖ గుర్తించింది.

**అన్నమయ్య జిల్లాలో**

రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన మదనపల్లె పట్టణంలో ఐదుగురు పాకిస్థాన్ దేశ పౌరసత్వం కలిగిన వారు ఉన్నట్లు పోలీసుశాఖలోని ప్రత్యేక విభాగం గుర్తించినట్టు సమాచారం.వారు పట్టణంలో స్థిరనివాసం ఏర్పరచుకొన్నట్లు అన్వేషణలో వెల్లడైనట్టు తెలుస్తోంది. ఇండియన్ వీసా రెన్యువల్ చేసుకునే క్రమంలో ఈ వివరాలు బయటపడినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. మదనపల్లె పట్టణంలోని కురవంక ఇండియన్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలో గత ఐదేళ్లుగా వారు నివాసం ఉంటున్నారని నిఘా వర్గాలు అంటున్నాయి. రెండు దశాబ్దాల క్రితం మదనపల్లె అంజనేయస్వామి గుడి వీధికి చెందిన ఒక మహిళ బతుకుదెరువు నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లింది. అక్కడ పరిచయమైన పాకిస్థాన్ దేశ పౌరుడిని వివాహం చేసుకుంది. ఈ క్రమంలో ఆమె అక్కడే నలుగురికి జన్మనిచ్చింది. అనంతరం ఆ కుటుంబం మొత్తం పాకిస్థాన్ వెళ్లి అక్కడి పౌరసత్వం తీసుకున్నట్టు తెలుస్తోంది. వారి వైవాహిక జీవితంలో ఆఖరి సంతానం మదనపల్లెలో ఉండడంతో ఆ ఒక్కరికి మాత్రం భారతదేశ పౌరసత్వం ఉందని, మిగిలిన ఐదుగురికి పాకిస్థాన్ పౌరసత్వం ఉందని పోలీసు శాఖ నిఘా విభాగం గుర్తించింది. ప్రస్తుతం వారంతా మదనపల్లెలోనే ఉన్నట్టు పోలీసు శాఖ గుర్తించింది.

పాకిస్థాన్ పౌరసత్వం కలిగి మదనపల్లెలో ఉంటున్న ఆ మహిళ సంతానం ఇక్కడే చదువులు పూర్తి చేసుకున్నారు. పాకిస్థాన్ పౌరసత్వం కలిగినప్పటికీ, భారత్‌లో రెసిడెన్స్ వీసా పొంది రెన్యువల్ చేసుకుంటూ ఇక్కడే నివాసం ఉంటున్నారు.

పాకిస్థాన్ దేశీయుడిని వివాహం చేసుకున్న ఆ మహిళకు ఇద్దరు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు సంతానం. వారిలో 35 సంవత్సరాల పెద్ద కూమార్తె బెంగళూరులో కేరళకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్టు సమాచారం. కొడుకు మదనపల్లెలో స్టార్ హోటల్లో క్యాటరింగ్ పనులు చేసుకుంటూ మదనపల్లెకి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నట్టు తెలుస్తోంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో గాలింపు చర్యల్లో పాక్ పౌరుల సమాచారం ఇలా వెలుగు చూడడంతో విషయం పోలీసు వర్గాల్లో కలకలం రేపుతోంది.

**ఉమ్మడి కృష్ణాజిల్లాలో**

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ముగ్గురు పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తులు ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ముగ్గురిలో ఇద్దరు ఎన్టీఆర్, ఒకరు కృష్ణాలో ఉంటున్నట్లు తెలిసింది. కృష్ణా జిల్లా పరిధిలోని ఆ మహిళ పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్నారు. భర్తతో విడాకులు తీసుకొని తిరిగి పుట్టింటికి వచ్చారు. భారత పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోగా ఇంకా అనుమతి రావాల్సి ఉంది. మిగిలిన ఇద్దరు కూడా దరఖాస్తు చేసుకున్నట్లు పోలీసులు నివేదికను డీజీపీ కార్యాలయానికి పంపించారు.

**విశాఖలో**

విశాఖలో పాకిస్థాన్ పౌరుల ఉనికిని నగర పోలీసులు గుర్తించారు. ఓ కుటుంబంలో దంపతులు, ఇద్దరు పిల్లలు ఉండగా, వారిలో భర్త, పెద్ద కుమారుడు పాకిస్థాన్ పౌరసత్వం భార్య చిన్నకుమారుడు భారత



# అప్రమత్తత

పౌరసత్వం కలిగి ఉన్నారు. పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తి, విశాఖకు చెందిన మహిళ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి పెద్ద కుమారుడు పాకిస్థాన్లో జన్మించాడు. అనంతరం ఆమె విశాఖ వచ్చేంది. భర్త తరచూ ఇక్కడికి వస్తుండేవాడు. విశాఖలో వారికి రెండో కుమారుడు జన్మించాడు. దీంతో వేర్వేరు పౌరసత్వాలు లభించాయి. ఏడాది కిందట పెద్దకుమారుడి ఆరోగ్యం బాగోలేకపోవడంతో తండ్రి పాకిస్థాన్ నుంచి విశాఖ వచ్చాడు. అప్పటి నుంచి లాంగ్ వీసాతో ఇక్కడే ఉంటున్నాడు. ఆయా వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.

**ధర్మవరంలో**

పాకిస్థాన్ పౌరసత్వం కలిగిన ఒక యువతి వివరాలు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో వెలుగుచూశాయి. ధర్మవరానికి చెందిన రంశా రఫీక్ 26 ఏళ్లుగా భారత్‌లోనే ఉంటోంది. తెలిసిన వివరాల ప్రకారం కర్ణాటకలోని బళ్లారికి చెందిన మహబూబ్ పీరన్ అనే వ్యక్తి దేశ విభజన సమయంలో పాక్ వెళ్లిపోయారు. అక్కడే ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు జన్మించారు. చిన్న కుమార్తె జీనత్ పేరన్‌ను ధర్మవరంలోని తన చెల్లెలు కుమారుడు రఫిక్ అహ్మద్‌కు ఇచ్చి 1989లో వివాహం చేశారు. ఈ జంటకు మొదట కుమారుడు పుట్టారు. 1998లో జీనత్ రెండోసారి గర్భం దాల్చిన సమయంలో పాకిస్థాన్‌లోని తన తండ్రికి ఆరోగ్యం బాగాలేదని సమాచారం అందింది. దీంతో తండ్రిని చూసేందుకు ఆమె పాక్ వెళ్లారు. అదే సమయంలో కార్గిల్ యుద్ధం మొదలుకావడంతో తిరిగి వచ్చేందుకు పరిస్థితులు అనుకూలించలేదు. జీనత్ పీరన్ పాకిస్థాన్‌లోనే రంశా రఫీక్‌కు జన్మనిచ్చారు. 2005లో జీనత్ పీరన్ ఆమెను తీసుకుని ధర్మవరం వచ్చేశారు. పాకిస్థాన్‌లో పుట్టడంతో రంశా రఫిక్‌కు ఆ దేశ పౌరసత్వం వచ్చింది. తర్వాత ధర్మవరం వచ్చి చదువు కొనసాగించినప్పటికీ భారత పౌరసత్వం కోసం ప్రయత్నించలేదు. 2018లో పాక్ పౌరసత్వాన్ని రెన్యువల్ చేసుకున్నారు. 2028 వరకు అది మనుగడలో ఉంటుంది. 2023లో భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు ఆమోదించలేదు. ఇప్పుడు ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ పౌరులను తిరిగి పంపాలని కేంద్రం ఆదేశించిన నేపథ్యంలో ఆమె వివరాలు బయటకు వచ్చాయి.

**తీర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు**

పెహల్గావ్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో కీలక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు గల తీర ప్రాంతం భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించింది. శ్రీకాకుళంలో 193 కి.మీ., విజయనగరంలో 29 కి.మీ., విశాఖపట్నంలో 132 కి.మీ., తూర్పుగోదావరి జిల్లాలో 144 కి.మీ, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 96 కి.మీ., పశ్చిమగోదావరి జిల్లాలో 23 కి.మీ. కృష్ణాజిల్లాలో 88 కి.మీ.,బాపట్ల జిల్లాలో లో 50 కి.మీ., ప్రకాశం జిల్లాలో 60 కి.మీ., నెల్లూరు జిల్లాలో 169 కి.మీ.మేర సముద్ర తీరం ఉంది. ఈ ప్రాంతాల నుంచి మత్స్యకారులు. సముద్ర జలాల్లోకి వేట సాగించేందుకు బోట్లపై వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి చొరబాటుదారులు ప్రవేశించే ప్రమాదం ఉండటంతో తీరం వెంబడి నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారు. విశాఖ, కాకినాడ, కృష్ణపట్నం రేవుల పరిధిలోకి ఇతర దేశాల నుంచి వచ్చే ఓడలపై కోస్టల్ సెక్యూరిటీ సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రతి నౌక సిబ్బంది పత్రాలను పూర్తి స్థాయిలో పరిశీలించి అన్నీ సవ్యంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే పోర్టులోకి అనుమతిస్తున్నారు. కశ్మీర్ ఘటన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తీరప్రాంతాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ముష్కరులు చొరబడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. మత్స్యకార గ్రామాల్లోకి ఎవరైనా అనుమానితులు కనిపిస్తే తక్షణం సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. తీర ప్రాంతాల వారీగా సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపడుతున్నారు.

**విమానాశ్రయాల్లో బందోబస్తు**


దేశవ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో పోర్టులతో పాటు విమానాశ్రయాల్లోనూ భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. విశాఖ, రాజమండ్రి, గన్నవరం, తిరుపతి విమానాశ్రయాల్లో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆయా జిల్లాల అదనపు ఎస్పీ, విమానాశ్రయం పోలీసు సిబ్బంది, ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వాహనాల రాకపోకల పైన, అనుమానిత వ్యక్తులపై దృష్టి సారించాలని, తరచూ తనిఖీలు నిర్వహించాలని సిబ్బందికి ఆయన సూచిస్తున్నారు.



**తురగా నాగభూషణం**

**సీనియర్ జర్నలిస్ట్**

**'కార్టూన్ పోటీ-2025'లో సాధారణకు ప్రచురణకు ఎంపికైనది**



మే 11 నృసింహ జయంతి

# ప్రహ్లాద వరదా!




భగవంతుడు సర్వాంతర్యామి. జగత్తంతా నిండి నిబిడీకృతమై ఉన్నాడని చాటడమే నృసింహావతార తత్వం.'ఇందుగలడందులేడని /సందేహము వలదు/చక్రి సర్వోగతుం/డెందుందు వెదకి చూచిన/ అందందే కలడు దానవాగ్రణి వింటే' అని పోతనామాత్యుడు శ్రీమత్ మహాభాగవతంలో ప్రహ్లాదుడితో పలికించాడు. వైశాఖ శుక్ల చతుర్దశి స్వాతి నక్షత్రంలో స్వామి ఉద్భవించాడని నృసింహ పురాణం పేర్కొంటోంది. భక్తాగ్రేసరుడు ప్రహ్లాదుని బ్రోచిన లక్ష్మీ నారసింహుడు సర్వులకు ఆరాధనీయుడు. ఉగ్ర, కృద్ధ, వీర, విలంబ, కోప, యోగ, అఘోర, సుదర్శన, శ్రీ లక్ష్మీ నారసింహులుగా తొమ్మిది

మహాభాగవతం పేర్కొన్న 21 అవతారాలలో నృసింహావతారం14వది కాగా, ప్రధాన దశావతారాలలో నాలుగది. 'పదునాలుగవదియైన నరసింహ రూపంబున కనక కశిపుని సంహరించె' అన్నారు పోతన. శరణాగతులపై కరుణామృతం కురిపించే కారుణ్యమూర్తి నృసింహవిభుడు. ఈ అవతారం సద్యోజాతం. భక్తుడిని కాపాడేందుకు అప్పటికప్పుడు జనించింది. దశావతారాలను పూర్ణ, ఆవేశ, అంశావతారాలని మూడు విధాలుగా వర్గీకరించారు. రెండో విభాగానికి చెందినదే నృసింహావతారం. ఇవి పరిస్థితులను బట్టి ఉగ్రరూపాన్ని సంతరించుకున్నాయి. ఈ అవతారం సర్వశక్తి సమన్విత స్వరూపం. త్రిమూర్తుల సమన్వయశక్తితో దనుజ సంహారానికి అవిర్భవించిన పరబ్రహ్మ స్వరూపం. త్రిమూర్త్యాత్మకం. పాదాల నుంచి నాభివరకు బ్రహ్మ రూపం, నాభి నుంచి కంఠం వరకు విష్ణురూపం, కంఠం నుంచి శిరస్సు వరకు రుద్రస్వరూపంగా ఆధ్యాత్మికులు అభివర్ణించారు.

వైకుంఠ ద్వార పాలకులు జయవిజయుల శాపవిమోచన కోసం వరాహ, నృసింహులుగా అవతరించిన స్వామి, భక్తుల అభీష్టం నెరవేర్చేందుకు ఎన్నోచోట్ల స్వయంభువుగా వెలిశాడని ఆయా క్షేత్ర స్థల పురాణాలను బట్టి తెలుస్తోంది. మరికొన్ని చోట్ల ప్రజలు తమ ఇక్కట్లను తీర్చిన దైవంగా నరసింహుడిని ప్రతిష్ఠించి అర్చిస్తున్నారు. ఈ స్వామి ఆలయాలు పర్వతాలు, కొండగుహలు, అరణ్యాలు, సరిహద్దుల్లో దర్శనమిస్తాయి. కేశవుడు ఎక్కడెక్కడో ఈ రూపంలో కాపాడుతాడో శాస్త్రం చెబుతూ, 'అటవ్యాం నారసింహశ్చ...' అనడంలో ఇదే బోధపడుతుంది. స్వామి ఆవిర్భవించినటువంటి ప్రదేశాలనే ఆయనను ప్రతిష్ఠించదలచిన వారు ఎంచుకోవాలని ప్రాచీన వాస్తు గ్రంథం 'మయమతం' పేర్కొందని పెద్దలు చెబుతారు.

బ్రహ్మమానస పుత్రులు సనకసనందుల శాపం కారణంగా వైకుంఠ ద్వారపాలకులు జయవిజయులు మూడు జన్మల్లో హరివైరులుగా పుడతారు. కృతయుగంలో తొలిజన్మలో హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా జన్మించారు. ధరను చాపగా చుట్టి సముద్రంలో ముంచిన హిరణ్యాక్షుడుని శ్రీహరి వరాహరూపుడై అంతమొందించి భూమిని ఉద్ధరించారు. సోదరుడిని హతమార్చిన విష్ణువుపై రగిలిన హిరణ్యకశిపుడు ప్రతీకార వాంఛతో బ్రహ్మ గురించి ఘోర తపస్సు చేసి 'నరులు, మృగాల వల్ల గాని, పగలుకాని, రాత్రి కాని..తదితర లెక్కకు మిక్కిలి మినహాయింపులతో మరణం లేకుండా వరం పొందాడు. అయితే పరమాత్మ ఆ వరాలకు ఎక్కడా విఘాతం కలుగకుండా తన లీలను ప్రదర్శించి దానవరాజును కడతేర్చారు. వరాహరూపంలో హిరణ్యాక్షుడిని, త్రేత,ద్వాపర యుగాలలో శ్రీరామ, శ్రీకృష్ణావతారాలుగా.. రావణ కుంభకర్ణుడు, శిశుపాల దంతవక్త్రులను వధించిన శ్రీ మహావిష్ణువు, నృసింహ అవతారంగా హిరణ్యకశిపుడే తన మృత్యువును తానే ఆహ్వానించుకునేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాడు. 'సర్వోపగతుడని చెబుతున్న హరి ఈ స్తంభంలో కూడా ఉన్నాడా?' అని కుమారుని ప్రశ్నించి దానిని గదతో బద్దలు కొట్టాడు. అందులో సూక్ష్మరూపంలో ఉన్న హరి నృసింహుడిగా (స్తంభోద్భవుడు) వెలువడ్డాడు. హిరణ్యకశిపుడు పొందిన వరం ప్రకారమే... పగలు-రేయి కాని సంధ్యా సమయంలో, సగం సగం మృగ, మానవ రూపంగా, ఇంటా బయట కాకుండా ద్వారం

# తటస్థుల ప్రకటనలతో అయోమయం


రామకృష్ణ పరమహంస

మత మార్పిడులు, మత విద్వేషాల నుంచి హైందవ ధర్మాన్ని కాపాడేందుకు హిందూరక్షణ సమితి (ధ.ర.స.) అద్భుతమైన కృషి చేస్తోంది. అన్ని మతాలు ఒకేలా ఉండవని, ఒకటి కావని, అవి ఒకే లక్ష్యంతో పని చేయవని తిరుగులేని రుజువులతో హిందూ సమాజాన్ని చైతన్యపరుస్తోంది. అయితే ధ.ర.స.లోని కొందరు సభ్యులు తటస్థవాదుల అనుచిత ప్రకటనల ప్రభావంతో,హైందవులు తమ మతం, సంస్కృతి పట్ల కచ్చితమైన నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. దేవాలయం, మజీద్, చర్చ్‌ల మధ్య తేడా లేదని, రామకృష్ణ పరమహంస ఇస్లాం, క్రైస్తవాలను ఆదరించినట్లు తటస్థవాదులు ప్రచారం చేస్తున్నారు. అక్టోబర్ 29, 2013 నాటి సత్సంగ్ సందర్భంగా ధ.ర.స. ధర్మకర్తలు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకువచ్చినప్పుడు, హిందూ ఆలయాలు మజీద్, చర్చ్‌ల కంటే ఎలా భిన్నమో వివరించాను. రామకృష్ణ పరమహంస దార్శనికతపై స్పష్టతను కూడా ఇచ్చాను. ఆయన దృష్టిలో, ఇక్కడ ఉన్నదంతా భగవంతుడే. ఇస్లాం సత్య సమ్మతమని ఆయన పేర్కొనలేదు. ఆయన దృక్పథం అర్థమైతే వాస్తవం బోధపడుతుంది. సర్వం దేవతామయం అనే దానిని వారు అంగీకరిస్తే పర్వాలేదు. కానీ వారు ఎన్నటికీ అంగీకరించరు. దేవుడి విషయంలో రామకృష్ణ విధానం క్రైస్తవం, జుడాయిజం లేదా ఇస్లాంను అంగీకరించదు. అప్పుడది అది ద్వంద్వ దైవం అవుతుంది. ప్రతిదీ ఈశ్వరతత్వం, ఈశ్వర స్వరూపమే. నీవు ఆయనను ప్రార్థిస్తే ఆయన అందులో ఈ అర్థాన్నే మాత్రమే చూస్తాడు. రామకృష్ణ దార్శనీకత, శాస్త్రీయమైనది. అందులో నాకు ఎలాంటి సమస్య, ఇబ్బంది కనిపిం

# ప్రణమామ్యహమ్

రూపాలలో పూజలు అందుకుంటున్నాడు. నృసింహుడిని 'క్షిప్రప్రసాదుడు' అంటారు. అనుగ్రహించదలిస్తే క్షణం కూడా జాగుచేయడని భావం.

*'నాహం వసామి వైకుంఠే నయోగి హృదయేరవౌ! / మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారదా!!'* (నేను వైకుంఠంలో లేను. యోగులు హృదయాలలోనో, సూర్యునిలోనో కనిపించను. నా భక్తులు తలచేచోట, నన్ను కీర్తించే చోటే ఉంటాను) అని నారదమహర్షితో శ్రీ మహావిష్ణువు అన్నట్లు పద్మపురాణం పేర్కొంటోంది. అది నారసింహుడి క్షేత్ర వైభవ విశిష్టతలను బట్టి అది అక్షరసత్యమనిపిస్తుంది.




మధ్యలో, నేలన నింగిలో కాకుండా ఒడిలోకి లాక్కొని, ప్రాణసహితం, ప్రాణరహితం కానీ వాడిగోళ్లతో చీల్చి వధించాడు. ఘోర తపస్సు(ల)తో సాధించిన వరాలతో దానవశక్తి ఎంత గొప్పదైనా, ఆత్మబలానికి ప్రతిరూపమైన దైవశక్తికి సాటిరాదని ఈ అవతారం నిరూపిస్తుంది.

నృసింహుడు దుష్టులకు ఎంత భయంకరుడో శిష్టులకు అంతటి ప్రసన్నుడు. ఉగ్రరూపుడే శరణుకోరిన వారికి కొంగుబంగారం. నృసింహ జయంతినాడు స్వామిని అర్చించడం వల్ల సర్వపాపహరణం, మోక్షసిద్ధి కలుగుతాయని నృసింహపురాణం చెబుతోంది. నరసింహుడు కొన్ని చోట్ల మూలవిరాట్‌గా, సాలిగ్రాములుగా, ఇతర ఆలయాలలో ఉపాలయా లుగా, గోడలు, స్తంభాలపై శిలా రూపాలుగా దర్శన మిస్తాడు. స్వామి స్తంభం నుంచి వెలువడినందున (స్తంభోద్భవుడు) శ్రీవైష్ణవులు భవంతి స్తంభాలను తిరుమణి, తిరుచూర్ణంతో అలంకరించి అర్చించడం కనిపిస్తుంది.

దేశవ్యాప్తంగా వందలాది నృసింహ ఆలయాలు ఉండగా, ఒక్కొక్క చోట ఒక్కొక్క విశిష్టత గోచరిస్తుంది. తెలుగు రాష్ట్రాలలో ఉత్తరాంధ్రలోని సింహాద్రి నుంచి రాయలసీమలోని కదిరి వరకు, తెలంగాణలోని యాదాద్రి తదితర క్షేత్రాలు దివ్య క్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయి. అంతర్వేది, కోరుకొండ, వేదాద్రి, ఆగిరిపల్లి, మంగళాద్రి (మంగళగిరి), సింగరాయ కొండ, పెంచలకోన అహోబిలం, స్తంభాద్రి, ధర్మపురి, మల్యాద్రి తదితర క్షేత్రాల్లో రాజ్యలక్ష్మీసమేత శ్రీ నృసింహస్వామి విశేష అర్చన, ఆరాధనలు అందుకుంటున్నారు. అప్పన్నగా సంభావించుకునే సింహాచలేశుడు ఏడాదిలో ఒక రోజు మాత్రమే (వైశాఖ శుద్ధ తదియ)నిజరూప దర్శనమిస్తాడు. అదే చందనయాత్ర. తన తండ్రి పినతండ్రులు హిరణాక్ష్య, హిరణ్యకశిపుల సంహరణకు ఎత్తిన రెండు అవతారాలు (వరాహ, నృసింహ) ఒకటిగా శాంతమూర్తిగా దర్శనభాగ్యం కలిగించాలన్న ప్రహ్లాదుడి విన్నపాన్ని మన్నించిన స్వామి ఈ రూపంలో ప్రభవించాడు. అక్కడి గంగాధార లాంటి తీర్థం, వరాహ నృసింహుడి సాటి దైవం మూడు లోకాల్లోనూ లేదని (గంగధార సమం తీర్థం క్షేత్రం సింహాద్రి సమం/నారసింహ సమోదేవో త్రైలోక్యే నాస్తి నిశ్చయః) అని స్థలపురాణ వచనం. అంతర్వేది సాగర సంగమక్షేత్రం. వేదాద్రిలోని యోగానంద నృసింహుడు జ్వాల, సాలగ్రామ, వీర, యోగానంద, లక్ష్మీనరసింహులుగా పూజలు అందుకుంటున్నాడు. కృష్ణానదిలో సాలి గ్రామంగా అవతరించాడు. మంగళగిరిలో కొండ దిగువున శ్రీలక్ష్మీనృసింహస్వామి, కొండపైన పానకాల స్వామి, గిరి శిఖరంపై గండాల నరసింహస్వామి కొలువై ఉన్నారు. శ్రీలక్ష్మి ఈ కొండపై తపస్సు చేసినందున 'మంగళాద్రి', 'మంగళగిరి'గా ప్రసిద్ధమైందని స్థల పురాణం. ఫాల్గుణ శుద్ధ చతుర్దశి నాటి రాత్రి కల్యాణం, మరునాడు రథోత్సవం విశిష్టమైనది. నారసింహ క్షేత్రాల్లో రథోత్సవానికి అంతర్వేది, మంగళగిరిని విశేషంగా చెబుతారు. అహోబిలంలో స్వామి బలాన్ని, శక్తిని దేవతలు ప్రశంసించడం వల్ల ఈ క్షేత్రం 'అహోబలం' అనీ వ్యవహారంలోకి వచ్చిందట. ఆలయ సమీపంలోని కొండపై నవ నారసింహమూర్తులు కొలువై ఉన్నారు. ఆళ్వారులు దర్శించి, సేవించిన క్షేత్రాలను 'దివ్య దేశాలు' అంటారు. అలాంటి వాటిలో అహోబిలం ఒకటి.

కదిరిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మరో ప్రత్యేకత ఉంది. హిరణ్యకశిప వధానంతరం ఆగ్రహావేశాలతో ఈ ప్రాంతానికి వచ్చిన స్వామి అక్కడి అడవిలో క్రూర జంతువులను వేటాడారని, అలా ఆయనకు 'వేటరాయుడు' అని పేరు వచ్చిందని చెబుతారు. తెలంగాణ లోని ప్రముఖ నారసింహ క్షేత్రాల్లో ఒకటి యాదాద్రి వైభవం స్కంద, బ్రహ్మాండ పురాణాల్లో వర్ణితమైంది. ఉగ్ర, గండభేరుండ, జ్వాల, యోగానంద, లక్ష్మీ నృసింహ రూపాలతో అవతరించాడు. ధర్మపురిలో నృసింహుడి ఆలయం వెలుపల గల యమధర్మరాజు ఆలయాన్ని దర్శించి గండ దీపంలో నూనెను సమర్పించిన వారికి అపమృత్యు దోషం ఉండదని భక్తుల విశ్వాసం.

తెలుగురాష్ట్రేతర ప్రాంతాలు కాంచీపురం, కుంభకోణం, రామేశ్వరం, గయ, బ్రహ్మకపాలం, హరిద్వారం తదితర క్షేత్రాలు భక్తకోటిని అలరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా వందలాది నృసింహ ఆలయాలు ఉండగా, ఒక్కొక్క చోట ఒక్కొక్క విశిష్టత గోచరిస్తుంది. ఆసేతు శీతాచలం పర్యటించి అద్వైత సిద్ధాంతాన్ని ప్రబోధించిన జగద్గురువు శంకరభగవత్పాదులు, నృసింహుడిని శ్లాఘించారు. మానవాళిపై అపార సహానుభూతితో వారికి చేయూతనివ్వాలని వేడుకుంటూ లక్ష్మీనరసింహ కరావలంబస్తోత్రం (కరావలంబ.. చేయూతనివ్వడం) అందించారు. దీని పఠనంతో సమస్త భయాలు దూరమై, లక్ష్మీ నృసింహుడి కారుణ్యం అమృతవాహిని అవుతుందని చెబుతారు.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**

సీనియర్ జర్నలిస్ట్

---

చదు. కనుక, ప్రార్థన ఎలాంటిదైనా, అది ఆయనకు అర్థవంతంగా ఉండాలి. ఉదాహరణకు, 'భగవంతుడు శాశ్వతుడు అని చెప్పాడనుకోండి' దాని అర్థం ఏమిటి? అంటే.. ఆయన దీర్ఘకాలంగా ఎక్కడో అంటిపెట్టుకొని ఉన్నాడని అర్థం. పదాలకు అర్థాలు వేర్వేరు మనుషులకు వేర్వేరుగా అనిపిస్తుంటాయి. రామకృష్ణ దార్శనికతలోని శాశ్వతత్వాన్ని అర్థం చేసుకోగలగాలి.



**'Know the Irrefutable Facts And Protect Hindu Dharma' నుంచి**

**పూజ్య స్వామి దయానంద సరస్వతి**

**(సంకలన కర్త)**

# 1857 స్వరాజ్య సమరానికి పునాది

'1857లో జరిగిన మహా సమరం వెయ్యేండ్లుగా-విదేశీయుడీ గడ్డపై కాలిడిన తొలి నాటి నుండీ జరుగుతున్న జాతీయ సమరంలోని ఒక ముఖ్యఘట్టం మాత్రమే. ఈ భూమిన మళ్లీ ధర్మ సంస్థాపన జరిగే వరకూ, విదేశీయుల ప్రభావంలోని చిట్టచివరి అంశం ఈ గడ్డను విడిచి పోయే వరకు ఈ ధర్మ సమరం కొనసాగుతూనే ఉంటుంది'. దాదాపు 68 సంవత్సరాల క్రితం జాగృతి (మే 10,1957) వెలువరించిన అభిప్రాయ మిది. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం శతాబ్ది సందర్భంగా జాగృతి వారపత్రిక ప్రత్యేక సంచికను వెలువరించింది. ఆ సంచిక సంపాదకీయం కూడా ఆ ఘట్టం మీదే రాశారు. పై వాక్యాలు అందులోనివే. ఆ సంగ్రామానికి దారి తీసిన పరిస్థితులు, చరిత్రకారుల అభిప్రాయాలు, అందులోని భిన్నకోణాలనూ కూడా స్పృశించిన సంపాదకీయమిది. '1857' ఒక మహా విప్లవం.

శ్రీమంత్ నానాసాహెబ్ పీష్వా ముఖచిత్రంతో ఈ సంచికను వెలువరించారు. 'విప్లవ సారథి నానాసాహెబ్ పీష్వా, మహాసేనాని తాత్యా (రచన సత్యవాన్), 'స్వధర్మ, స్వరాజ్యాలకై సాగించబడ్డ స్వాతంత్ర్య సమరం' (అమలినేని వెంకటస్వామి), శ్రీ మంగళ్‌పాండే, '57' గుణపాఠం (సౌమిత్రి స్వగతం), '1857 నుండి సుభాష్ వరకు భారత స్వాతంత్ర్య సమర సమీక్ష' (బాలశాస్త్రి హరదాస్), 'స్వాతంత్ర్య సమర వీరనారి ఆదర్శమూర్తి ఝాన్సీ లక్ష్మీబాయి', 'హైదరాబాద్‌లో విప్లవజ్వాల', 'జోరా పూర్ బాలరాజు' (శ్రీనీరంరాజు) వ్యాసాలు 24 పేజీల (టాబ్లాయిడ్ సైజ్) ఈ సంచికలో చోటు చేసుకున్నాయి. స్థలాభావం వల్ల కున్వార్‌సింహ, అమరసింహ గాథలను తరువాతి సంచికలలో వెలువరించారు.

1857 చారిత్రక ఘటన ఏమిటి? సమీపగతం లోని ఆ ఉదంతానికి ఉన్న చారిత్రక ప్రాముఖ్యం ఏమిటి? ఆ ఘటన గొప్పతనం, తరువాతి కాలాల మీద పరిణామాల మీద దాని జాడ ఎంత అన్నది ఇప్పటికీ పూర్తి స్థాయిలో అంచనా వేయలేదు. 1947 వరకు 9 దశాబ్దాల పాటు జరిగిన స్వతంత్ర పోరాటం మీద ఆ చరిత్రాత్మక ఘట్టం లేదా విప్లవం నీడ సుస్పష్టం. ప్లాసీ యుద్ధం (1757) భారతదేశం మీద ఆధిపత్యం సంపాదించిన ఈస్టిండియా కంపెనీకి ఎదురైన తీవ్ర ప్రతిఘటన. ఈ ప్రతిఘటనతో భారతదేశం నేరుగా బ్రిటిష్ మకుటం పాలన కిందకు వచ్చింది. ఈస్టిండియా కంపెనీ ఆధిపత్యం ఆ ప్రతిఘటనే అంతం చేసిందన్నదీ నిజమే. ఇది అసంతృప్తులయిన కొద్దిమంది సంస్థానాధీశులు, అసమ్మతి పెరిగిన సిపాయీలు (భారత జాతి సైనికులను ఇలా పిలిచేవారు) మాత్రమే లేవదీసిన తిరుగుబాటుగా నమ్మించడానికి ఈనాటికీ ప్రయత్నం జరుగుతున్నది. ఆ మహా ఘట్టాన్ని ఈ కోణం నుంచి చూస్తున్నవారే 'సిపాయీల తిరుగుబాటు' అంటారు. కానీ కారల్‌మార్క్స్ ఈ ఘటనను ప్రథమ స్వాతంత్ర్య పోరాటంగానే పరిగణించాడు. వినాయక్ దామోదర్ సావర్కర్ 'భారత స్వాతంత్ర్య సమరం'గానే అంచనా వేశారు. పీసీ సేన్ వంటి ఆంగ్లేయ మనస్తత్వం కలిగిన కొందరు సిపాయీల తిరుగుబాటుగానే అంచనా వేశారు. ఈ ఘటన పరిధిని ఉత్తర భారతదేశానికే పరిమితం చేసిన వారు కూడా ఉన్నారు. అందుకే చరిత్రను ఇంత ఘోరంగా వక్రీకరించిన సంఘటన మరొకటి లేదని కూడా అనిపిస్తుంది. హైదరాబాద్ నిజాం రాజ్యంలో ఈ ఉద్యమ జాడలు కనిపిస్తాయి. పాత పశ్చిమ గోదావరి జిల్లాలో కారుకొండ సుబ్బారెడ్డి అనే గిరిజన ఉద్యమకారుడు తాను తాత్యా తోపే స్ఫూర్తితోనే తిరుగుబాటు చేశానని ఉరికంబం ఎక్కుతూ ప్రకటించాడు. మరొక గిరిజన వీరుడు కారం తమ్మనదొర కూడా తాము నానా సాహెబ్ ప్రేరణతోనే కంపెనీ పాలన మీద తిరగబడ్డామని రాజమండ్రి న్యాయస్థానంలో చాటాడు. ఈ ప్రతిఘటనకు ఒక ప్రణాళిక ఉంది. ఆశయం ఉంది. నాయకత్వం ఉంది. రక్త తర్పణాలు ఉన్నాయి. పోరాటంలో విజయం శాతమే ఎక్కువ. కానీ బ్రిటిష్ మకుటం చౌరబడి ఫలితాన్ని దారి మళ్లించింది. కంపెనీ పాలనను రద్దు చేసి నేరుగా బ్రిటిష్ రాచరికం కిందకు భారత్‌ను తీసుకుపోయింది. 1857-58 బ్రిటిష్ రాణి ప్రకటన ద్వారా కంపెనీ పాలన నుంచి భారత్ బ్రిటిష్ ఇండియాగా మారింది.

చాలామంది అంచనా వేసినట్టు 1857 ఒక పద్ధతి ప్రకారం జరిగిన, భారతదేశమంతటా ఏకాభిప్రాయంతో (ఈస్టిండియా కంపెనీని మూయించడం) తలెత్తిన ప్రతిఘటన. ఫ్రెంచ్ విప్లవానికి (1789), బోల్షివిక్ విప్లవానికి (1917) దారి తీసిన పరిస్థితులను ఒక క్రమంలో చెబుతారు. కారణాలంటే అవే. ఏదో ఒక పరిణామాన్ని అత్యవసర కారణంగా చూపి, అక్కడ నుంచి విప్లవ గమనం గురించి-ప్రతిఘటన ప్రస్థానాన్ని- వివరించడం కనిపిస్తుంది. ఫ్రెంచ్ విప్లవం లూయీ 16 పాలనాకాలంలో బద్దలయింది. బోల్షివిక్ విప్లవం జార్ చక్రవర్తి మీద జరిగింది. 1857 ప్రతిఘటనకు కేంద్రబిందువు డల్హౌసీ. 1857 ప్రతిఘటన చరిత్ర నిర్మాణం లోను ఇది కనిపిస్తుంది. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక,సైనిక కారణాలు ఉన్నాయి. ఆవు కొవ్వు, పంది కొవ్వు పూసిన తూటాలు ఉపయోగించమన్నందుకు సిపాయీలు (హిందువులు, ముస్లింలు కూడా) కంపెనీ పాలనను కూలదోయడానికి పథకం వేయడమే తక్షణ లేదా అత్యవసర కారణంగా పేర్కొంటారు.

సైన్య సహకార పద్ధతి, దత్తత స్వీకార పద్ధతి రద్దు సంస్థానాధీశులను కంపెనీ పాలనను ప్రతిఘటించడానికి ప్రేరేపించాయి. దత్తత స్వీకార పద్ధతి రద్దు వల్ల ఝాన్సీ, సతారా బ్రిటిష్ వశమయ్యాయి. సంస్థానాల సైన్యాన్ని రద్దు చేయించి, కంపెనీ సేనలను అక్కడికి పంపడం మరొక పద్ధతి. దీని ఖర్చు పేరుతో సంస్థానాల నుంచి ఎకరాలకు ఎకరాలు కంపెనీ అధీనంలోకి పోయేవి. ఆర్థిక కారణాలు చాలా బలమైనవి. కంపెనీ ఏ విధానమైనా అది ఇక్కడి హస్తకళలను, చేతివృత్తులను ధ్వంసం చేసేదిగానే ఉండేది. ఫలితం నిరుద్యోగం. మితిమీరిన పన్నులు, శాశ్వత శిస్తు పద్ధతి రైతాంగాన్ని మట్టి కరిపించాయి. బ్రిటిష్ వ్యాపారులు లాభపడేటట్టు, భారతీయ వ్యాపారవర్గాలు నష్టపోయే విధంగా విధానాలు ఉండేవి. సైనిక కారణాలు చాలా అమానుషంగా ఉంటాయి. ఒకే ర్యాంక్‌లో ఉన్నా, ఐరోపా






వాడికీ, భారతీయుడికీ జీతం విషయంలో ఎంతో వివక్ష ఉండేది. ఒక ర్యాంక్ తరువాత ఆసియా వాసులకు పదోన్నతికి అవకాశమే ఉండేదికాదు. భారతీయులకు సముద్రయానం నిషిద్ధం. కానీ నిరంతరం యుద్ధాలలో మునిగి ఉండే కంపెనీ సిపాయీలను ఓడలలో విదేశాలకు తరలించడం వారిని తీవ్ర మనస్తాపానికి గురి చేస్తూ ఉండేది. ఈ అసంతృప్తిని తారస్థాయికి తీసుకువెళ్లినదే ఎన్‌ఫీల్డ్ తుపాకుల ప్రవేశం. వీటిలో కొవ్వు పూసిన తూటాలను ఉపయోగించడం అనివార్యం. వాటిని నోటితో కొరికి తుపాకీలో జొనిపేవారు. ఆవు కొవ్వు, పంది కొవ్వు పూసిన తూటాలను నోటిలో పెట్టుకోవడం హిందువులకు, ముస్లింలకు ధర్మ విరుద్ధమే. కానీ చాలామంది చరిత్రకారులు, ప్రధానంగా ఆంగ్లేయులు ఈ ధార్మిక, సాంస్కృతిక కారణాల తీవ్రతను తక్కువ చేసి చూపారనే చెప్పాలి. విదేశీ చరిత్రకారులకు ఈ తరహా మనోభావాలు అర్థం కావు. అర్థమైనప్పటికీ మన చరిత్రకారులు పట్టించుకోలేదు. దానితో మొత్తంగా 1857 ఘటన వెనుక ఆగ్రహ హేతువు సంపూర్ణ చిత్రం వెల్లడి కాలేదు. ఫలితమే ఆత్మగౌరవం కోసం ఆనాటి భారతీయ సమాజం పడిన తపననే అసమ్మతిగా, అసంతృప్తిగా చిత్రించారు. దీనిని 68 ఏళ్ల క్రితమే జాగృతి సరిచేసే ప్రయత్నం చేసింది. మంగళ్‌పాండే అనే సిపాయి తొందరపడి నిర్దేశించుకున్న సమయం కంటే ముందు, అంటే మార్చి 29, 1857న అధికారిని కాల్చి చంపాడు. మొత్తం ప్రణాళిక లోతుపాతులు వెల్లడైనాయి. ఏప్రిల్ 8న ఆయనను ఉరి తీశారు. మళ్లీ మే 10న మీరట్ సైనిక శిబిరంలో సిపాయీల తిరుగుబాటుతో దేశమంతటా జ్వాల రగిలింది.

ఈ సంచిక ముఖపత్ర కథనం అనదగిన 'స్వధర్మ, స్వరాజ్యాలకై సాగించబడ్డ స్వాతంత్ర్య సమరం' (అమలినేని వెంకటస్వామి) ఆ కోణాన్ని ఆవిష్కరించింది. '1857 నాటి ఉద్యమాన్ని ఇంగ్లీషు చరిత్రకారులు సిపాయీల తిరుగుబాటు అని వర్ణిస్తారు. కానీ వాస్తవానికి అది జాతీయ విప్లవం. తమ మాతృభూమి పట్ల, సంస్కృతి పట్ల శ్రద్ధాసక్తులు కలిగిన ప్రజలంతా త్యాగదీక్షను గైకొన్ని తరుణమది' అన్నారు వ్యాసకర్త. తూటాల వివాదాన్ని ముందు పెట్టడం మొత్తంగా ఆ ఘటన ఆత్మకు అన్యాయం చేయడమేనని అభిప్రాయపడ్డారు. తూటాలు, వాటి మీద కొవ్వు ప్రధాన అంశమైతే, బ్రిటిష్ గవర్నర్ జనరల్ దాని మీద వివరణ ఇచ్చారు. నోటితో కాదు, చేతితో కూడా తెరవవచ్చునని తెలియచేశాడు. దానితో ప్రతిఘటన ఆగాలి. కానీ ఆగలేదంటే అంతకు మించిన బలమైన కారణమే ఉందని గ్రహించాలి. "57" గుణపాఠం' ఓ అద్భుత విశ్లేషణ. ప్లాసీ యుద్ధంలో 50,000 సిరాజుద్దౌలా సైన్యం, 3000 మంది సైనికులు మాత్రమే ఉన్న రాబర్ట్ క్లైవ్ చేతిలో ఓడిపోయింది. కారణం, మీర్జాఫర్. ఆ యుద్ధమే కంపెనీ పాలనను భారత్‌పై రుద్దింది. 1857లో సిక్కులు, గూర్ఖాలు ఆంగ్లేయుల తరపున పోరాడారు. అంటే 1857 యోధుల మీద యుద్ధం చేశారు. ఇందులో గూర్ఖాల పాత్ర విస్తు గొలిపేదే. 1818లో ఆంగ్లేయులకూ, నేపాల్‌కూ యుద్ధం జరిగింది. అప్పుడు చేతిలో డబ్బులు లేని కంపెనీకి అయోధ్య నవాబు రెండు కోట్ల రూపాయలు అప్పు ఇచ్చాడు. యుద్ధం జరిగింది. 1857 ప్రతిఘటనలో అయోధ్య పాల్గొన్నది. అక్కడి ఉద్యమాన్ని అణచివేయడానికి కంపెనీకి సాయపడిన వారు గూర్ఖాలే. తమను చావగొట్టింది కంపెనీ సైన్యమే అయినా, అందుకు అప్పు ఇచ్చిన అయోధ్య నవాబు మీద పగ తీర్చుకోవడానికి కంపెనీ ద్వారానే వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి సిగ్గుపడలేదు గూర్ఖాదళం. ఈ వ్యాసం ముగింపు చెప్పుకోదగినది. '1957 వచ్చింది. ఈనాడు దేశంలో 1757 లోను, 1857లోను ఉన్నటువంటి పరిస్థితులే కొన్ని కనిపిస్తున్నాయి.' ఇది ఇవాళ కూడా నిజమే.

బాలశాస్త్రి హరదాస్ రాసిన వ్యాసం చదవడం మంచి అనుభవం. '1857 నుండి సుభాష్ వరకు: భారత స్వాతంత్ర్య సమీక్ష' శీర్షికకు తగ్గట్టు 1857 నుంచి 1942 వరకు దేశంలో సాగిన స్వాతంత్ర్యోద్యమం గురించి చర్చించింది. ఇక నానాసాహెబ్, తాత్యాతోపే, ఝాన్సీరాణీ వ్యాసాలు ఉత్తేజ పూరితంగా ఉన్నాయి. 'ఆ మహా విప్లవానికి కారణాలుగా పేర్కొనబడుతున్న అంశాలను కాదనక్కరలేదు. జాతి హృదయంలో జ్వలిస్తున్న స్వాతంత్ర్య పిపాస వెలికి వచ్చి విజృంభించడానికి ఇవన్నీ నిమిత్తాలుగా పని చేశాయి. నాటి సాంఘిక, రాజకీయ, సైనిక, ఆర్థికాది స్థితిగతులన్నీ మహా విప్లవానికి చక్కగా రంగాన్ని సిద్ధం చేశాయి. అందువల్ల వీటి కారణాలుగా ఎవరైనా భావిస్తే మనం కొట్టివేయనక్కరలేదు.' అని వ్యాఖ్యానించింది నాటి సంపాదకీయం.

ఇది ఉత్తర భారతదేశానికి పరిమితం అన్న అభిప్రాయం, అలాగే ఎలాంటి ప్రణాళిక లేకుండా ఆవేశంతో మాత్రమే జరిగిందన్న ప్రచారం ఎంత సత్యదూరాలో బాలశాస్త్రి హరదాస్ తన వ్యాసంలో విశ్లేషించారు. '1857 మే 10న ప్రారంభమైన ఈ స్వతంత్ర సమరం ఏదో ఆకస్మికంగా రేగిన తిరుగుబాటు కాదు. ఆనాటి దేశ పరిస్థితికి అనుగుణంగా పరంపరాగతంగా వస్తున్న నాయకత్వ అడుగుజాడలలో నడిచిన మహత్తర ప్రజా విప్లవం అది. అగ్నిపర్వతం బద్దలై, భగభగ మండుతూ లావాను వెలిగక్కే సమయంలో అదంతా ఆకస్మికంగా



మంగళ్ పాండే

నానాసాహెబ్

లక్ష్మీబాయి

తాత్యా తోపే

బహదూర్ షా

జరిగినట్టు కనిపించవచ్చు. కాని దానిలోని అగ్ని ఎంతోకాలం నుంచి ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. భూగర్భంలో జరిగిన పరిణామాలే దానిలోని అగ్నిజ్వాలలకు కారణాలవుతాయి. అదే విధంగా 57 స్వాతంత్ర్య సమరమనే దేశ వ్యాప్తమైన విప్లవం వెనుక కూడా ఎన్నో కారణాలు పెనవేసుకుని ఉన్నాయి. లార్డ్ బేకన్ ఒక వ్యాసంలో, ఏదైనా విప్లవం రావటానికి గల కారణాలను ఈ విధంగా పేర్కొన్నాడు. “మతంలో కొత్త కొత్త సంస్కరణలు, పన్నులు, శాసనాలలోను ఆచార వ్యవహారాలలోను మార్పులు, పరంపరాగతంగా వస్తున్న హక్కులకు భంగం కలగటం, నిరంకుశ పరిపాలన, అనర్హులకూ అగంతకులకూ అధికారం ప్రాప్తించటం కరువులు, సైన్యం నుంచి తొలగించబడిన వారిలో పెచ్చు పెరిగిన కక్షలు ప్రజలలో ఆవేశాలను పెంచి వారంతా కలసి ప్రతిఘటించేటట్టు చేసే ప్రతి పనీ' 1857 వెనుక కూడా ఉన్నాయి.

నిజమే, 1857 ఘటన విఫలమైనట్టు అంగీకరించడానికి అభ్యంతరం ఉండదు. అదొక రక్తపంకిల అనుభవం కూడా. మే 10, 1957 నాటి జాగృతి సంచిక సంపాదకీయం ముగింపు మెచ్చదగినది. ‘పరిస్థితులు మళ్లీ బ్రిటిష్ వారి ప్రయోజనానికి వచ్చాయి. విప్లవమప్పటికి విఫలమైంది. కానీ జ్వాల ఆగలేదు. అనేక రూపాల్లో అది విజృంభించింది.’ అని వ్యాఖ్యానించారు. మరొక వ్యాఖ్య కూడా గమనించదగినదే. ‘కాని నూరేండ్ల క్రిందటి ఆనాటి స్థితిగతులకు నేటి భారత పరిస్థితులకు ఎక్కువ భేదం మాత్రం కానరాదు. స్వధర్మంపై నాడు విజాతీయులు అక్రమాలు చేయగల్గితే నేడు స్వజాతీయులే చేయగల్గుతున్నారు. నాటికి వలె నేడు ధర్మ విద్రోహులు, స్వజాత్యాఘాతకులు, సత్యం విషయంలో కూడా ‘తాటస్థ్యం’ వహించగల ధీమంతులూ అన్ని రకాల వారూ నేడూ ఉన్నారు’ అనడం వాస్తవమే.

మే 10వ తేదీ సంచికలో సూచించినట్టే 17,1957 జాగృతిలో రాణా కుమార్‌సింగ్, అమరసింగ్ 1857 పోరాటానికి చేసిన సేవ గురించి వివరించారు. బిహార్ ప్రాంతంలో ప్రథమ స్వాతంత్ర్య పోరాటం విస్తరింప చేయడానికి ప్రయత్నించిన వారు కున్వార్‌సింగ్. గెరిల్లా యుద్ధనీతితో ఆయన కంపెనీ సేనల మీద యుద్ధం చేశారు. ఆయన సోదరుడే అమర్‌సింగ్. కున్వార్‌సింగ్ జగదీశ్‌పూర్ సంస్థానాధీశుడు. కంపెనీ రెవెన్యూ పద్ధతి కారణంగా తన సంస్థానాన్ని, దేవాలయాలను కూడా కోల్పోయాడు. కంపెనీ మీద తిరుగుబాటు బావుటా ఎగరవేసే నాటికి ఆయన వయసు 80 ఏళ్లు. పశ్చిమ బిహార్‌లోని అరణ్యాల నుంచి ఆయన కంపెనీ సేనలపై పడేవాడు. ఆత్రోలియా అనేచోట కంపెనీ సైన్యాలతో ఇతడు యుద్ధం చేశాడు. మొదట వెనకడుగు వేయవలసి వచ్చినా తరువాత మిల్‌మన్ నాయకత్వంలోని కంపెనీ సైన్యాలను తరిమివేశాడు. మిల్‌మన్ ఆజీంఘడ్ చేరుకున్న తరువాత కల్నల్ జేమ్స్ యుద్ధానికి వచ్చాడు. అతడికి కూడా మిల్‌మన్ గతే పట్టింది. జనరల్ లేగ్రాండ్ అనే బ్రిటిష్ సేనాని భారీ సేనతో వచ్చి జగదీశ్‌పూర్‌ను ముట్టడించాడు. అయినా వారిని వృద్ధ వీరుడు



కున్వార్ సింగ్

ఎదిరించాడు. ఇది జరిగిన మూడురోజులకే అంటే ఏప్రిల్ 23, 1857న ఆయన చనిపోయాడు. తరువాత అమర్‌సింగ్ రంగంలోకి దిగాడు. తరువాత కూడా కంపెనీ సేన జగదీశ్‌పూర్‌ను ముట్టడించే ప్రయత్నం చేసింది. అమర్‌సింగ్ పోరాడాడు. కానీ ఆయన ఏనాడు అస్తమించాడో చరిత్ర ఇంకా చెప్పలేదు.


మే 17, 1957 సంచిక చదివితే 1857 శతాబ్ది ఉత్సవాల మీద కాంగ్రెస్ వైఖరి స్పష్టమవుతుంది. అలాంటి ధోరణి అవాంఛనీయమైనది. శతాబ్ది ఉత్సవాలను మే 10న కాకుండా ఆగస్టు 15న జరిపించాలని ఆ పార్టీ నిర్ణయించింది. కానీ దేశమంతా మే 10వ తేదీనే ఘనంగా జరిగాయి. నాటి హుతాత్మలకు నివాళి ఘటించారు ప్రజలు. ‘కాంగ్రెస్ వైఖరి’ (వార్తలు, వ్యాఖ్యలు శీర్షిక) ఈ విషయాలు కనిపిస్తాయి. ‘ఈ సమరాన్ని, సమరవీరులను కాంగ్రెస్ వారు తరుచు కించపరచడం జరుగుతోంది. దీనిని ప్రజా విప్లవమని అంగీకరించని కాంగ్రెస్ వారు చాలా మంది ఉన్నారు’ అని శీర్షిక రచయిత వ్యాఖ్యానించడం విశేషం. ఆగస్ట్ 16, 1957 నాటి జాగృతి ‘స్వాతంత్ర్య సమరంపై శ్రీ ఆజాద్ వ్యాఖ్య’ (తారానాథ్) శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించింది. ఇందులో 1857 ఉదంతం మీద మొదటి విద్యామంత్రి వ్యాఖ్యలు గర్హనీయంగా ఉంటాయి. అంతటి ధీరోదాత్త ఘటన మీద స్వతంత్ర దేశంలో ఒక మంచి గ్రంథం వస్తుందని భారతీయులు చూశారు. ఒక గ్రంథాన్ని ఎస్ఎన్ సేన్ రాశారు. కానీ ఇది భారతీయులను తీవ్రంగా నిరాశపరిచింది. దీనికే మౌలానా కలాం ఆజాద్ ముందుమాట వెలయించారు. అందులో, ‘మనకు లభించిన ఆధారాల దృష్ట్యా పరిశీలించిన పక్షంలో 1857 తిరుగుబాటు ఒక ప్రత్యేకమైన పథకం జరిగిందని కాని, గొప్ప మేధావులు మరుగున ఉండి దానిని నడిపించారని గాని చెప్పలేమనే నిర్ణయానికి వస్తాము’ అని తేల్చారాయన. తన ఆప్తమిత్రుడు జవాహర్‌లాల్ నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియాలో రాసిన కొన్ని వాక్యాలను కూడా మరచిపోకుండా ప్రస్తావించారు ఆజాద్. అది: ‘ఈ తిరుగుబాటు ప్రముఖంగా భూస్వాములు, వారి అనుచరులు విదేశీయులపై వ్యతిరేకతను ఆసరాగా తీసుకుని జరిపించినదే... చరిత్రలో వారి పాత్ర ఏనాడో పూర్తయింది. భవిష్యత్తులో వారికి ఎలాంటి స్థానమూ ఉండదు’.

ఆగస్ట్ 16,1957 సంచికలో రాణీ లక్ష్మీబాయి గురించి విశిష్ట సమాచారం ఉంది. లక్ష్మీబాయి మనుమడు లక్ష్మణ్‌రావ్‌తో వామన్ హెచ్ పండిట్ జరిపిన ఇంటర్వ్యూలో (80 ఏళ్ల వయసులో ఇచ్చారు) ఆ సమాచారం ఉంది. మనకు కనిపిస్తున్న ఆ యోధురాలి బొమ్మలలో ఒకటి ఇందోర్ చిత్రకారుడు భేరు ముసావర్ చిత్రించినది. దీనిని లక్ష్మణ్‌రావు తండ్రి దామోదరరావు వేయించారు.

కంపెనీని ఈ దేశం నుంచి పారద్రోలిన ఆ హుతాత్మలకు ఇదే మా నివాళి.

– జాగృతి డెస్క్

ప్రత్యేక వ్యాసం-1



**అడవి నుంచీ, పూర్వికుల నుంచీ వచ్చిన స్వేచ్ఛా జీవనానికి సంకెళ్లు వేయాలని చూసిన చట్టాలకు ఎదురైన ప్రతిఘటనలే గిరిజనోద్యమాలు. దేశం నలుమూలలా జరిగిన గిరిజనోద్యమాలలో 1922-24 నడుమ విశాఖ మన్యంలో అల్లూరి సీతారామరాజు అనే శ్రీరామరాజు నిర్వహించిన పోరాటం పలు ప్రత్యేకతలు కలిగి ఉంది. ఆంగ్లేయుల అణచివేత మీద గిరిజనం సాగించిన దాదాపు ఆఖరిది అనదగిన విశాఖ మన్య పోరాటంలో మైదాన ప్రాంత రాజకీయ స్పృహ, సైద్ధాంతిక ఛాయ ఉన్నాయి. రామరాజు నడిపిన ఆ ఉద్యమంలోని ఈ కోణాలను ఆ మహోన్నత చారిత్రక ఘట్టాన్ని శ్రీరామరాజు నూరో వర్ధంతి (ఈ మే 7) సందర్భంగా మననం చేసుకుందాం.**

# ఆ నెత్తుటి తర్పణకు నూరేళ్లు

విశాఖ మన్యానికీ, రంపలోయకూ తిరుగుబాట్లు కొత్త కాదు. 18వ శతాబ్దం నుంచి అక్కడ అలజడులు కనిపిస్తాయి. శాంతభూపతి, ద్వారబంధాల చంద్రయ్య, రేకపల్లి అంబులరెడ్డి, కారం తమ్మనదొర, కారుకొండ సుబ్బారెడ్డి, సలాబి బోడడు, పోతుకూరి మాలడు (శివసారులు, అంటే పూజారులు) వంటి ఎందరో అక్కడ తిరుగుబాట్లు చేశారు. పైకి పోలీసు అత్యాచారాల మీద తిరుగుబాట్లు మాదిరిగా కనిపించే వాటన్నిటి ధ్యేయం స్వయం పాలన. ఈ లక్షణాన్ని పరిపూర్ణంగా ప్రతిబింబించిదే 1922-24 నాటి మన్య పోరాటం. దీని నాయకుడు అల్లూరి శ్రీరామరాజు.

శ్రీరామరాజు (జూలై 4,1897-మే 7,1924) స్వరాజ్య సమర యోధుడిగా అవతరించడం వెనుక బలమైన చారిత్రక నేపథ్యం ఉంది. 1915లో ఉద్యోగాన్వేషణ పేరుతో ఉత్తర భారతదేశం వెళ్లారాయన. మొదటి ప్రపంచ యుద్ధంలో చావో రేవో అన్నట్టు పోరుతున్న ఇంగ్లండ్‌ను చావుదెబ్బ కొట్టాలన్న యోచనలో గదర్ పార్టీ సన్నాహాలు చేసిన కాలమది. ఈ ప్రయత్నాల వెనుక జర్మనీ ఉంది. దీనినే హిందూ-జర్మన్ కుట్ర అంటారు.

రామరాజు యుద్ధపు రోజులలో యుద్ధం నేర్చుకున్నాడని 'మెయిల్' పత్రిక రాసిందని 'శ్రీ అల్లూరి సీతారామరాజు ప్రశంస' పుస్తకంలో (రామరాజు తొలి జీవితచరిత్ర, 1925) భమిడిపాటి సత్య నారాయణ). కృష్ణదేవిపేటలో ఉండగా రామరాజు వద్ద తెలుగు కావ్యాలు, హిందీ నేర్చుకున్న చిటికెల దాలినాయుడు రాసిన 'శ్రీ ఆంధ్రవీర అల్లూరి శ్రీరామరాజుగారి జీవిత చరిత్ర: మంప పితూరీ' పుస్తకంలో, ఆ యాత్రలోనే రామరాజు కలకత్తా వెళ్లి సురేంద్రనాథ్ బెనర్జీని కలుసుకున్నట్టు చెప్పారు. ఆ తరువాతే అల్లూరి తూర్పు కనుమలలోని కృష్ణదేవిపేట చేరుకున్నారు.

**ఉద్యమ జీవితానికి ఊయల**

అల్లూరి ఉద్యమ జీవితానికి ఊయల వంటిది కృష్ణదేవిపేట. జూలై 24, 1917న ఆ ఊరు చేరుకున్నారు. ఊరి పెద్ద చిటికెల భాస్కరనాయుడు ఆశ్రయం ఇచ్చాడు. ఆధ్యాత్మిక జీవితం గడిపారు రామరాజు. తాను తిలక్ మహరాజ్‌ను అభిమానిస్తానని ఒక సందర్భంలో రామరాజు చెప్పినట్టు చిటికెల దాలినాయుడు రచనలో కనిపిస్తుంది. 1920లో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమానికి పిలుపునిచ్చారు. 1921లో రామరాజు కాలినడకన నాసికా త్ర్యంబకం వెళ్లారు. అక్కడ సావర్కర్ సోదరుల అభినవ్ భారత్ విప్లవ సంస్థ ప్రభావం ఉంది. కృష్ణదేవిపేట రాగానే అధికారులు ఆయనపై దృష్టి పెట్టారు. అప్పటికే రామరాజు మన్యవాసులలో కొన్ని సంస్కరణలు తెచ్చారు. 'గాంధీజీ కార్యక్రమమంతటి లోను మద్యపాన నిషేధం, కోర్టుల బహిష్కారము-ఈ రెండూ ఆయనకు నచ్చినాయి. ఆయన గోదావరి, విశాఖపట్టణము ఏజెన్సీ ప్రాంతాలలో తీవ్రమైన ప్రచారం ప్రారంభించాడు' అంటాడు, రామరాజు బాల్య స్నేహితుడు, 'కాంగ్రెసు' పత్రిక సంపాదకుడు మద్దూరి అన్నపూర్ణయ్య. దీనితో రామరాజును నాన్ కో ఆపరేటర్ అని పోలీసులు తీర్మానించారు. 1922 జనవరిలో రామరాజును మరింతగా అనుమానించ డానికి అవకాశం ఉన్న ఘటన జరిగింది.

**మన్యం పెద్దల మొర**

మొదటి ప్రపంచ యుద్ధం ఆగింది. కరవు విజృంభించింది. ఆకలి దాడులు జరిగాయి. అందుకే ప్రభుత్వం ఉపాధి కల్పన పనులు ఆరంభించింది. మన్యంలో రోడ్ల నిర్మాణం అందులో ఒకటి. గూడెం డిప్యూటీ తహసీల్దార్ అల్ఫ్ బాస్టియన్ బినామీ పేర్లతో కాంట్రాక్టు తీసుకుని, మన్యంలో మునసబులు, ముఠాదారులను బెదిరించి గిరిజనులను పనికి రప్పించి కూలి ఇవ్వక వేధించేవాడు. ఆసియా చరిత్రలోనే ఆ రోడ్ల నిర్మాణం ఓ అమానుష ఘట్టం. ఆ చరిత్ర ఎంత విషాదమో నాటి మన్యం వైద్యాధికారి డాక్టర్ తేతలి సత్యనారాయణమూర్తి డైరీ చెబుతుందని యర్రమిల్లి నరసింహారావు తన పుస్తకం 'శ్రీ అల్లూరి సీతారామరాజు చరిత్ర (1922-24 విప్లవం)'లో గుర్తు చేశారు. నిజానికి 1882 చట్టంతో అడవిలో ప్రవేశం కోల్పోయిన ఆదివాసీలు కూలీలుగా మారిపోయారు. ఇలాంటి సమయంలో పెద్దవలస మాజీ ముఠాదారు కంకిపాటి బాలయ్యపడాలు (ఎండు పడాలు), బట్టిపనుకుల మునసబు గాం గంతన్న దొర, అతని తమ్ముడు గాం మల్లు దొర, కొండసంతలలో కూలి చేసుకుని బతుకుతున్న గోకిరి ఎర్రేసు, బొంకుల మోదిగాడు, సంకోజు ముక్కడు, కర్రి కణ్ణిగాడు వంటివారు 1922 జనవరిలో రామరాజు దగ్గరకు వచ్చి గోడు వినిపించుకున్నారు. దానితో శ్రీరామరాజు బాస్టియన్ మీద పై అధికారులకు ఫిర్యాదు రాశారు. ఫలితం- రామరాజు మన్యంలో సహాయ నిరాకరణ ఆరంభించాడన్న ఆరోపణతో ఆ జనవరి 29న ఏజెన్సీ కమిషనర్ స్వెయిన్ విచారణ జరిపాడు.

ఫిబ్రవరి 1-5 మధ్య పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. ఆ ఒకటో తేదీన సహాయ నిరాకరణను తీవ్రం చేస్తున్నట్టు గాంధీజీ ప్రకటించారు. మూడో తేదీన ఇక్కడ రామరాజును పొలిటికల్ సస్పెక్ట్‌గా భావించి నర్సీపట్నం జైలులో ఉంచారు. 5వ తేదీన జరిగిన చౌరీచౌరా ఉదంతంతో గాంధీజీ సహాయ నిరాకరణ పిలుపును ఉపసంహరించుకున్నారు. ఈ ఆకస్మిక, ఏకపక్ష నిర్ణయం ఎంతో ఆవేశంతో, ఆశతో ఉన్న యువతను ఇతర పంథాల వైపు అడుగులు వేయించింది. అలాంటి వారిలో రామరాజు ఒకరు. నర్సీపట్నం జైలులో పదహారు రోజులు ఉంచిన తరువాత పోలవరం డిప్యూటీ తహసీల్దార్ ఫజులుల్లా ఖాన్ (రాజు పినతండ్రి

రామచంద్రరాజు స్నేహితుడు) రామరాజుకు పైడిపుట్ట వద్ద యాభయ్ ఎకరాల పొలం ఇచ్చి, దుచ్చెర్తి ముఠాదారు చెక్కా లింగన్న దొర అజమాయిషీలో ఉంచారు. అక్కడ నుంచే నేపాల్ యాత్ర కోసం అనుమతి తీసుకుని మన్యంలో ఉద్యమ నిర్మాణం చేపట్టాడాయన.

మన్యవాసుల ఆగ్రహాన్ని, ఉద్యమ దృష్టిని విస్తృతం చేసి, ఏకం చేసి ఉద్యమించాలని రామరాజు భావించారు. గెరిల్లా యుద్ధ రీతిని ఎంచుకున్నారు. గెరిల్లా పోరుకు కావలసిన ఆయుధాల కోసం మన్యంలోని పోలీస్ స్టేషన్లను దోచుకోవాలని ఆయన నిర్ణయించారు. ఎండు పడాలు, గంతన్న, రామరాజు–మల్లు నాయకత్వాలలో మూడు దళాలను నిర్మించారు. ఆ ఆగస్ట్ 22 పట్టపగలు చింతపల్లి పోలీస్ స్టేషన్ మీద దాడి చేశారు– దాదాపు మూడు వందల మంది. 11 తుపాకులు దొరికాయి. ఈ ఆయుధాలు తీసుకు వెళుతున్నానని ఒక లేఖ రాసి వెళ్లారు రామరాజు. చింతపల్లి స్టేషన్ మీద దాడితోనే రామరాజు ఉద్యమ తత్త్వం తెలుస్తుంది. ఉద్యమకారుల చేత ‘వందేమాతరం–మనదే రాజ్యం’ అంటూ, ‘గాంధీజీకి జై’ అంటూ రామరాజు నినాదాలు చేయించారు. ఆగస్ట్ 23న కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ మీద దాడి జరిగింది. అంటే రామరాజును మన్య విప్లవానికి దరిచేర్చిన చోటు. కొన్ని నాటకీయ సన్నివేశాల మధ్య ఊరివారు రామరాజును స్వాగతించారు. పోలీసు సిబ్బంది పారిపోయింది. 7 తుపాకులు దొరికాయి. ఆగస్ట్ 24న రాజవొమ్మంగి స్టేషన్ (తూర్పు గోదావరి)ను ఎంచుకుని దాడి చేశారు. 8 తుపాకులు దొరికాయి. లాగరాయి ఫితూరీని సమర్థించిన నేరానికి అరెస్టయిన మొట్టడం వీరయ్యదొర అప్పుడు ఆ స్టేషన్‌లోనే ఉన్నారు (ఈయన తండ్రి సాబిలను దొర. 1879 నాటి ఫితూరీలో ఉన్నాడు). వీరయ్యదొరను విడిపించడం కూడా ఈ దాడి ఆశయాలలో ఒకటి.

‘ఆంధ్రపత్రిక’,‘కృష్ణాపత్రిక’, రాజమండ్రి నుంచి వెలువడే ‘కాంగ్రెస్’ (మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకుడు) ఆ వార్తలను ప్రచురించాయి. మన్యవాసులు వరసగా రెండు పోలీసు స్టేషన్ల మీద దాడి చేయడంతోనే మద్రాస్ ప్రెసెడెన్సీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎ గ్రాహమ్‌కు టెలిగ్రామ్‌లు వెళ్లాయి. నిజమే, 26 తుపాకులు, కొంత మందుగుండు కొండదళం చేతికి చిక్కాయి. ఈ మూడు దాడులతోనే రామరాజు పేరు మొదటిసారి తెలుగునేలంతా వినిపించింది.

స్టేషన్ల లూటీ సంగతిని ఏజెన్సీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సాండర్స్‌కూ, కలెక్టర్‌కు స్థానిక పోలీసులు తెలియచేశారు.ఆ ఇద్దరు ఆగమేఘాల మీద నర్సీపట్నం చేరుకున్నారు. క్షణాలలో చింతపల్లి, అడ్డతీగల, కోటనందూరు, మల్కనగిరి వంటి ప్రాంతాలకు పోలీసు బలగాలు చేరిపోయాయి. నర్సీపట్నం, ఏలేశ్వరం, అడ్డతీగల పోలీసు శిబిరాలయ్యాయి. స్కాట్ కవర్ట్, నెవెల్లి హైటర్, ట్రేమన్‌హేర్, చాడ్‌విక్, హ్యూమ్, షర్బీన్, డాసన్ వంటి యూరోపియన్ అధికారులంతా మన్యంలో వాలిపోయారు. ఆ వాతావరణంలోనే జైపూర్ మహారాజు ఐదు ఏనుగుల మీద పోలీసుల కోసం పంపిన సామగ్రిని సెప్టెంబర్ 3న ఒంజేరి ఘాట్‌లో రాజుదళం వశం చేసుకుంది.

మూడు పోలీస్ స్టేషన్ల మీద, ఒంజేరి ఘాట్ మీద దక్కిన విజయాల కంటే దామనపల్లి అనే కొండమార్గంలో సెప్టెంబర్ 24,1922న దక్కిన విజయం చరిత్రాత్మకమైనది. అక్కడికి రాజు దళం వస్తున్నదన్న సమాచారం తెలిసి స్కాట్ కవర్ట్, నెవెల్లి హైటర్ అనే ఒరిస్సా పోలీసు అధికారుల నాయకత్వంలో రెండు పటాలాలు వెళ్లాయి. ఇందులో హైటర్ మొదటి ప్రపంచయుద్ధంలో పాల్గొన్నాడు. ఆ ఇద్దరినీ కొండదళం మట్టుపెట్టింది. అక్టోబర్ 15న అడ్డతీగల మీద రాజు దాడి చేశారు. కానీ ఆయుధాలు దొరకలేదు.అక్టోబర్ 19న చోడవరం స్టేషన్‌లోను ఇదే అనుభవం. అప్పటికే ఆయుధాలను ట్రెజరీలకి తరలించడం మొదలయింది.

రామరాజు ఉద్యమం, కారణాలు, పరిణామాల గురించి బాస్టియన్, ఏజే హెపెల్ (ఏజెన్సీ కమిషనర్),టీజీ రూథర్‌ఫర్డ్ రాసిన నివేదికలు చాలా విషయాలు చెబుతున్నాయి. ‘తానే గూడెంకు రాజు కావలెనని రాజు తలచియుండవలెను’ అని హెపెల్ నిందమోపాడు. స్థానిక సాధారణ పోలీసులతో ఫలితం రావడం లేదని రూఢి చేసుకున్న తరువాత సెప్టెంబర్ 23, 1922న సాండర్స్ మలబార్ పోలీసు దళాలను రప్పించాడు. ఇవి కొండలలో పోరాడ గలవు. మోప్లా అల్లర్లను అణచిన ఘనత వీటిది. కానీ రామవరం అనే చోట మన్యం దళంతో తలపడినప్పుడు మలబార్ దళం వీగిపోయింది.



రామరాజు, గంతన్న దొరల సమాధులు, కృష్ణదేవిపేట

ఇది రామరాజు పోరులో రెండవ దశ. మలబారు దళాలు వచ్చిన తరువాత డిసెంబర్ 6, 1922న పెద్దగడ్డపాలెం, లింగాపురం అనేచోట్ల రాజుదళం వారితో తలపడవలసి వచ్చింది. వాళ్ల దగ్గర లూయీ ఫిరంగులు ఉన్నాయి. భీకర పోరే సాగింది. రెండుచోట్ల కలిపి ఎనిమిది మంది రాజు అనుచరులు వీరమరణం చెందారు. ఈ మృతదేహాలను మన్యంలో ఊరేగించి, గిరిజనంలో పోయిందనుకున్న భయాన్ని మళ్లీ సృష్టించారు. డిసెంబర్ 23న ఉద్యమకారులను పట్టిస్తే నగదు బహుమానాలు ఇస్తామంటూ ప్రకటన వచ్చింది. నాలుగు మాసాలు మన్యం దళం విరామం ఇచ్చింది. కానీ ఈ విరామాన్ని ఉద్యమ విరమణగా ఆంగ్లేయులు భావించారు.

ఏప్రిల్ 17, 1923న రామరాజు దళం ఆకస్మాత్తుగా అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యక్షమై మొత్తం యంత్రాంగాన్ని కలవర పరిచింది. పైగా ప్రజలు ఆయన్ని స్వాగతించడం కాదు, పూజించారు. ఆ సందర్భంలోనే చెరుకూరి నరసింహమూర్తికి (ఈయన నాన్ కో ఆపరేటర్) రామరాజు ఇంటర్వ్యూ ఇచ్చారు. అదే ఏప్రిల్ 24న ఆంధ్రపత్రికలో వెలువడింది. అన్నవరం సంఘటన తరువాత మన్యవాసుల ఉద్యమంలోకి వేగిరాజు సత్యనారాయణ రాజు(అగ్గిరాజు) వచ్చారు. ఆ ఏడాది సెప్టెంబర్ 17 రాత్రి మల్లుదొర దొరికి పోవడం ఉద్యమానికి కీడు చేసింది. ఆ సంవత్సరం డిసెంబర్‌లో కాకినాడలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు రామరాజు మారువేషంలో హాజరయ్యారు.

కాలం గడుస్తున్న కొద్దీ అణచివేత తీవ్రమైంది. అప్పటికే మన్యంలో ఉన్న బలగాలకు 1924 జనవరికి అస్సాం రైఫిల్స్ తోడుగా వచ్చింది. వీరికి కూడా మొదటి ప్రపంచయుద్ధంలో అనుభవం ఉంది.

అప్పటికి మన్యం మీద ప్రయోగించిన బలగాల సంఖ్య దాదాపు వేయి. రాజుదళం సంఖ్య వంద. అస్సాం రైఫిల్స్ అధిపతే మేజర్ గుడాల్. ఆ సంవత్సరం ఏప్రిల్‌లో గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్న థామస్ జార్జ్ రూథర్‌ఫర్డ్‌ను విశాఖ మన్యంలో పోలీసు చర్యకు స్పెషల్ కమిషనర్‌గా నియమించారు. ఏప్రిల్ నుంచి జూన్ 24 వరకే అతడి అధికారం. అంతలోనే ఉద్యమం అణగిపోవాలి. మరికొంత అస్సాం రైఫిల్స్ బలగం వచ్చింది. మన్యం పోలీసు హింసతో, అత్యాచారాలతో తల్లడిల్లిపోయింది. ఆ సమయంలోనే మే ఆరంభంలో రేవుల కంతారం అనేచోట రాజు దళం సమావేశమైంది. బ్రిటిష్ పంచన చేరినా భారతీయులను చంపరాదన్న నియమంతో నష్టం జరుగుతున్నదని ఒక వర్గం విన్నవించింది. అదే అంశం మీద చీలిక వచ్చింది. ఆ సమావేశం జరుగుతూ ఉండగానే పోలీసులు దాడి చేశారు. రామరాజు ఒక్కడు రాత్రివేళ మంప చేరుకుని, ఒక చేనులోని మంచె మీద పరున్నారు. తెల్లవారితే మే 7వ తేదీ. రాజు వేకువనే మంచె దిగి అక్కడి కుంటలో స్నానం చేస్తుండగా ఈస్ట్‌కోస్ట్ దళానికి చెందిన కంచుమేనన్, ఇంటెలిజెన్స్ పెట్రోలింగ్ సబిన్స్‌పెక్టర్ ఆళ్వార్‌నాయుడు బలగంతో చుట్టుముట్టి అరెస్టు చేశారు.

అరెస్టు చేసిన రాజును ఒక నులక మంచానికి కట్టి, గిరిజనుల చేతనే మోయిస్తూ కృష్ణదేవిపేటకు పయనమయ్యారు. రామరాజును ఎక్కడైతే జనం ఒక దైవంగా ఆరాధించారో అక్కడే ఆయనను బంధించి తెచ్చిన బందిపోటుగా చూపించదలిచారు. ఆ దారిలోనే ఉంది కొయ్యూరు. అక్కడే రామరాజును గుడాల్ ఒక చెట్టుకు కట్టి కాల్చి చంపాడు. రాజు ఎక్కడైతే ఉద్యమకారునిగా రూపొందాడో ఆ కృష్ణదేవిపేటలోనే తాండవ ఒడ్డున అంత్యక్రియలు జరిపారు.

మే 6, 1924న అగ్గిరాజు దొరికిపోయాడు. మే 26న ఎండు పడాలును స్థానికులే హత్య చేశారు. జూన్ 7న గాం గంతన్నను పోలీసులు కాల్చి చంపారు. ఈ మధ్యలో ఎందరో ఉద్యమకారులను గ్రామస్థులు, బంధువులు పోలీసులకు అప్పగించారు. మల్లుదొరకి, బోనంగి పండుపడాలుకి మొదట ఉరిశిక్ష పడింది. తరువాత ద్వీపాంతర శిక్షగా మారింది.

నిజానికి ఉద్యమకారుల 'యుద్ధ నేరాలు' విచారించడానికి 1922లోనే విశాఖపట్నంలో స్పెషల్ ట్రిబ్యునల్ ఏర్పాటయింది. ఎల్‌హెచ్ అరంట్ అడిషనల్ సెషన్స్ జడ్జి. 270 మంది వరకు ఉద్యమకారులను ట్రిబ్యునల్ విచారించి రకరకాల శిక్షలు విధించింది. 12 మందిని అండమాన్ కాలాపానీకి పంపారు. ఏ విధంగా చూసినా రామరాజు ఉద్యమంతో మద్రాస్ ప్రెసిడెన్సీ పాలనా కేంద్రం సెయింట్ జార్జి కోట భయపడిందన్న మాట నిజం. ఈ ఉద్యమం అణచివేయడానికి రూ.25 లక్షలు అని కొందరు, 40 లక్షల రూపాయలు వెచ్చించవలసి వచ్చిందని కొందరు రాశారు. రాజు ఉద్యమంతో అటవీ చట్టాల కాఠిన్యం తగ్గింది. ఆ త్యాగం వృథా కాలేదు. కొమురం భీం వంటివారికి స్ఫూర్తిగా నిలిచాడు. ఉద్యమం ఏ సమాజ శ్రేయస్సు కోసం ఉద్దేశించినదో అదే సమాజాన్ని బాధించరాదన్నది ఆయన నమ్మకం. హింస, విధ్వంసమే ఉద్యమం కాదని ఆయన విశ్వసించారు. అలా రామరాజు భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అమేయమైన స్థానం సాధించుకున్నారు. అట్టడుగు వర్గాలలోను దేశభక్తి, స్వేచ్ఛాకాంక్ష ఉంటాయని రామరాజు నిరూపించారు. ఏ వర్గం త్యాగమైనా గౌరవించదగినదే, అందరి త్యాగ చరితలు నమోదైతేనే స్వరాజ్య సమర చరిత్ర రచనకు పరిపూర్ణత సిద్ధిస్తుంది.

**–డా. గోపరాజు నారాయణరావు**

**(మే 7, 2025 రామరాజు వర్ధంతి శతాబ్ది ముగింపు. ఈ శతాబ్ది కార్యక్రమాలను భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు)**

## ఎన్నాళ్లీ మారణహోమం?

**క**శ్మీర్‌లో పెహల్గావ్‌లో సంఘటనలు చూస్తుంటే మనసు పిండి వేస్తుంది. భారతదేశం అంతా మనదే కదా! అందులో మోడీజీ వచ్చిన తర్వాత కశ్మీర్‌కు రక్షణ లభించింది. పర్యాటకులు పెరిగారు. ఆ నిశ్చింతతో బయలుదేరిన పర్యాటకులకు తీరని విషాదం మిగిల్చింది ఈపర్యటన.

మతం పేరిట మారణహోమం చేస్తూ అది కూడా సైనికుల బట్టలు ధరించి వచ్చి ఇలా ప్రాణాలను పొట్టన పెట్టుకోవడం హేయమైన చర్య.

కుటుంబంతో నవ్వులు పూయించుకుందామని వెళితే విషాదాన్ని గుండెలో మోసుకుని భారంగా వెనుతిరిగి వస్తామని వారు కలలో కూడా ఊహించుకొని ఉండరు.

ఈ నెత్తురోడుతున్న సంఘటనను చూస్తే మనసు బాధతో మెలి పెట్టడమే కాకుండా కళ్లల్లో అగ్ని కూడా పుడుతుంది. ఇంకా ఎన్నాళ్లు చేస్తారు ఈ మారణహోమం.

అమాయక ప్రజలను పొట్టన పెట్టుకొని గుప్పెడంత దేశం ఏం సాధిస్తుంది? పోనీ అక్కడి వారికైనా సరిగ్గా చూసుకుంటున్నారా అంటే అదీ లేదు. ధ్యాస అభివృద్ధి మీద పెట్టకుండా ఉగ్రవాదం మీద పెట్టిన దేశం అది. భారతదేశము పెట్టిన భిక్ష ఆ దేశం. కానీ క్షణం క్షణం కాలు దువ్వుతూ ఓపికను పరీక్షిస్తుంది.

ఈ దేశాన్ని రక్షించగలవారు మన ప్రధానమంత్రి మోడీ ఒక్కరే.

వారు సరైన నిర్ణయం తీసుకొని న్యాయం చేస్తారని ఆశిస్తూ.... అమరులైన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను కన్నీటితో.

**– లక్ష్మి మదన్,**
**హైదరాబాద్.**



బంగారాన్ని దొంగ రవాణా చేయడంలో దేశంలో కేరళ తర్వాతే ఏ రాష్ట్రమైనా. కాంగ్రెస్ నాయకత్వంలోని యు.డి.ఎఫ్ ప్రభుత్వ హయాంలో కూడా బంగారం రవాణాలో చాలా తక్కువ స్థాయిలో ఉన్న కేరళ, వామపక్షాల నాయకత్వంలోని ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వ హయాంలో అగ్ర స్థానానికి చేరుకున్నట్టు ఆ రాష్ట్రంలో ఎవరినడిగినా చెబుతారు. బంగారం రవాణా కేసుల్లో ప్రస్తుతం కేరళ అగ్రస్థానంలో ఉన్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల ఒక నివేదికలో తెలియజేసింది. ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించకుండా విమానాశ్రయాల ద్వారా, నౌకాశ్రయాల ద్వారా రాష్ట్రంలోకి బంగారాన్ని రవాణా చేయడం అన్నది కేరళలోని మంత్రులు, అధికారులకు తెలిసినంతగా మరొకరికి తెలియదు. కేరళ మరో అడుగు ముందుకు వేసి, దౌత్యపరమైన సరుకు రవాణా (కార్గో) ద్వారా రాష్ట్రంలోకి బంగారాన్ని అక్రమంగా రవాణా చేయడంతో దాని గుట్టు పూర్తిగా రట్టయింది.



# దేవభూమిలో దొంగ

రెవెన్యూ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం గత నాలుగేళ్లలో కేరళలో 3,173 బంగారం అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. అక్రమ రవాణాదార్ల నుంచి 2,300 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది. కేరళ తర్వాత తమిళనాడు, మహారాష్ట్ర రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. దేశంలోని ప్రముఖ బంగారం అక్రమ రవాణా దార్లంతా కేరళనే తమ వ్యాపార కేంద్రంగా ఎంచుకుంటుంటారు. దేశం మొత్తం మీద కేరళకే ఈ రకమైన డిమాండ్ ఎక్కువగా ఉంది. తిరువనంతపురం, కొచ్చి, కోళికోడ్ విమానాశ్రయాల ద్వారానే ఎక్కువగా బంగారం స్మగ్లింగ్ జరుగుతుంటుంది. నిజానికి, అక్కడి విమానాశ్రయాలు, నౌకాశ్రయాల్లో ఇందుకు సంబంధించిన అధికారులు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఈ అక్రమ రవాణాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడం జరుగుతోంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఈ అక్రమ రవాణాతో 'సన్నిహిత' సంబంధాలున్నందువల్ల ఎక్కువ పర్యాయాలు ఈ అక్రమ రవాణాలు విజయవంతంగానే పూర్తవుతున్నాయి. గల్ఫ్ దేశాల నుంచి ఇక్కడికి బంగారం ఎక్కువగా అక్రమ రవాణా అవుతుంటుందని అధికారుల ద్వారా తెలిసింది.


పినరయి

**దిగ్భ్రాంతికర విషయాలు**

ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ అధికారుల దృష్టికి ఈ అక్రమ రవాణా వ్యవహారం వచ్చి, వారు కేరళ మీద దృష్టి పెట్టిన తర్వాత తేలిందేమిటంటే, 2020-24 సంవత్సరాల మధ్య కేరళకు సుమారు 150 కిలోల బంగారం అక్రమంగా రవాణా అయింది. కాగా, 2020 డిసెంబర్ ప్రాంతంలో సుమారు రూ. 15 కోట్ల విలువైన 30 కిలోల బంగారం దౌత్యపరమైన కార్గో ద్వారా తిరువనంతపురం విమానాశ్రయంలో దిగింది. దౌత్యపరమైన కార్గోను తనిఖీ చేయడానికి వీల్లేదనే నిబంధన ఉన్నందువల్ల ఆ నిబంధనను అడ్డుపెట్టుకొని బంగారాన్ని రహస్యంగా దిగుమతి చేసుకోవడం జరుగుతోంది. ఈ విషయం తెలిసిన ఈడీ, సీబీఐ అధికారులు కేరళ మీద దృష్టి పెట్టినప్పుడు చాలా సంవత్సరాల నుంచి కేరళకు బంగారం అక్రమంగా రవాణా అవుతున్నట్టు, దీని వెనుక ఐ.ఎ.ఎస్ అధికారులు, పలువురు రాజకీయ నాయకులు ఉన్నట్టు తెలిసింది. ఈ అక్రమ రవాణా కేసులు వెలుగులోకి రావడం కేరళలో సంచలనం సృష్టించింది. వీటికి అండగా కేరళ ప్రభుత్వంలోని సీనియర్ అధికారులతో పాటు పలువురు కేరళ రాజకీయ నాయకులు కూడా ఉండడం రాష్ట్ర ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. తిరువనంతపురంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దౌత్య కార్యాలయం మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి స్వప్నా సురేశ్ విస్తృత స్థాయిలో ఒక బంగారం అక్రమ రవాణా వ్యవస్థనే నిర్వహిస్తున్నట్టు ఈడీ, సీబీఐ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది.

దౌత్య సంబంధమైన మార్గాలను దుర్వినియోగం చేస్తుండడం, ఒక ఐ.ఎ.ఎస్ అధికారి ఆధ్వర్యంలో ఈ అక్రమ రవాణా అంతా జరుగుతుండడం, ఈ దురాగతంలో పలువురు ఐ.ఎ.ఎస్ అధికారులకు సంబంధం ఉండడం, చివరికి కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ కు కూడా ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్టు అనుమానాలు రావడం దేశవ్యాప్తంగా కూడా సంచలనం సృష్టించింది. (యూఏఈ) తదితర గల్ఫ్ దేశాల నుంచి ఇక్కడికి బంగారం అక్రమ రవాణా జరుగుతున్నట్టు ప్రాథమిక విచారణంలో వెల్లడైంది. నిజానికి, 2019 డిసెంబర్ నుంచి ఈ అక్రమ రవాణకు సంబంధించిన సమాచారం బయటికి వెల్లడవుతున్నప్పటికీ, అంతకు ముందు కూడా బంగారం స్మగ్లింగ్ జరుగుతున్నట్టు



# బంగారం

ఈడీ గుర్తించింది. కాగా, 2020 జూలైలో దౌత్యపరమైన కార్గోలో వచ్చిన వస్తు సామగ్రిని తిరువనంతపురంలోని కస్టమ్స్ అధికారులు కొద్ది పాటి అనుమానం మీద తనిఖీ చేయడంతో 30 కిలోల బంగారం బయటపడింది. ఇది యూఏఈ దౌత్య కార్యాలయం నుంచి వచ్చింది.

**అధికారుల ప్రమేయం**

అధికారులు దీనిపై దర్యాప్తు ప్రారంభించినప్పుడు కొన్ని సంచలనాత్మక, ఆందోళనకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేరళ ప్రభుత్వంలోని స్పేస్ పార్క్ సంస్థకు చెందిన పి.ఎస్. సారిత్ అనే అధికారికి, స్వప్నా సురేశ్‌కు ఈ వ్యవహారంతో సంబంధమున్నట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరాయి విజయన్ దగ్గర ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న ఎం. శివశంకర్‌తో ఈ స్వప్నా సురేశ్‌తో సన్నిహిత సంబంధాలున్నందువల్ల సహజంగానే ఆయన మీద కూడా అనుమానాలు కలిగాయి. రాజకీయంగా ఒత్తిడి రావడంతో విజయన్ ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేయడం జరిగింది. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు, సారిత్, స్వప్నలను విచారించడంలో ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులకే కాకుండా దౌత్యవేత్తలు, మరి కొందరు స్మగ్లర్లకు కూడా ఈ అక్రమ రవాణా నెట్ వర్క్‌లో స్థానం ఉన్నట్టు వెల్లడైంది. అవినీతి, మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ శివశంకర్‌ను అరెస్టు చేసింది. ఈ వ్యవహారం మీద సమగ్ర దర్యాప్తు జరగాలని, విజయన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు కోరడం ప్రారంభించడంతో ఇది రాజకీయ మలుపు తీసుకుంది.


స్వప్న సురేశ్ తో పాటు మరికొందరు ప్రభుత్వ అధికారులు, దౌత్యవేత్తలు, రాజకీయ నాయకుల మీద అవినీతి, మనీలాండరింగ్, మోసం, అధికార దుర్వినియోగం వంటి కేసులను ఈడీ నమోదు చేసింది. దుబాయ్, ఇతర గల్ఫ్ దేశాల దౌత్యవేత్తలకు, దౌత్యాధికారులకు, కేరళలోని పాలక పక్ష నాయకులకు ఈ అక్రమాలు, అవినీతితో సంబంధం ఉన్నట్టు గుర్తించిన ఈడీ వీరందరి పైనా కేసులు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తోంది. రెండేళ్ల క్రితం ఈడీ ఒక పూర్తి స్థాయి అభియోగ పత్రాన్ని రూపొందించింది. ఆర్థిక సంబంధమైన ఏర్పాట్లు చేయడంలో, హవాలా కార్యకలాపాలు సాగించడంలో సిద్ధహస్తుడైన సందీప్ నాయర్ అనే వ్యాపారవేత్త ఈ వ్యవహారాలన్నిటిలో స్వప్నా సురేశ్ కు చేదోడు వాదోడుగా ఉంటూ వచ్చాడు. అక్రమ రవాణాకు సంబంధించిన ప్రణాళికంతా ఇతని చేతుల మీదుగానే జరిగేది. తిరువనంతపురంలోని యూఏఈ దౌత్య కార్యాలయంలో ప్రజా సంబంధాల అధికారిగా పనిచేసిన సారిత్‌ను పోలీసులు ఆ తర్వాత అరెస్టు చేశారు. అతనే ఎప్పుడు, ఎలా, ఏ మార్గంలో బంగారాన్ని తరలించాలన్నది చెప్పేవాడు.

ఇక యూఏఈకి చెందిన ఫైజల్ ఫరీద్ అనే వ్యక్తి ఈ అక్రమ రవాణాకు అవసరమైన ఆర్థిక సహాయం అందజేసేవాడు. యూఏఈ దౌత్య కార్యాలయ సిబ్బందిలో చాలా మంది ఈ కార్యకలాపాల్లోనే మునిగి తేలుతుండేవారని తెలిసింది. కేరళలో ఈ అక్రమ రవాణాతో సంబంధమున్న బ్యూరాక్రాట్లంతా విజయన్‌కు సన్నిహితులు కావడం వల్ల వామపక్ష ప్రభుత్వంపై మాయని మచ్చ పడింది. స్వప్నను బెయిల్ మీద విడుదల చేశారు కానీ, శివశంకర్, సందీప్ నాయర్‌ను మాత్రం అరెస్టు చేసి విచారిస్తున్నారు. స్వప్న, సందీప్ నాయర్ లకు చెందిన కొన్ని డొల్ల కంపెనీల ద్వారా ఆర్థిక లావాదేవీలు జరుగుతుండేవని, యూఏఈలోని దౌత్య అధికారులకు, కేరళలోని యూఏఈ దౌత్య కార్యాలయంలోని అధికారులకు ఎవరి వాటాలు వారికి సకాలంలో అందుతుండే వని ఈడీ అధికారులు తమ ప్రాథమిక నివేదికలో వెల్లడించారు. ఈ అక్రమ రవాణా వ్యవస్థకు ప్రధాన నిర్వాహకురాలైన స్వప్నా సురేశ్, మరో అధికారి శివశంకర్ తమ హోదాను అడ్డుపెట్టుకుని, కస్టమ్స్ అధికారులతోనూ, దౌత్యవేత్తలతోనూ సంబంధాలు పెంపొందించుకుని, పలువురు పాలక పక్ష నాయకులను కూడా కలుపుకుని ఏటా కోట్లాది రూపాయల స్మగ్లింగ్ జరుపుతు న్నట్టు ఈడీ, సీబీఐలు గత ఫిబ్రవరిలో బయటపెట్టిన తమ తుది నివేదికలో వెల్లడించాయి. ఇన్నేళ్లుగా జరుగుతున్న ఈ బంగారం స్మగ్లింగ్ వ్యవహారం ముఖ్యమంత్రి విజయన్‌కు తెలియకుండా జరిగే అవకాశం ఉందా అని ప్రతిపక్షాలు నిగ్గదీస్తున్నాయి. కేరళలోని వామపక్ష ప్రభుత్వాన్ని ఇది దెబ్బకొట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.




**జి.రాజశుక**

**సీనియర్ జర్నలిస్ట్**

# కొమ్మూరి



కొమ్మూరి పద్మావతి.
జనన మరణాలు చెన్నైలో.
అరవై రెండేళ్ల జీవనకాలం.
కథా రచయిత్రి, తొలితరం రంగస్థల నటీమణి,
సంగీతంలో దిట్ట, రేడియో ప్రసంగకర్త.
ప్రధానంగా సంస్కరణాభిలాష.
ఇన్ని ప్రత్యేకతలున్నా – ఏనాడూ పురస్కార
సత్కారం కోరలేదు. బిరుదులూ పదవులను
కోరుకోలేదు. ప్రచారానికి బహుదూరం.
ఇదంతా సాధ్యమేనా అంటే, ఆమెకు సాధ్యమే.
ఈ మే నెలలో స్మృతిలోకి తెచ్చుకుంటున్నాం.
అదే ప్రధానంగా యాభై ఐదేళ్ల తర్వాత...
ఇప్పటికీ.
ఎక్కడి 1970! ఇప్పుడిది 2025.
కళాత్మకతకు ముగింపు ఉంటుందా
ఎక్కడైనా?
ఉండదుగాక ఉండదు.
ఆమెను తలవని హృదయం ఉండదంతే!
ఎందుకంటే, ఆ ప్రజ్ఞ బహుముఖం కాబట్టి.
'మా అమ్మ ప్రజ్ఞావతి' అనేవారు తనయ
ఉషారాణి.
పద్మావతి... ప్రజ్ఞావతి. అలా ఎలా
అయ్యారంటే...

అది 1908. ఆ ఊరు చెన్నై.

ఆ నగరంలోనే పద్మావతీ దేవి జననం. తల్లిదండ్రులు సామాజిక దృక్పథం ఉన్నవారు. ఉద్యోగ, సంపాదనపైనే ఆధారపడేవారు కాదు.

అందుకే ఆమెకీ మొదటి నుంచి సమాజ హిత చింతన. వ్యక్తిగత ఆర్జనపైన విముఖత. చేసే ప్రతీ పనీ తోటివారికి ఎంతో కొంత ఉపకరించాలన్న తపన, ఉత్సుకత.

చదువు, సంగీతం, వివాహం. ఈ దశలన్నీ అయ్యాయి. అప్పట్లో నాటక రంగస్థలాన బళ్లారి రాఘవ ప్రాభవం. అనేకానేక భాషల్లో ప్రదర్శనలిచ్చిన అనుభవం. దేశ విదేశాల్లో పర్యటనలు సాగించి, భారతీయ కళను పరివ్యాప్తం చేసిన ఘనతత్వం.

స్త్రీ పాత్రలను వారే పోషించాలన్నది రాఘవ నాదం, విధానం. భావం, భాష, శైలి, చురుకుదనం, సమయస్ఫూర్తి నిండిన వనితల పాత్ర పోషణతో రంగస్థలం శోభించాలన్నదే ఏకైక అభిమతం. అందిపుచ్చుకున్నారు పద్మావతి. సాంఘిక, పౌరాణిక నాటక ప్రదర్శనలతో అలవోకగా దూసుకెళ్లారు.

మొదటి పాత్ర పోషణం 'లీలావతి'గా. ప్రహ్లాదుని మాతృమూర్తిగా భక్తి, ధర్మనిరతి కలిగిన వ్యక్తిగా. లీల అంటే భగవానుని లీల. ప్రహ్లాదం అనేది ఆత్మానంద సూచిక. భక్తప్రహ్లాదను చూసి లోలోన ఆనందించిన జనని. ఆత్మశుద్ధి సమన్విత. అంతటి కీలకపాత్రలో నటించడం కాదు... జీవించేవారు పద్మావతి!

భక్త రామదాసు, చంద్రగుప్త, మరెన్నో చారిత్రక నాటక రూపాల్లో అభినయించేవారు. పాత్ర నేపథ్యం గ్రహించి, పూర్వాపరాలు పరిశీలించి, సంభాషణలతో పాటు వ్యక్తీకరణ పటిమకు ప్రాధాన్యమిచ్చి, వేదికమీద నటరాణిగా నిలిచేవారామె.

భక్తి ప్రపత్తి చాటాలన్నా, ఉత్కంఠ భరితమైన అభినయ రీతిని కనబరచాలన్నా మరెవరైనా ఆమె తర్వాతే! సమకాలీన సమస్యలను ప్రతిఫలించే సాంఘిక నాటకాలతోనూ ప్రేక్షకుల ఆదరణను చూరగొన్న సందర్భాలు అనేకం.

నాటక ప్రదర్శనల మధ్య కాలవ్యవధిలో అతివలు ఎదుర్కొనే పలు స్థితిగతుల మీద పరిశీలనలు, అధ్యయనాలు సాగించారు. పరిష్కార మార్గాల అన్వేషణ క్రమంలో ఎన్నెన్నో పుస్తకాలు చదివారు. సంస్కరణవాదులతో చర్చలు సాగించి, ఆ అంశాలకు అక్షరరూపం ఇచ్చేవారు. వాటిని ప్రాచుర్యానికి తెచ్చి, ఆ విధంగా తనవంతు సేవలను విస్తారంగా అందించిన క్రియాశీలత.

ఆలోచనలకు, ఆచరణకు అంతటి సమన్వయం కేవలం ఆమెకే సాధ్యపడింది. ప్రజాదరణ పొందడం తక్షణ ఫలితం.

డాక్యుమెంటరీ చిత్రరంగంలో సైతం ఆమెది చెదరని ముద్ర. ఆ రోజుల్లోనే కొన్నింటికి వ్యాఖ్యాతగా పనిచేశారు. ప్రస్ఫుటమైన ఉచ్చారణతో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకున్నారు. రచనను రూపుదిద్దడం, గాత్ర సహాయం అందించడంలోనూ ప్రత్యేకత నిరూపించుకోవడంతో పద్మావతి పేరు ఊరూవాడా మారుమోగింది.

ఆమె శతజయంతి మహోత్సవాలు 2008లో అయ్యాయి. అప్పుడు కొందరి అనుభవాలు వింటుంటే, ఎంతో విస్మయం కలిగింది. పద్మావతి గురించిన ఆ ప్రజ్ఞ అనుభవపరంపరలు తెలుసుకుంటే – ఒక వ్యక్తి ఇంతటి ప్రావీణ్యత గడించడం అసలు సాధ్యమయ్యే పనేనా అనిపిస్తుంది. ఉదాహరణకు రచనారంగం. ఆమె కలం విన్యాసం.

'పొగడదండ' కథనే తీసుకుందాం. ఇందులో సీతది కీలకపాత్ర. ఆమెకి పెళ్లి చేసి తెగ సంబరపడుతుంది మేనత్త. అయితే ఆ వివాహం ఆ అమ్మాయికి అస్సలు ఇష్టంలేదని తెలుసుకోలేక పోతుంది. 'పొగడపూల దండ' అనడంలోనే కథానేపథ్యం స్పష్టమవుతుంది చదువరికి. తెల్లటి పొగడపూలు. రాలినపుడు తెల్లదనం కోల్పోయి, లేత గోధుమ వన్నెకు మారిపోతాయి. సువాసన మటుకు అలాగే ఉంటుంది. పరిమళం వీడదు. చిట్టి నక్షత్రాల మాదిరి ఉండే ఆ పూలు – చెట్ల నిండా విరగబూస్తుంటాయి. అటు తర్వాత ఒకటొకటిగా రాలి నేలవాలుతుంటాయి. ఈ వివరాలు తెలిసి కథను చదువుతుంటే, ఎంతైనా భావార్థం అవగతమవుతుంది మనందరికీ!

ఈ ఒక్క కథా ఉదాహరణ చాలదా– కొమ్మూరి పద్మావతీ దేవిలోని సామాజిక స్పృహ, అవగాహన శక్తి ప్రాధాన్యం తెలియడానికి? ఏ వాక్యం రాసినా అందులో ప్రతీకాత్మకత ఉండేది. స్త్రీ సమస్యలను పరిష్కరించి తీరాలన్న గట్టి పట్టుదల కనిపించేది.

బళ్లారి రాఘవ సతీమణి కృష్ణమ్మ. పిలిచేపేరు 'పెద్దమ్మ' అని పద్మావతీదేవే తన రచనలో



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

వివరించారు. రచనాకాలం 1940-1945 మధ్యన. అంటే అప్పటికి రచయిత్రి పద్మావతికి నలభై ఏళ్లలోపు వయసు. పెద్దమ్మ దొడ్డ మనసును ఎంతో బాగా విపులీకరించారు.

నిదర్శనం చూద్దాం - (రచయిత్రి వాక్యాల్లోనే)....

**'పెద్దమ్మ చేసే ప్రతీ పనిలో విశేషమే ఉంది. ఇంటికి ఆడపిల్లలెవరైనా వస్తే ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంటుంది. వాత్సల్యంగా పలకరిస్తుంది. కళకళలాడే కళ్లు. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుంది. నిండుకుండ తొణకదు అంటారు కదా. సరిగ్గా అదే విధంగా.'**

ఇవే వాక్యాలు పద్మావతికీ వర్తిస్తాయి. ఆదరణలో తనూ పెద్దమ్మ మాదిరే! తన (పద్మావతి) కూతురు ఉషకి పెద్దమ్మ పెట్టిన పేరు- సుభద్ర. చెవికి ఇంపుగా ఉంది కదూ ఆ పేరు!

స్త్రీలు నాటకరంగంలోకి ప్రవేశించాలన్నది బళ్లారి రాఘవ విధానమైతే, ప్రథమంగా ఉత్సాహ



# ప్రజ్ఞావతి

ప్రోత్సాహాలు అందించింది పెద్దమ్మే! (ఆయనా భార్యను అలానే పిలిచేవారు).

ఆదర్శాన్ని ఆచరణగా మార్చడం పెద్దమ్మ అలవాటు. నాటక ప్రదర్శన కోసమే పలు భాషలు నేర్చుకుంది. అనేక పాత్రలను పోషించింది. అదే మాదిరిగా పద్మావతి పయనం కొనసాగింది. మొదటి నుంచి చివరిదాకా ఆ ఉత్తేజమే! ప్రతిభకు ఊతం తోడైనట్లు.

**'చిట్టి తండ్రి'** అని పద్మావతి రాసిందీ మరో **కథానిక. అందులోని సంభాషణలు సహజ సుందరత్వాన్ని చూద్దాం ఇప్పుడు.**

**'బావా! అమ్మాయి కావాలా, అబ్బాయి కావాలా' అడిగింది.**

**'నే చెప్పనా! నీకేమో అబ్బాయి. అక్కయ్యకి అమ్మాయి. అవునా' అంది మళ్లీ. అంతా నవ్వారు.**

**ఆ తర్వాత ఒక రోజున - బాలచంద్రుడి లాంటి బంగారు కొడుకును కంది సుశీల. పసివాడిని చూసి అందరూ మురిసిపోయారు.**

**కాలపరిణామంలో....**


**ఆ నొక్కుల నొక్కుల జుట్టూ, నవ్వితే బుగ్గలమీద సొట్టలూ చూడు- అంటూ కొనసాగుతుంది కథ. ఈ రచనలో ఎన్నెన్ని మలుపులో చెప్పలేం. ముగింపును ఏ మాత్రం ఊహించలేం.**


సాంఘిక నాటక చరిత్ర గురించి చెప్పాల్సి వస్తే మళ్లీ మనం 1931లోకి వెళ్లాల్సిందే. అది చెన్నై, అక్కడి ప్రదర్శన థియేటర్‌లో మొదటగా నాటకాన్ని వేశారు. తప్పెవరిది? అనే ప్రదర్శన అది. నటుడు బళ్లారి రాఘవ అయితే, నటి మరెవరో కాదు- పద్మావతి!

కొమ్మూరి పద్మావతీదేవి కుటుంబీకులు రచనారంగంలో పేరెన్నిక గన్నవారు. కుమార్తె ఉషారాణి దేశ రాజధాని నగరంలోని ప్రసిద్ధ పత్రికలో పనిచేశారు. కథలు, నవలలు, ఇంకెన్నో ప్రక్రియల్లో రచనలు వెలువరించారు. సాహిత్యమే తన వృత్తి ప్రవృత్తీ అనేవారామె. బాలసాహిత్య ప్రోత్సాహానికి ఎంతో పరిశ్రమించారు. స్ఫూర్తి తన తల్లి నుంచే లభించిందన్నారు.

కుమారుడు సాంబశివరావు తన మాతృమూర్తి గురించి చెప్తూ ఒక సందర్భంలో 'ఆమె ప్రజ్ఞా పాటవాలు ముగ్ధుల్ని చేస్తాయి ఎవరినైనా' అన్నారు. అందువల్లనే 'పద్మావతి కాదు - ప్రజ్ఞావతి' అని పిలిచి తలచుకోవాలనిపిస్తుంది ప్రతీ ఒక్కరికీ.

ఎంతగా ఎదిగారో, పేరు పొందారో ఆమె! అయినా సత్కారాలకు దూరంగా ఉంటూ, సత్కార్యాలను దగ్గరుండి చేయించడం పద్మావతీదేవి సహజ స్వభావం. అదే తన ఘన విజయ రహస్యం. ★





# యోగి గోరక్షణ

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అంటే బుల్డోజర్ బాబాగా ప్రచారం చేయడం వెనుక చాలామందికి దురుద్దేశమే ఉంది. ఆయన హంతకులను వేటాడతారు. అందులో సందేహం లేదు. పదే పదే అదే తప్పు చేసేవాళ్లను ఎన్‌కౌంటర్ చేసే అధికారం కూడా పోలీసులకి ఇచ్చారు. వీటినే ఎక్కువ చేసి చూపుతూ, యోగి చేస్తున్న మరొక గొప్ప సేవాకార్యక్రమాన్ని వెలుగులోకి రాకుండా చేస్తున్నారు. అదే యోగి చేపట్టిన గోరక్షణ కార్యక్రమం.

2017లో యోగి ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటి నుంచి కూడా గోరక్షణను తమ ప్రాధామ్యాలలో ఒకటిగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం స్వీకరించింది. గోరక్షణను గ్రామీణాభివృద్ధిలో, సహజ సేద్యంలో, జంతు సంక్షేమంలో భాగంగా నిర్వహిస్తున్నారు. గ్రామీణ జీవితంలో, సేద్యంలో సమస్యలు సృష్టించే ఎవరికీ చెందని ఆవులు, ఎద్దుల గురించి కూడా ఈ పథకం చేపట్టారు. ఇందులో ఒకటి ఎవరికీ చెందకుండా వీధులలో తిరిగే ఆవులను వ్యక్తులకు అప్పగించి, వాటి పోషణ చూడడానికి నిధులు ఇవ్వడం అలా 2.37 లక్షల ఆవులను వ్యక్తులకు అప్పగించారు. ఈ పథకం పేరు ముఖ్య మంత్రి సహభాగితా యోజన. ఇలా ఆవును పోషించేందుకు తీసుకున్న వ్యక్తికి రోజుకు రూ. 50 వంతున చెల్లిస్తారు (మొన్న ఫిబ్రవరి వరకు రూ. 30 చెల్లించేవారు). ఇది కేవలం పశు రక్షణే కాదు, ఆవులను దత్తత తీసుకున్న వారికి జీవనోపాధిగా కూడా ఉపయోగపడుతున్నది. ఈ ఆవులు ప్రధానంగా ఒట్టిపోయినవే. ఇవే గ్రామాలలో, పొలాలలో సమస్యగా ఉంటాయి. పైగా యోగి హయాం నుంచి 1955 నాటి ఉత్తరప్రదేశ్ గోసంరక్షణ చట్టాన్ని కూడా కఠినంగా అమలు చేస్తున్నారు.

గడచిన ఎనిమిదేళ్లలో యోగి ప్రభుత్వం 7,713 గోరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో 16 లక్షల ఆవులు ఆశ్రయం పొందుతున్నది. ఇవన్నీ ఎవరికీ చెందని గోసంతతే. ఇలాంటి ఆవుల కోసం 2025-2026 ఆర్థిక సంవత్సరంలో రూ. 2000 కోట్లు కేటాయించింది. విస్తృత



# రాహుల్ తల బొప్పి కట్టింది!

'మన స్వాతంత్ర్య సమరయోధుల గురించి ఇలా మాట్లాడడానికి మరొకసారి సుప్రీంకోర్టు అనుమతించదు' కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి దేశ సర్వోన్నత న్యాయస్థానం చేసిన హెచ్చరిక ఇది. మరొకసారి ఇదే విధంగా స్వాతంత్ర్య సమరయోధుల మీద బాధ్యతారహితంగా మాట్లాడితే, తామే స్యుమోటోగా కేసును స్వీకరిస్తామని సుప్రీం కోర్టు రాహుల్ గాంధీని తీవ్రంగా హెచ్చరించింది కూడా. వినాయక్ దామోదర్ సావర్కర్ మీద పలు సందర్భాలలో రాహుల్ గాంధీ నోరు పారేసుకున్న సంగతి తెలిసినదే. ఇలా అత్యున్నత న్యాయస్థానం చీవాట్లు పెట్టినా, కింది కోర్టు రాహుల్‌కు జారీ చేసిన సమన్స్ మీద మాత్రం స్టే విధించింది. కానీ రాహుల్ మీద నమోదైన క్రిమినల్ డిఫమేషన్ కేసు విచారణ యథాప్రకారం జరుగుతుందని ప్రకటించింది. 'మీకు స్టే మంజూరు చేస్తున్నాం. కానీ బాధ్యతారహిత ప్రకటనలు విషయంలో కట్టడి చేస్తున్నాం. మరొకసారి మాట్లాడితే మాకు మేమే కేసును స్వీకరిస్తాం. మన స్వాతంత్ర్య సమరయోధుల గురించి ఇలా మాట్లాడడానికి మేం అనుమతించబోం. మనకు స్వాతంత్ర్యం తెచ్చిన వారి గురించి ఇలాగేనా మాట్లాడేది?' అంటూ రాహుల్ తరపున కేసు వాదిస్తున్న అభిషేక్ మనుసింఘ్విపై జస్టిస్ దీపంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మండిపడింది.

వీరసావర్కర్ బ్రిటిష్ బానిస అంటూ, బ్రిటిష్ వారితో కుమ్మక్కయ్యారంటూ, వారి దగ్గర పింఛన్ తీసుకున్నారంటూ రాహుల్ గాంధీ ఇచ్చిన ప్రకటనల మీద నమోదైన ఈ కేసులో వాదోపవాదాలు ఆరంభంలోనే జస్టిస్ దత్తా ఆ ప్రకటనల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రకటనలు ఇవ్వడం ద్వారా రాహుల్ సమాజంలో సావర్కర్ మీద దురభిప్రాయం కలిగేటట్టు చేశారని కింది కోర్టు తన సమన్స్‌లో ఆరోపించింది.

ఇక్కడే జస్టిస్ దత్తా మంచి ప్రశ్న వేశారు. 'మహాత్మా గాంధీ కూడా వైస్రాయ్‌ని సంబోధించే టప్పుడు "యువర్ ఫెయిత్‌ఫుల్ సర్వెంట్" అనే అన్నారన్న సంగతి మీ క్లయింట్‌కు తెలుసా? అలాగే, మీ క్లయింట్ నాయనమ్మ ఇందిరాగాంధీ సావర్కర్‌ను గౌరవనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అంటూ

స్థాయిలో పశుపోషణకు రూ 140 కోట్లు, పశువుల ఆసుపత్రుల విస్తరణకు రూ. 123 కోట్లు వ్యయం చేస్తారు. 14.5 కోట్ల పశువులకు రాష్ట్రంలో వేక్సినేషన్ కార్యక్రమం కూడా పూర్తి చేశారు.

ముఖ్యమంత్రి అమృతధార పథకాన్ని ఆవుల పోషణ, సహజ సేద్యం కోసం ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద రూ.3 లక్షల నుంచి, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తారు. అయినా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో ఎవరికీ చెందని ఆవులతో సమస్యలు ఉంటున్నాయి. అందుకే వాటిని పట్టుకుని ప్రభుత్వ షెడ్డులకు తరలించే పని నిరంతరం జరుగుతూనే ఉంది. ఇందులో మరొక ఉద్దేశం కూడా ఉంది. ఈ ఆవులకు రక్షణ కల్పించడంతో పాటు, జాతీయ రహదారులపై వీటి కారణంగా ప్రమాదాలు జరగకుండా చూడాలన్నదే ఆ ఉద్దేశం.




# ఘన నివాళి అంటే ఇది!

**సి.** శంకరన్ నాయర్! భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేసిన ఏకైక మలయాళీ (ఇటీవలనే ఈ శీర్షికలో మా పాఠకులు ఆయన గురించి చదివి ఉంటారు). శంకరన్ 91వ వర్ధంతి సందర్భంగా ఏప్రిల్ 24న ఘన నివాళి సమర్పించారు. మంకారా పాలక్కాడ్ అనే చోట ఉన్న శంకరన్ స్మృతి మండపంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పీకే కృష్ణదాస్ నాయకత్వంలో కార్యకర్తలు ఆ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తరువాత వెల్లా రోడ్ కూడలిలో బహిరంగ సభ కూడా నిర్వహించారు. అలాగే పాలక్కాడ్ జిల్లా కాంగ్రెస్ శాఖ కూడా శంకరన్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. బీజేపీ ఉదయం 7.30కి పుష్పాంజలి ఘటిస్తే, కాంగ్రెస్ 8.30కి సమర్పించింది. బీజేపీ వారి బహిరంగ సభ 8.30కి జరిగితే, కాంగ్రెస్ వారి సభ 9.30కి జరిగింది. కాంగ్రెస్ సభలో ఎంపీ వీకే శ్రీధరన్ పాల్గొన్నారు. చరిత్రలో నిలిచిపోయిన జాతీయవాదులను గుర్తు చేసుకోవడం కోసం, వారు పాటించిన విలువలను స్మరించుకోవడానికి తాము ఈ కార్యక్రమం నిర్వహించినట్టు బీజేపీ నాయకులు చెప్పారు. నిజానికి మొదట శంకరన్ నాయర్ గురించి ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల హరియాణాలో జరిగిన ఒక సభలో గుర్తు చేయడంతో ఒక్కసారిగా జనం ఆయన చరిత్ర వైపు దృష్టి సారించారు. జలియన్‌వాలా బాగ్ దురంతానికి నిరసనగా వైస్రాయ్ కౌన్సిల్ సభ్యత్వానికి రాజీనామా చేసిన ధైర్యశాలి శంకరన్. వెంటనే కేంద్రమంత్రి, కేరళ ప్రముఖ బీజేపీ నేత సురేశ్ గోపి స్మృతి మంటపాన్ని సందర్శించారు. ఆయన వారసులతో మాట్లాడారు. బీజేపీకి స్వాతంత్ర్య సమరయోధులు ఎవరూ లేరు కాబట్టి శంకరన్‌ను తమ వారిని చేసుకుంటున్నదని కాంగ్రెస్ ప్రముఖుడు కె. మురళీధరన్ వ్యాఖ్యానించడం కాస్త నవ్వు పుట్టిస్తుంది. మోదీ గుర్తు చేస్తే తప్ప శంకరన్ నాయర్ గుర్తుకు రాలేదు వీళ్లకి. బీజేపీ జాతీయవాదులు ఎవరైనా గౌరవిస్తుంది. జాతీయవాదులంటే కాంగ్రెస్‌కు నచ్చదు. అందుకు తాజాగా మురళీధరన్ చేసిన వ్యాఖ్య నిదర్శనం. కొన్ని చీకటికోణాలు కూడా చూడాలి.కాంగ్రెస్ అధ్యక్ష పదవి తరువాత శంకరన్ బ్రిటిష్ వారితో రాజీ పడ్డారని అనిపిస్తుంది అన్నారు. గాంధీజీని వ్యతిరేకించినంత మాత్రాన శంకరన్ నాయర్‌ను బీజేపీ వారు తమ వాడిగా ఆయనను చెప్పుకోలేరని కూడా మురళీధరన్ గట్టిగా చాటే విఫలయత్నం చేశారు.

సంబోధించిన సంగతయినా తెలుసా?' అని రాహుల్ తరఫు న్యాయవాది సింఘ్వీని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. కాబట్టి ఆయనను (రాహుల్) స్వాతంత్ర్య సమరయోధుల గురించి బాధ్యతా రహితంగా మాట్లాడడం మానమని చెప్పండి అన్నారు జస్టిస్ దత్తా. ఇంకా చెప్పాలంటే చరిత్ర తెలుసుకుని మాట్లాడమనండి అని పాఠం చెప్పారు. 'మీరొక మంచి న్యాయ సూత్రం చెప్పారు. మాకు ఆ విషయం తెలుసు. కానీ స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించవలసిన తీరు ఇది కాదు. భారత దేశ చరిత్ర, భౌగోళిక అంశాలు ఎప్పుడు తెలుసుకుంటారు?' అని కూడా జస్టిస్ దత్తా నిలదీశారు. 'ఆయనకొక (రాహుల్) స్థాయి ఉంది. ఒక రాజకీయ పార్టీకి చెందిన రాజకీయవేత్త ఆయన. ఇలాంటి లేనిపోని సమస్యలు తెచ్చుకుంటారెందుకు? మీరు అకోలా వెళతారు. అక్కడ సావర్కర్ గురించి మాట్లాడతారు. ఎక్కడ సావర్కర్‌ను ఆరాధిస్తారో మీకు తెలియదా? ఇలా చేయడం సరికాదు. ఇలాంటి మాటలు ఎందుకు అంటున్నారు?' అని ప్రశ్నించారు జస్టిస్ దత్తా. బ్రిటిష్ ఇండియాలో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తులు కూడా ప్రధాన న్యాయమూర్తిని 'యువర్ సర్వెంట్' అనే సంబోధించే వారన్న సంగతిని కూడా జస్టిస్ దత్తా గుర్తు చేశారు. ఇదంతా ఇలాగే సాగితే మరొకసారి మరొకరు ఎవరో మహాత్మా గాంధీ బ్రిటిష్ వాళ్ల సర్వెంట్ అంటారు. మీరు ఇలాంటి ధోరణిని ఎగదోస్తున్నారు అంటూ జస్టిస్ దత్తా విమర్శించారు.

గత ఏడాది డిసెంబర్‌లో ఒక మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ సావర్కర్ బ్రిటిష్ సర్వెంట్ అంటూ వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. దీనితో నృపేంద్ర పాండే అనే న్యాయవాది రాహుల్ మీద ఫిర్యాదు చేశారు. ఆయన సమాజంలో విద్వేషాలు పెంచుతున్నారని ఆరోపించారు. కింది కోర్టు ఇచ్చిన సమన్స్‌పై స్టే ఇవ్వాలని మొదట రాహుల్ అలహాబాద్ హైకోర్టుకు వెళ్లారు. అక్కడ చుక్కెదురైంది. దీనితో సుప్రీంకోర్టుకు వచ్చారు.

భారత మాజీ ప్రధానులను రాహుల్ చులకన చేసి మాట్లాడిన విషయాన్ని కూడా అత్యున్నత న్యాయస్థానం ప్రస్తావిస్తే దేశం సంతోషించేది. ★



# నేషనల్ హెరాల్డ్.. నెహ్రూ.. పటేల్...

నిధుల సేకరణ కోసం నేషనల్ హెరాల్డ్ పత్రికను ఉపయోగించుకోవడంపై ప్రథమ హోంమంత్రి, ఉప ప్రధాని సర్దార్ వల్లభభాయ్ పటేల్ నెహ్రూను పలుసార్లు హెచ్చరించారు. ఆ నిధి సేకరణ బహుశా కాంగ్రెస్ పార్టీ అవసరాల కోసమై ఉండాలి. ఈ అంశం మీద ఆ ఇద్దరి మధ్య జరిగిన లేఖాయణం ఈ విషయం తెలియచేస్తున్నది. సర్దార్ పటేల్ ఉత్తర ప్రత్యుత్తరాలు సంకలనంలో ఈ ఉత్తరాలు ఉన్నాయి. ప్రశ్నార్థకంగా ఉండేవారి దగ్గర విరాళాలు తీసుకోవడం సరికాదని కూడా ఉక్కుమనిషి నెహ్రూకు నిర్ద్వంద్వంగా సూచించినట్టు ఇవి చెబుతున్నాయి. ఇటీవల ఈడీ నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో రాహుల్, సోనియాల పేర్లు చార్జిషీట్‌లో నమోదు చేయడంతో ఆ పత్రిక గురించి నెహ్రూ, పటేల్ మధ్య సాగిన ఉత్తరప్రత్యుత్తరాలు తాజాగా చర్చలోకి వచ్చాయి. నెహ్రూ స్థాపించిన నేషనల్ హెరాల్డ్ ఆస్తుల విషయంలో మనీ ల్యాండ్రింగ్ జరిగిందంటూ డాక్టర్ సుబ్రమణియం స్వామి వేసిన కేసు ప్రస్తుతం దేశంలో సంచలనంగా మారింది. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన లేఖలను బట్టి నెహ్రూ కాలంలోనే ఈ పత్రికకు అడ్డతోవలో నిధులు అందాయని అర్థమవుతుంది.


పత్రికను బతికించడం కోసం ప్రభుత్వ సాయం, అడ్డదారుల నుంచి నిధుల సేకరణ వంటి వాటికి పాల్పడవద్దని ఆ మహనీయుడు నెహ్రూను హెచ్చరించారు. కానీ యథాప్రకారం నెహ్రూ ఆయన హెచ్చరికను పట్టించుకోలేదు. మే 5,1950న పటేల్ చేసిన హెచ్చరికను ఒకసారి గమనించాలి. హిమాలయన్ ఎయిర్‌వేస్‌కు చెందిన వ్యక్తుల నుంచి రూ. 75,000 విరాళంగా స్వీకరించడాన్ని పటేల్ తప్పు పట్టారు. నిజానికి హిమాలయన్ ఎయిర్‌వేస్‌కు మంచి పేరు లేదు. ఈ సంస్థకు అనుమతులు ఇవ్వడానికి భారత వైమానిక దళం వ్యతిరేకించింది. అయినా వైమానిక దళం పెట్టిన అభ్యంతరాలు ఉండగానే ఆ సంస్థకు నెహ్రూ ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. ఒక దాత పేరు అఖాని. ఇతడు బ్యాంకులో అవకతవకలకు పాల్పడి విచారణను ఎదుర్కొంటున్నవాడు. లక్నోకు చెందిన నకిలీ వ్యాపారవేత్త జేపీ శ్రీవాస్తవ నుంచి నిధులు తీసుకున్నందుకు కేంద్ర మంత్రి అహ్మద్ కిద్వాయ్‌ని కూడా పటేల్ విమర్శించారు.పటేల్ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ లేఖ రాసిన రోజే, ఆ ఆరోపణలన్నీ అస్పష్టంగా ఉన్నాయని, పరిగణనలోనికి రావని నెహ్రూ అదే రోజు కొట్టి పారేశారు. పైగా ఇవేవీ పెద్ద విషయాలు కావన్నట్టు, నాడు నేషనల్ హెరాల్డ్ జనరల్ మేనేజర్ పదవిలో ఉన్న తన అల్లుడు ఫిరోజ్ గాంధీ మీద పెట్టారు నెహ్రూ.

# బీఎస్ఎఫ్ జవాన్ సాహు విడుదలపై ఆందోళన



పొరపాటున పాకిస్తాన్ సరిహద్దులలో ప్రవేశించిన మన సరిహద్దు భద్రతా దళం జవాన్ పూర్ణమ్‌సింగ్ సాహు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏప్రిల్ 24న సాహును పాకిస్తాన్ రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. కానీ ఏప్రిల్ 27వ తేదీకి కూడా అతడిని అప్పగించలేదు. మధ్య మూడు సార్లు ఫ్లాగ్ సమావేశాలు జరిగాయి. సాహు బెంగాల్‌కు చెందినవాడు. రైతులతో కలిసి పంజాబ్ సరిహద్దు కంచె వద్దకు వెళ్లిన సాహు పొరపాటున పాకిస్తాన్ సరిహద్దులలోకి వెళ్లారు. మొదట సాహును విడుదల చేయడానికి పాకిస్తాన్ అధికారులు నిరాకరించారు. తరువాత సాహు ఆచూకీ తెలియదని చెప్పారు. దీనితో సాహు తండ్రి, భార్య రజని తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు.

# ఒక్క గుజరాత్‌లోనే వేయి మంది బాంగ్లాదేశీలు




తాను తీసుకున్న గొయ్యిలో తానే పడడం అంటే ఇదే. భారత్‌లో ఇంతకాలం సుఖంగా కాలక్షేపం చేసిన పాకిస్తాన్, బాంగ్లాదేశ్ అక్రమ వలసదారులకు రోజులు మూడాయి. అన్ని రాష్ట్రాలలోను గడువు (ఏప్రిల్ 27)లోగా భారత్‌ను వీడాలని నోటీసులు జారీ అయ్యాయి. ఒక్క గుజరాత్‌లోనే వేయి మంది బాంగ్లాదేశీయులు నకిలీ పత్రాలతో నివాసం ఉంటున్నారని బయటపడింది. ఒక్క అహ్మదాబాద్‌లోనే 890 మంది బాంగ్లాదేశీయులను కనుగొన్నామని రాష్ట్ర హోంశాఖ సహా మంత్రి హర్ష్ సంఘ్వి ఏప్రిల్ 26న తెలియచేశారు. ఇలా అక్రమంగా గుజరాత్‌లో ప్రవేశించినవారు తమకు తామై పోలీసు స్టేషన్‌లలో లొంగిపోవాలని లేదంటే పట్టుకుని బలవంతంగా పొరుగుదేశానికి పంపక తప్పదని హెచ్చరించారు. ఇలాంటి వారికి ఆశ్రయం ఇచ్చిన వారిపై కూడా చర్యలు తప్పవని ప్రకటించారు. వీళ్ల చేతులలో ఉన్న నకిలీ పత్రాలన్నీ పశ్చిమ బెంగాల్ అధికారులు ఇచ్చినవే. పైగా గుజరాత్ చేరుకోవడానికి ముందు వీళ్లంతా దేశంలోని వివిధ రాష్ట్రాలలో గడిపి వచ్చారు. గుజరాత్‌లో ఇటీవల అరెస్టయిన ఇద్దరు బాంగ్లావాసులు అల్ కాయిదా స్లీపింగ్ సెల్స్ అని తేలింది.

# అయ్యప్ప సేవాసమాజ్ జాతీయ కార్యదర్శిగా బుచ్చిరెడ్డి



2025-2028 కాలానికి గాను శబరిమలై అయ్యప్ప సేవా సమాజ్ కొత్త జాతీయ కార్యవర్గాన్ని ఏప్రిల్ 25న ప్రకటించింది. కొచ్చిలోని భాస్కరీయం కన్వెన్షన్ సెంటర్‌లో సమాజ్ జాతీయ మండలి సమావేశాలు రెండు రోజుల పాటు జరిగాయి. దీనికి కేరళతో పాటు దేశం నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. అయ్యప్ప భక్తులకు సేవా కార్యక్రమాల గురించి చర్చించి, కొత్త జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికైన వారు: కుమ్మనమ్ రాజశేఖరన్ (తిరువనంతపురం, పోషకుడు), టీబీ శేఖర్ (తుముకూరు, కర్ణాటక, ధర్మకర్త, పోషకుడు), ఎస్‌జేఆర్ కుమార్ (కోచి, ధర్మకర్త, జాతీయ అధ్యక్షుడు), ఆర్. మురుగన్ సెల్వన్ (ముంబై, కార్యనిర్వాహక అధ్యక్షుడు), నాయని బుచ్చిరెడ్డి (హైదరాబాద్, ధర్మకర్త, ప్రధాన కార్యదర్శి), ప్రకాశ్ జి పాయ్ (ముంబై, ధర్మకర్త, కోశాధికారి). మొత్తం 25 మంది సభ్యులతో జాతీయ కార్యవర్గం ఏర్పడింది. శబరిమలై భక్తుల సేవలు, అన్నదానం, ధర్మసేవా కార్యక్రమాలను కార్యవర్గం పర్యవేక్షిస్తుంది. ప్రజాసంబంధాల కార్యదర్శి మను రాజన్ ఈ మేరకు పత్రికా ప్రకటనిచ్చారు.



అమినుల్

# 19 మంది పాకిస్తాన్ భక్తుల అరెస్ట్

పెహల్గావ్ వంటి పెద్ద దారుణం జరిగినా, ప్రపంచం మొత్తం ఇందుకు పాకిస్తాన్‌ను తప్పు పడుతున్నా భారతదేశంలో మాత్రం ఇప్పటికీ కొందరు ఆ పొరుగు దేశభక్తులు వీరంగం వేసే ప్రయత్నంలోనే ఉన్నారు. ఆ దారుణం తరువాత కూడా పాకిస్తాన్‌కు అనుకూలంగా, భారత్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టిన కనీసం 19 మంది ఈశాన్య భారత ప్రాంత వాసులను అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అరెస్టు చేశాయి. అస్సాం, మేఘాలయ, త్రిపురలలో ఈ అరెస్టులు జరిగాయి. ఇలా అరెస్టయిన వారిలో ఒక ఎమ్మెల్యే, ఒక జర్నలిస్టు, విద్యార్థులు, ఒక న్యాయవాది, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు ఉన్నారు. వీరందరినీ దేశద్రోహం ఆరోపణతో అరెస్టు చేశారు. అరెస్టయిన 19 మందిలో 14 మంది అస్సాం వారే. అస్సాంకు చెందిన 14 మందిలో ముగ్గురిని ఏప్రిల్ 26 తేదీ ఒక్కరోజే, హాజో, హలియా కండి, నావగావ్ (గౌహతి నగరం దగ్గర) వద్ద అరెస్టు చేశారు. పాకిస్తాన్‌ను ఎవరు సమర్థించినా తమ ప్రభుత్వం జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేసి తీరుతుందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ హెచ్చరించారు. పెహల్గావ్ దాడి తరువాత జరిగిన పాక్ అనుకూలుర అరెస్టులో మొదటిది ఏప్రిల్ 24న జరిగింది. అదే అఖిల భారత ఐక్య డెమాక్రటిక్ ఫ్రంట్ ఎమ్మెల్యే అమినుల్ ఇస్లాం అరెస్టు. 2019 నాటి పుల్వామా దుర్ఘటన, ఇటీవలి పెహల్గావ్ దాడి గాని ప్రభుత్వ కుట్రలేనని సామాజిక మాధ్యమాలలో ఇతడు పోస్టు పెట్టాడు. నవగావ్ జిల్లాకు చెందిన మైనారిటీ నాయకుడు మౌలానా ఖైరుల్ ఇస్లాం ముఫ్తి కొడుకు ఇతడు. డెమాక్రటిక్ రిఫార్మ్స్ కమిటీ ఇచ్చిన వివరాల ప్రకారం అమినుల్‌పై గతంలోను దేశద్రోహం కేసు నమోదైంది. మత విశ్వాసాలను రెచ్చగొట్టి వర్గాల మధ్య విద్వేషాలు రేపాడన్న ఆరోపణపై కూడా కేసులు ఉన్నాయి. గతంలో ఒకసారి శాసనసభ నిబంధనలను ఉల్లంఘించాడన్న ఆరోపణపై సభనుంచి బహిష్కరణకు కూడా గురయ్యాడు. కొవిడ్ 19 సమయంలో ఒక వర్గం రోగులు వివక్షకు గురి అవుతున్నారంటూ తప్పుడు సమాచారం సామాజిక మాధ్యమాలలో పెట్టి అప్పుడు కూడా అరెస్టయ్యాడు. మహ్మద్ ఏకే బహాయుద్దీన్, మహ్మద్‌జావెద్ మజుందార్ (సిల్చార్), మహ్మద్ జబీర్ హుసేన్ (హోలియాండి), మహ్మద్ మహహర్ మియా (మోరెగావ్), మహ్మద్ సాహిల్ అలీ (శివసాగర్) అరెస్టయ్యారు. మహ్మద్ ముస్తా అహ్మద్ (సాహెల్)ను కరీంగంజ్‌లో అరెస్టు చేశారు. ఇతడు పాకిస్తాన్ జిందాబాద్ అని పోస్టు పెట్టాడు.

# పాక్ జెండాను దగ్ధం చేసిన ముస్లింలు




పెహల్గావ్ దాడికి నిరసనగా ఉత్తరప్రదేశ్‌లోని పలుచోట్ల ఏప్రిల్ 25 శుక్రవారం ముస్లింలు ప్రదర్శనలు నిర్వహించారు. చేతికి నల్ల బ్యాడ్జీలు ధరించి వచ్చిన ముస్లింలు జుమా (శుక్రవారం ప్రార్థనలు) ముగిసిన తరువాత పాక్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆ దేశ జాతీయ జెండాను తగులబెట్టారు. పెహల్గావ్ దాడికి పాకిస్తాన్ కారణమని వారు ఆరోపించారు. ఉగ్రవాదం నిలిచిపోవాలని అన్ని మసీదులలోను ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. మృతుల ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. పాకిస్తాన్‌ను ఉగ్రవాదదేశంగా ప్రకటించాలని కోరారు. కానీ ఇజ్రాయెల్‌ను కూడా ఉగ్రవాదదేశంగా ప్రకటించాలని కోరడమే విశేషం. ★

## కథ

పాల ప్యాకెట్ తీసుకొని ఇంట్లోకి అడుగుపెడుతున్న రాంబాబుకు ఇంట్లో నుండి మాటలు బిగ్గరగా వినిపించసాగాయి. అతని భార్య సుగుణ, కొడుకు కేశవ ఇద్దరు గట్టిగా మాట్లాడుకుంటున్నారు. ఒక విధంగా చెప్పాలంటే చిన్నగా అరుచుకుంటున్నారు.

'స్కూలుకు టైం అయితాంది రా, జల్ది తయారుగా' అన్నది తల్లి సుగుణ.

'టైం అయితే ఏంది, నేను స్కూల్‌కి పోతలేను', అన్నాడు కొడుకు కేశవ్.

'స్కూలుకు..... పోవా'

'ఆ'... పోను'

'దిమాక్ గిట్ల ఖరాబ్ అయినాదిరా? నీ తోటోల్లంత బడికి పోయి చదువుకుంటా ఉంటే, నువ్వు ఇంట్లో కూర్చొని గాడిదలగాస్తావుర?

'మన ఇంట్ల గాడిదలు ఏడున్నయి, నాయనతోని పనికి పోత'.

'పనికి పోతవా, గదెం ఆలోచన రా? నీ మతికే పుట్టిందా, లేక ఇంకెవరన్న చెప్పిన్రా'?

'నాకు ఎవ్వరు చెప్పేది లేదు. నాకు స్కూలు చదువు నచ్చలే. నాయనతోని పోయి పని నేర్చుకుంట',

'పని నేర్చుకుందుకు ముందు ముందు బతుకు చాల ఉన్నది. ఇప్పుడు బడికి పోవాల్సిందే'. తల్లి ఖండితంగా చెప్పింది. కేశవ గట్టిగా అరిచాడు. 'నేను బోనని చెప్పిన కదా, సమజయిత లేదా? నాకు అస్సలు ఇష్టం లేదు'.

'నాకే ఎదురు చెప్తవ్, ఎదవ నా కొడకా. నువ్వు బడికి పోయి చదువు కోవాల్సిందే, లేకపోతే సంపి బొంద పెడత'.. కోపం వచ్చిన సుగుణ కొడుకును ఎడాపెడా కొట్టింది.

'అమ్మా.... కొట్టకే...' అరుస్తున్నాడు కేశవ.

'మరి పోతవా, బడికి పోతవా లేదా చెప్పు..'

'పోను, పోను. నాకా చదువులొద్దు'.

గుమ్మం దగ్గర నిలబడి చూస్తున్న రాంబాబుకు తాను కలగ చేసుకోవాల్సిన సమయం వచ్చిందని అర్థమైంది.

'ఆగాగు, సుగుణా, వాడిని వదిలెయ్యి .

సుగుణ తన దృష్టి రాంబాబు వైపు మళ్లించింది. 'ఏందయ్యా వదిలేది, వాడు బడికి పోయి చదువుకోడట. ఇన్నవా'?

'చదువు అనేది ఇష్టంగా చదువుకుంటేనే వస్తది. బలవంతంగా ఎక్కిస్తే రాదు. వాడు కూడ పెద్దవాడు అయితాండు కద. వాడే తెలుసుకుంటడు, మంచిదో చెడేదో'.

'చదువుకోకపోతే వాడు ఎట్ల బతుకుతడయ్యా'..అన్నది సుగుణ బాధగా.

'నేను తాపీ మేస్త్రి పని చేస్తాన కద. మనం బతుకుతున్నమా



లేదా ? కాలమే వాడికి ఏదో ఒక దారి చూపెడతది'.

సుగుణ రాంబాబుతో వాదనకు దిగలేదు. ఆమెది వాదించే మనస్తత్వం కూడా కాదు. ఒక్కగానొక్క కొడుకు. బాగా చదువుకొని ఉద్యోగం చేస్తడని అందరి తల్లులలాగే ఆశ పడ్డది. కాని, ఇంకా లాగితే పరిస్థితి చేజారిపోతుందని ఆమెకు తెలుసు. అందుకే ఆమె ఏమీ మాట్లాడలేదు.

# చేనేత మగ్గం

## ఎస్. నాగేందర్‌నాథ్ రావు



రాంబాబు తాత దుర్గయ్య చీరల నేతగాడు. అతడు నేసే చీరలకు చుట్టుపక్కల గ్రామాలలో కూడా మంచి పేరు ఉండేది. అతను ఎంత నిపుణుడైన మగ్గం నేతగాడైనా, కాలం అంటూ ఒకటి ఉంటుంది కదా! అది చేనేత కార్మికుల పాలిటి శాపంగా మారింది. నేత వస్త్రాలకు మార్కెట్ కరువై, చేనేత కార్మికులు ఆకలికి అల్లాడిపోయారు. ఆ దయనీయ పరిస్థితులలో దుర్గయ్య కూడా, నేత పని మానేసి, కూలి పనికి వెళ్లక తప్పలేదు. దుర్గయ్య కొడుకు అప్పయ్యకు బడికి పోయి చదువుకునే అవకాశం లభించలేదు. ఆ ఊర్లోనే, స్కూల్లో ఉన్నంతవరకు చదువుకున్నాడు. చుట్టుపక్కల ఊళ్లలో కూలిపనికి వెళ్లేవాడు. అలా పనికి వెళుతూ, వెళుతూ ఒక తాపీ మేస్త్రి దగ్గర కూలి పనికి కుదిరాడు. ఆ మేస్త్రి కూడా ఎక్కడ పని ఉన్నా అప్పయ్యను తీసుకెళ్లేవాడు. అప్పయ్య కూడా క్రమంగా తాపీ పనిలో మెళకువలు నేర్చుకొని, కూలి పని నుండి మేస్త్రి పనికి మారాడు.

అప్పయ్యకు తన కొడుకు రాంబాబును ఎలాగైనా చదివించాలని కోరికగా ఉండేది. రాంబాబుతో కూడా ఆ మాటే చెబుతూ ఉండేవాడు. 'ఎట్లాగైనా నువ్వు పెద్ద చదువులు చదివి గవర్నమెంట్ ఉద్యోగం సంపాదిస్తే, మన కష్టాలు తీరిపోతాయి రాంబాబు' అనేవాడు. కానీ ఒక ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో మేస్త్రిగా పనిచేస్తున్నప్పుడు, ఆ బ్రిడ్జి కూలిపోయింది. చాలామంది మేస్త్రీలు, కూలీలు దాని కింద నలిగిపోయారు. అప్పయ్య కూడా రెండు కాళ్లు విరిగిపోయి కదలలేని పరిస్థితి ఏర్పడింది. ఇల్లు గడవని పరిస్థితిలో రాంబాబు కూడా, తండ్రి నుండి వారసత్వంగా వచ్చిన తాపీ, తూకం చేతబట్టి మేస్త్రిగా మారాడు.

పట్టణాలలో ఇళ్ల నిర్మాణం పనులు ఊపందుకుంటున్న తరుణంలో, మేస్త్రి పని వెతుక్కుంటూ కుటుంబంతో సహా పట్నం చేరుకున్నాడు రాంబాబు. ఎలాగైనా తన కొడుకు కేశవను బాగా చదివించాలని అనుకున్నాడు. కానీ కేశవ మొదట్లోనే మొండికేస్తున్నాడు. కేశవ చాలా తెలివైనవాడు, బాగా చదువుతాడని, టీచర్లు కూడా మెచ్చుకుంటున్నారు. కానీ కేశవ ఆలోచనలలో ఈ మార్పు ఎందుకు వచ్చిందో, ఆ భార్యాభర్తలకు అర్థం కాలేదు. కానీ బలవంతంగా కేశవను స్కూలుకు పంపించి చదివించలేమని వాళ్లకు అర్థమైంది. కొద్ది రోజులు ఇలాగే వేచి చూద్దామని అనుకున్నారు. రోజులు గడుస్తున్నాయి.

తండ్రితో పాటు ఇల్లు నిర్మాణం పనికి వెళుతున్నాడు కేశవ. రోజు కూలిగా పనిచేయడం ప్రారంభించాడు. ఇటుకలు, ఇసుక మోయడం, మాలు కలపడం, అతనికి హుషారుగా అనిపించ సాగింది. ఇటుక మీద ఇటుక పేరుస్తూ తండ్రి గోడలు లేపి, ఇల్లు నిర్మిస్తుంటే అతనికి ఆశ్చర్యంగాను, ఆసక్తిగాను అనిపించసాగింది. తాను కూడా ఇలాగే మేస్త్రి పని నేర్చుకోవాలి అనుకున్నాడు.

'నాయనా, పని కూడా చదువే కదా'.

'అవున్రా, ప్రతి పనీ ఒక విద్య. ఏదైనా నేర్చుకోకపోతే రాదు కదా', అన్నాడు తండ్రి.

'నాకు ఈ మేస్త్రి పని నచ్చింది నాయినా, నేను ఇదే నేర్చుకుంట'.

ఏమి చెప్పాలో తోచలేదు రాంబాబుకు. 'గట్లనే, నీ ఇష్టం కొడక' అన్నాడు. ఇక కేశవ ఆనందానికి అంతు లేకుండా పోయింది. ఆ రోజు సాయంత్రం పని పూర్తి అయిన తర్వాత ఇంటికి వెళ్లేముందు షావుకారును కలిశారు.

'సావుకారూ, పని అయిపోయింది. లెక్క చూసి

కాలమే అన్ని నేర్పిస్తుందని రాంబాబు అన్నమాట నిజమైంది. మర్నాడు పొద్దుట వంటపనిలో హడావిడిగా ఉంది సుగుణ. కేశవ స్నానం చేసి స్కూల్ డ్రెస్ వేసుకొని, స్కూల్ బ్యాగు సర్దుకుంటూ, 'అమ్మా, అన్నం పెట్టు. బడికి టైం అయితాంది' అన్నాడు. సుగుణ చేతిలోని గంటె జారి కిందపడి టంగుమని శబ్దం అయింది. ఆమె అవాక్కయి అలాగే చూడసాగింది.



డబ్బులు ఇయ్యండి', అడిగాడు రాంబాబు.

'గట్లనే మేస్త్రి, కూచో' అన్నాడు షావుకారు. అరుగు మీద కూర్చున్నారు తండ్రి కొడుకులు.

షావుకారు లెక్కచేసి మొత్తం '100 ఫీట్ లు వచ్చింది మేస్త్రి' అన్నాడు.

రాంబాబు కాస్త ఆలోచించి, 'ఇంక ఎక్కువ వస్తయనుకుంట సావుకారూ, మల్ల ఒకసారి లెక్క చేయండి', అన్నాడు నెమ్మదిగా.

షావుకారు మళ్లీ ఒకసారి లెక్క చేసాడు. 'గంతే ఒస్తున్నది మేస్త్రి' అన్నాడు.

నా లెక్క కొంచెం తేడా ఉన్నది కదా సావుకారూ'.

షావుకారుకు కొంచెం కోపం వచ్చింది. 'చదువుకున్నోన్ని నేను, తాపీ పని చేసుకునేటోనివి నువ్వు. లెక్కలు చేయడం నీకు తెలుసా, నాకు తెలుసా ?' కొంచెం అరిచినట్లుగా అన్నాడు షావుకారు.

ఈ సంభాషణ ఆసక్తిగా చూడసాగాడు కేశవ.

'అయ్యో, కోపం చేయకు సావుకారూ, చదువుకున్నోళ్లు మీకు తెల్వదని కాదు గాని, మల్లొక్కసారి

'సరే, లెక్క నువ్వే చేయి మేస్త్రి' అన్నాడు షావుకారు.

రాంబాబు ఓపికగా తాను వారం రోజులుగా చేస్తున్న పని ఒకదాని తర్వాత ఒకటి వివరంగా రాయించాడు. షావుకారు మొత్తం రాసి లెక్క చేశాడు.

'నిజమే మేస్త్రి, నీ లెక్క ప్రకారం 130 ఫీట్లు వచ్చింది. నువ్వు చెప్పింది కరెక్టే'. మేస్త్రి చెప్పిన ప్రకారం లెక్క చేసి డబ్బులు ఇచ్చాడు షావుకారు. ఇంటికి బయలుదేరారు తండ్రి కొడుకులు.

నాయినా'.

దారిలో అడిగాడు కేశవ. 'సావుకారు తప్పు లెక్క చెప్పి, మనల్ని మోసం చేయాలనుకున్నడు కదా

'అట్లా ఆలోచించడం తప్పు. అది మోసం అని ఎందుకు అనుకోవాలి. ఆయన లెక్కలో తప్పు వచ్చింది. మనకు లెక్క సరిగా చేయడం వస్తే మనం మోసపోము కదా. కష్టపడేవాళ్లం...మన జాగ్రత్తలో మనం ఉండాలి కదా' అన్నాడు రాంబాబు. నిజమే అనుకున్నాడు కేశవ.

కాలమే అన్ని నేర్పిస్తుందని రాంబాబు అన్నమాట నిజమైంది. మర్నాడు పొద్దుట వంటపనిలో హడావిడిగా ఉంది సుగుణ. కేశవ స్నానం చేసి స్కూల్ డ్రెస్ వేసుకొని, స్కూల్ బ్యాగు సర్దుకుంటూ, 'అమ్మా, అన్నం పెట్టు. బడికి టైం అయితాంది' అన్నాడు.

సుగుణ చేతిలోని గంటె జారి కిందపడి టంగుమని శబ్దం అయింది. ఆమె అవాక్కయి అలాగే చూడసాగింది.

బల్లమీద కూర్చున్న రాంబాబు ఇద్దరినీ చూడసాగాడు. అతడి మొహంలో ఏ భావమూ కనిపించడం లేదు.

ఆశ్చర్యంగా అడిగింది తల్లి. 'ఏరా కేశవా, బడికి పోతానవా? పనికి పోతలేదా?"

'అవునమ్మా బడికి పోత'. తల్లి దగ్గరికి వచ్చాడు కేశవ. సుగుణ అతని తల నిమిరింది. 'ఏం జరిగింది కొడకా' అని అడిగింది. నిన్న పని దగ్గర జరిగిన షావుకారు లెక్కల సంగతి తల్లికి వివరించాడు కేశవ.


'నాయినకు లెక్కచేయడం రాకపోతే చాలా పైసలు నష్టం వచ్చేది. చేసిన కష్టమంత దండగ అయ్యేది. కష్టం చేయడమే కాదు, దాని విలువను కూడా తెలుసుకోవాలి కద. ఆ పని, చదువు చేస్తదని నాకు అర్థమైందమ్మా. గందుకే ముందుగాల బడికి పోయి చదువు నేర్చుకుంట. ఆనిక్కే పని నేర్చుకుంట'. కొడుకు ఆలోచనలో మార్పుకు ఆశ్చర్యపోయింది ఆమె. కొడుకును దగ్గరికి తీసుకొని ముద్దు పెట్టుకున్నది. బ్యాగు తీసుకుని స్కూల్‌కు బయలుదేరాడు కేశవ.

సుగుణ రాంబాబు వద్దకు నడిచింది. అతని భుజంపై చేయి వేసింది. రాంబాబు సుగుణ కళ్లలోకి చూశాడు.

'మనం ఏం చేయాలో, కాలమే నిర్ణయిస్తుంది సుగుణా. నేను పెద్ద చదువులు చదివి ఉద్యోగం చేయాలని, మా నాయన బాగ చెప్పేటోడు. కానీ కాలం ఆయన్ని కదలకుండ కట్టిపడేసింది. నాలుగు రోజుల కిందట, కేశవ, మేస్త్రి పని చేస్తా అన్నప్పుడు కాలం ఏం నిర్ణయిస్తదో అని గుబులు పడ్డ. కానీ వాడిని చదువు వైపుకి నడిపించింది. కేశవ తప్పకుండా సాధిస్తడని నాకు నమ్మకం కలుగుతున్నది. మన కుటుంబానికి మంచి రోజులు తప్పకుండ వస్తయి. ఒక సాలె మగ్గం నేతగాడి మనవడు, మరో అబ్దుల్ కలాం అయినా ఆశ్చర్యం లేదు'. భుజం మీది కండువాతో కళ్లుతుడుచుకున్నాడు రాంబాబు.

దూరంగా గుడిలో గంటలు మోగుతున్నాయి శుభసూచకంగా.

**'కార్టూన్ పోటీ-2025'లో ప్రోత్సాహక బహుమతి పొందినది**




వచ్చేవారం కథ..

**పుత్తూరు కట్టు**

– ఆర్.సి. కృష్ణస్వామిరాజు



భారత క్రికెట్ నయా కుబేరుడు విరాట్ కోహ్లీ లండన్‌లో స్థిర నివాసమేర్పరుచుకోవాలని నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. తన పిల్లల్ని అతిసామాన్యులుగా పెంచడం కోసమే ఇంగ్లండ్‌కు వెళ్లుతున్నట్లు చెప్పడం పట్ల విమర్శకులు మండిపడుతున్నారు. దేశంలోని కోట్లాది మంది యువతకు ఆరాధ్యదైవమైన ఆయన ఇంగ్లండ్‌కు వలసపోవాలనుకోవడం ద్వారా ఇచ్చే సందేశం ఏమిటి అని నిలదీస్తున్న వారూ ఉన్నారు.



# సంపాదనకు భారత్.. స్థిరపడేందుకు లండన్..!

సినీ, క్రీడారంగాలు ఏవైనా మన దేశంలో వెర్రి, పిచ్చిఅభిమానులకు లోటేలేదు. సినీస్టార్లను, క్రికెట్ స్టార్లను కోట్లకు పడగలెత్తేలా చేయటంలో కోట్లాది మంది అభిమానుల తర్వాతే ఎవరైనా. భారత క్రికెట్ దేవుడు సచిన్ టెండుల్కర్ తరువాత అదే స్థాయిలో అభిమానులను సంపాదించుకొన్న విరాట్ కోహ్లీ.. ఆ అభిమానాన్ని కోట్ల రూపాయలుగా మలుచుకోడంలో పూర్తిగా సఫలమయ్యాడు. ఓ సామాన్య కుటుంబంలో పుట్టి, అసామాన్య క్రికెటర్‌గా ఎదిగి వెయ్యికోట్ల రూపాయలకు పైగా స్థిర,చరాస్తులు కూడబెట్టిన 36 సంవత్సరాల విరాట్ తన క్రికెట్ జీవితం ముగింపుదశకు చేరుకొన్నాడు. బాలీవుడ్ హీరోయిన్ అనుష్కశర్మను 2017లో జీవిత భాగస్వామిగా చేసుకొన్న విరాట్ ఇప్పుడు ఇద్దరు పిల్లల తండ్రిగా మారాడు. కుమార్తె విరుష్క, కుమారుడు అకాయ్‌లను నిరాడంబరంగా, అత్యంత సామాన్యంగా భారత్‌లో పెంచాలంటే సాధ్యపడే విషయం కాదని, లండన్‌లో మాత్రమే అది సాధ్యపడుతుందని విరాట్ జోడీ చెబుతున్నారు. క్రికెట్లో విరాట్ తొలిగురువు రాజ్‌కుమార్ శర్మ సైతం ఇదే విషయాన్ని అనధికారికంగా బయటపెట్టాడు. విరాట్ కోహ్లీ కుటుంబం లండన్‌కు వలసపోనున్నట్లు తెలిపారు. విరాట్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించకున్నా తన కుటుంబాన్ని లండన్‌కు తరలిం చడం ఖాయమని తేలిపోడంతో పలువురు పలు రకాలుగా తమ అభిప్రాయాలను, అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సచిన్ టెండుల్కర్, మహేంద్రసింగ్ ధోనీ లాంటి దిగ్గజ క్రికెటర్లు తమ పిల్లల్ని భారత గడ్డపైనే పెంచుతూ తమ రిటైర్మెంట్ జీవితాన్ని ఆస్వాదిస్తుంటే.. విరాట్ కోహ్లీ మాత్రం తన పిల్లల్ని అతిసామాన్యంగా పెంచడం కోసం లండన్‌లో స్థిరనివాసమేర్పరచుకోవాలనుకోడాన్ని మించిన విడ్డూరం మరొకటి లేదని విశ్లేషకులు, విమర్శకులు అంటున్నారు. ఈ దేశం నుంచి ఎంతో పొందిన విరాట్ కోహ్లీ కుటుంబం దేశానికి ఏమీ తిరిగి ఇవ్వకుండానే వందలకోట్ల రూపాయల ఆస్తులతో దశలవారీగా ఇంగ్లండ్‌కు తరలిపోవాలి అనుకోడం శోచనీయమని, దేశభక్తి ఉన్నవారు ఎవ్వరూ ఇలా చేయరంటూ మండిపడుతున్నారు.




**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969


### పిల్లల పెంపకం కోసమే లండన్‌కు....

భారత్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి.. తన అసాధారణ ఆటతీరుతో కోట్లాదిమంది అభిమానులను మాత్రమే కాదు.. వందల కోట్ల రూపాయలు కూడబెట్టిన కోహ్లీ ఇప్పటికే లండన్‌లో అత్యంతవిలువైన ఆస్తులు సమకూర్చుకొన్నాడు. పైగా..తన పిల్లల్ని అత్యంత సామాన్యంగా పెంచడం కోసం విలాసాల నగరం లండన్‌లో స్థిరనివాసం ఏర్పరచుకోడానికి రంగం సిద్ధం చేసుకొన్నాడు. ఈ విషయాన్ని తన గురుపు, భార్యతోపాటు అత్యంత సన్నిహితుల ద్వారా బయటపెడుతూ లేనిపోని సమస్యలు కొని తెచ్చుకొంటున్నాడు.

### విరాట్ ఆస్తుల విలువ 1050 కోట్లు....

అసాధారణ ప్రతిభాపాటవాలు, అకుంఠిత దీక్ష, అంకిత భావంతో ప్రపంచ మేటి క్రికెటర్ గా ఎదిగిన విరాట్ కోహ్లీ గత 15 సంవత్సరాలుగా భారత జూనియర్, సీనియర్ క్రికెట్ కు అందించిన సేవలు అసమానం. అయితే..తన ఆటతీరు, రికార్డులతో కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకోడంతో పాటు.. ఇప్పటికే 1050 కోట్ల రూపాయల సంపద కూడబెట్టడం ద్వారా ఆసియాలోనే అత్యంత ధనవంతుడైన క్రికెటర్‌గా విరాట్ రికార్డుల్లో చేరాడు.

భారత క్రికెట్ బోర్డు వార్షిక కాంట్రాక్టు ద్వారా ఏడాదికి 7 కోట్ల రూపాయల గ్యారెంటీ మనీ అందుకొంటున్న విరాట్.. రెండుమాసాల ఐపీఎల్ ద్వారా 15 కోట్ల రూపాయలకు పైగా ఆర్జిస్తున్నాడు. ఇక..భారతజట్టు తరపున ఆడిన ఒక్కో టెస్టుమ్యాచ్ కు 15 లక్షల రూపాయలు, వన్డే మ్యాచ్‌కు 6 లక్షలు, టీ-20 మ్యాచ్‌కు 3 లక్షల రూపాయలు మ్యాచ్ ఫీజులుగా పొందుతున్నాడు. దీనికితోడు బహుళజాతి కంపెనీల ప్రచారకర్తగా ఒక్కో ఎండార్స్‌మెంట్‌కు 7 కోట్ల 50 లక్షల రూపాయల నుంచి 10 కోట్ల రూపాయల వరకూ తీసుకొంటున్నాడు. ముంబై మహానగరంలో 34 కోట్ల రూపాయలు, గురుగ్రామ్ లో 80 కోట్ల రూపాయలు విలువైన అపార్ట్‌మెంట్లు, భవంతులు, రెస్టారెంట్లు ఉన్నాయి. లండన్ నగరంలో సైతం వందలకోట్ల రూపాయల విలువైన విల్లాలు, ఆస్తులు ఉన్నాయి.

### ఇన్ స్టా గ్రామ్ పోస్ట్ కు 5 కోట్లు...

సోషల్ మీడియా వేదికల ద్వారా విరాట్ ఆర్జించే సంపాదన అంతాఇంతాకాదు. ఇన్‌స్టాగ్రామ్‌లోనే విరాట్‌ను అనుసరించేవారు 20 కోట్ల వరకూ ఉన్నారు. ఇన్‌స్టాలో ఉంచిన ఒక్కో పోస్టుకు విరాట్ 5 కోట్ల రూపాయల చొప్పున చార్జి చేస్తున్నాడు. ఫేస్ బుక్ ద్వారా 3 కోట్ల 60 లక్షల లైక్‌లు సాధించిన విరాట్‌ను ట్విట్టర్ (ఎక్స్) ద్వారా అనుసరించేవారు 5 కోట్లమంది వరకూ ఉన్నారు. అంతేకాదు.. ఫోర్బ్స్ తాజా ర్యాంకింగ్స్ ప్రకారం అత్యధిక సంపాదన ఉన్న... ప్రపంచ క్రీడాప్రముఖుల్లో విరాట్ కోహ్లీ మొదటి 10 మందిలో ఒకనిగా నిలిచాడు.

### బ్యాటు స్టిక్కర్‌కు నెలకు కోటి రూపాయలు..

తన క్రికెట్ బ్యాట్ లకు ఎమ్మారెఫ్ లాంటి కంపెనీ స్టిక్కర్లు అంటించినందుకు విరాట్ సగటున నెలకు కోటి రూపాయల చొప్పున వసూలు చేస్తున్నాడు. సంపాదనలో దేశంలోని కోట్లాది మంది యువతకు ఆరాధ్య దైవమైన విరాట్ ఇంగ్లండ్‌కు వలసపోయి ఏమి సందేశమిస్తున్నాడని నిలదీస్తున్నారు అనేకులు. ★

# 'వీర మాతల చరిత్రను పిల్లలకు చెప్పాలి'

**తిరుపతి:** వీరమాతల చరిత్రను పిల్లలకు చెప్పాలని ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ కార్యకారిణి సభ్యులు దువ్వూరు యుగంధర్ తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.

తిరుపతిలోని కేశవ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమాతా బాలికల ఆవాసం మూడవ వార్షికోత్సవం ఏప్రిల్ 25న జరిగింది.

కార్యక్రమానికి నాందిగా సభికులు పహల్‌గావ్ తీవ్రవాదుల దాడిలో మరణించిన హిందువులకు, ఇటీవల దివంగతులైన ఇస్రో పూర్వ చైర్మన్ డాక్టర్







కస్తూరి రంగన్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

వార్షికోత్సవానికి ముఖ్యఅతిథి డాక్టర్ టిఎమ్ నగేష్ మాట్లాడుతూ "నేటి సమాజంలో తమ స్వార్థం కోసం పనిచేస్తున్న మనుషులు చూశాం. కానీ ఇతరుల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న కేశవ సేవా సమితి సభ్యులకు శుభాభినందనలు" అని అన్నారు.

విశిష్ట అతిథి డాక్టర్ సి హరిత మాట్లాడుతూ "ఆవాసం సేవా కార్యక్రమం ఎంతో అభినందనీయమైంది. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనాలి" అని విజ్ఞప్తి చేశారు.

ముఖ్యవక్త ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ కార్యకారిణి సభ్యులు దువ్వూరు యుగంధర్ ప్రసంగిస్తూ "హిందూసమాజానికి, ధర్మానికి ఆధారభూతమైన దేవాలయాల వ్యవస్థను విదేశీ దురాక్రమణదారులు ధ్వంసం చేసిన సమయంలో లోకమాతగా రాణి అహల్యాబాయి దేశంలోని సుమారుగా 56 దేవాలయాలను పునర్నిర్మించి వాటి ఆలనా పాలనా చూసుకునే విధంగా పరిపాలన చేసింది. వీరమాత రాణి అబ్బక్క, కిత్తూరు చెన్నమ్మ, బెలవాడి మల్లమ్మ, కేలడి చెన్నమ్మ వంటి తల్లుల వీరోచిత చరిత్రను మన ఇంట్లో పిల్లలకు చెప్పాలి" అని అన్నారు.

ఇదే స్ఫూర్తితో శ్రీమాతాబాలికల ఆవాసం కేవలం పిల్లలకు విద్య మాత్రమే కాకుండా వారిలో సంస్కృతి సంప్రదాయాలను, జాతీయ భావాలను స్వావలంబనను, దేశభక్తిని పెంపొందించే విధంగా పనిచేయడం చాలా సంతోషకరమని చెప్పారు. అనంతరం అహల్యాబాయి త్రిశతాబ్ది జయంతోత్సవాలను పురస్కరించుకొని శ్రీమాతా బాలికల ఆవాసం పిల్లలు ప్రదర్శించిన నృత్య రూపకం, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

డాక్టర్ మార్తా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆవాసం, కేశవ సేవాసమితి సభ్యులు, డోనర్స్, మహేశ్వర్(విభాగ్ ప్రచార ప్రముఖ్), మార్గాన్ని సోమశేఖర్(కేశవ సేవాసమితి కార్యదర్శి), కెవి వెంకటాచలం, సునీల ( ఆవాసం కమిటీ సభ్యులు) తదితరులు పాల్గొన్నారు.

ఈ సంవత్సరం ఆవాసంలో 4, 5, 6 తరగతుల ప్రవేశం కొరకు తల్లి కానీ తండ్రి కానీ లేని బాలికలను, తల్లీ తండ్రీ లేకుండా సంరక్షకుల ఆలన, పాలనలో ఉన్న బాలికల్లో గరిష్టంగా 15 మందికి ప్రవేశం కల్పించడానికి

**సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు:**
**9652200 820 / 9393620042**

---

# పాలమూరు సేవాప్రముఖ్ దొడ్ల జనార్దన్ కన్నుమూత



**పా**లమూరు నగర సేవాప్రముఖ్ దొడ్ల జనార్దన్ (50) ఏప్రిల్ 22న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వృత్తిపరంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయన సోదరులు స్వయం సేవకులు. జనార్దన్ పాలమూర్‌లో సంఘ కార్యక్రమం ఏది జరిగినా ముందు వరసలో నిలబడి కార్యకర్తలందర్నీ ప్రోత్సహిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అలుపెరగకుండా పనిచేసేవారు. ఆయన జిల్లా జాగృతి ప్రముఖ్ కూడా. గత 6 సంవత్సరాలుగా పాలమూరు జిల్లాకు జాగృతి ప్రముఖ్‌గా ఎంతో తపనతో బాధ్యత నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 19న జాగృతి కార్యాలయానికి ఫోన్‌చేసి మే నెలలో జిల్లాలోని అన్ని ఖండ కేంద్రాలకు వెళ్లి జాగృతి సభ్యత్వం చేయించాలని, అందుకోసం జాగృతి రసీద్ పుస్తకాలు వెంటనే పంపమని అడిగారు. ఆ పుస్తకాలు చేరేలోగా ఆయన తుదిశ్వాస విడిచారు. వారికి 'జాగృతి' శ్రద్ధాంజలి.

## వార్తలు పంపేవారికి మనవి

**జాగృతిలో ప్రచురణ కొరకు వార్తలను పంపేవారు ఈ క్రింది సూచనలు గమనించగలరు**

★ వార్తను సంక్షిప్తంగా, అన్ని వివరాలతో, చక్కని తెలుగులో, వీలైతే డిటిపి చేసి పంపండి.
★ కార్యక్రమం గురించిన ఫోటో తప్పకుండా పంపాలి. వేదిక ఫోటోతో పాటు పాల్గొన్న ప్రజల ఫోటో కూడా పంపాలి.
★ కార్యక్రమం జరిగిన తేదీ ప్రదేశం పేరు, గ్రామం, మండలం, జిల్లా పేర్లను తప్పకుండా తెలపాలి.
★ వార్తను పంపినవారి పేరు, ఫోన్ నెంబరు తప్పక తెలియచేయాలి.
★ వార్తను **jagritiweekly@gmail.com** కు మాత్రమే పంపాలి.

**– సంపాదకుడు**




# వక్ఫ్ సవరణ చట్టంతో పేద ముస్లింలు, మహిళలకు మేలు

**విజయవాడ:** వక్ఫ్ సవరణ చట్టంతో పేద ముస్లింలు, మహిళలకు మేలు జరుగుతుందని రాకా సుధాకర్‌రావు అన్నారు. సమాలోచన-విజయవాడ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టం 2025 పైన 27 ఏప్రిల్‌న అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆచార్య కల్లూరి రామచంద్ర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాకా సుధాకర్ రావు పాల్గొని ఉపన్యాసించారు. వక్ఫ్ చారిత్రక నేపథ్యం, ముస్లిం లీగ్ స్థాపన, మింటో మోర్లె అంశాలు, కమ్యూనల్ అవార్డు తదితర విషయాలు కూలంకషంగా వివరించారు. 1947 తర్వాత జరిగిన ఎన్నో అంశాలు, వివిధ విద్యాలయాల ప్రభావం, 2025 వక్ఫ్ సవరణకు ముందు ఏవిధంగా పొందుపరచబడ్డాయో సోదాహరణంగా తెలియజేసారు. ఈ చట్టం వల్ల ముస్లిం మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని, మహిళలకు వారసత్వ హక్కుల విషయంలో ఇది బహువిధాలుగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ముస్లింలలో గల వివిధ ఉపకులాలకు, వారి పద్ధతులకు అనుగుణంగా భారీ లాభం చేకూరుస్తుందని ఆవిష్కరించారు. వక్ఫ్ బోర్డులలో ఇతర మతస్తుల ప్రమేయం పాలనా పరమైన అంశాలకే పరిమితిమై ఉంటుందని, ముస్లిం ధర్మ విషయాలలో ఉండదని స్పష్టం చేశారు. వక్ఫ్ రీత్యా ముస్లిం



ఆర్థిక అంశాలు స్పృశిస్తూ, భారతదేశం సంపద ఏవిధంగా ఇతర దేశాలకు తరలిపోయిందో, మదీనా తదితర ఉదాహరణలను ముఖ్య అతిథి ప్రస్తావించారు. చట్టంలో సెక్షన్ 40లో ముస్లిం మత విశ్వాసానికి సంబంధించి 5 సంవత్సరాల నిబంధన గురించి ఆయన వివరణాత్మకంగా తెలియచేసారు. సదస్సుకు ఆత్మీయ అతిథిగా విభాగ్ సంఘచాలక్ కోనేరు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# 94 మందితో విద్యార్థి వికాస వర్గ విజయవంతం




**సికింద్రాబాద్:** తెలంగాణ సేవాభారతి ఆధ్వర్యంలో నడుస్తున్న 11 ఆవాసాల లోని 8, 9 తరగతుల బాలురకు ఏప్రిల్ 19 నుండి 26 వరకు "విద్యార్థి వికాస వర్గ" సికింద్రాబాద్‌లోని వాత్సల్యసింధు ఆవాసంలో జరిగింది. 94మంది బాలురు పాల్గొన్న ఈ వర్గలో బౌద్ధిక్, చర్చ అంశాలు, స్పోకెన్ ఇంగ్లీష్, వేదగణితం, చేతి వ్రాత, చెస్, చిత్ర లేఖనం, మోటివేషన్ తరగతులతోపాటు గ్రామీణ వాయిద్యాలైన డప్పు, డోలకు, చిరుతలు, కోలాటం, కంజర, తాళ్లలు, అభినయ గేయాలు, భజన మొదలైన కళలను నేర్పించారు.

ఈ వర్గలో క్షేత్ర సేవాప్రముఖ్ ఎక్కాచంద్రశేఖర్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, ప్రాంత సేవాప్రముఖ్ శివశంకర్, సేవాభారతి సంఘటన కార్యదర్శి వాసు, ప్రాంత కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆవాసం ప్రముఖులు పాల్గొన్నారు. ★




## భక్తాగ్రేసరులు

# అన్నమాచార్య



తాళ్లపాక అన్నమాచార్యుడు తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని సంకీర్తనలో అర్చించిన పరమ భాగవతోత్తముడు. తిరుమలేశుని అనుగ్రహంతో నేటి ఉమ్మడి కడప జిల్లా తాళ్లపాక గ్రామంలో నారాయణసూరి, లక్కమాంబ దంపతులకు జన్మించాడు. అయిదేళ్ల ప్రాయంలోనే ఏకసంథాగ్రాహి. ఆటపాటలతో ఊరివాళ్ల తలలో నాలికయ్యాడు. అయితే పనిపాటా లేక కాలక్షేపం చేస్తున్నాడని తండ్రి నుంచి నిరసన ఎదుర్కొన్నాడు. ఒకనాడు కొడవలి చేతబట్టి అడవికి వెళ్లిన ఆయన తిరుమల వెళుతున్న భక్త బృందాన్ని అనుసరించి శ్రీనివాసుని దర్శించాడు. ఆయన గొంతు నుంచి సంకీర్తనలు వెలువడ్డాయి. అక్కడే ఘనవిష్ణువు అనే వైష్ణవయతితో పంచసంస్కారాలు పొందాడు. వివాహానంతరం తన పుట్టినరోజున తిరుమల సందర్శించిన ఆయనతో 'సంకీర్తన యజ్ఞం నిర్వహించు. రోజుకొక కీర్తనైనా అర్పించు' అని దేవదేవుడి ఆజ్ఞ అయ్యింది. దాంతో అన్నమాచార్య తన జీవితాన్ని వేంకటేశ్వరుని సంకీర్తనకు అంకితం చేసి పదకవితా పితామహుడిగా చిరస్మరణీయుడయ్యాడు.

## కథ | కప్ప - ముత్యం

అనగనగా ఒక అడవిలో ఓ కప్ప హాయిగా జీవిస్తోంది. ఒక హంస దానికి పరిచయమైంది. అవి కొద్దిరోజుల్లోనే ప్రాణమిత్రులయ్యాయి.

ఓరోజు కప్ప కొలనులో తామరాకుపైన తేలుతూ, హంస ఒడ్డున నిలబడి మాట్లాడుకుంటున్నాయి. ఈలోగా ఎట్నుంచి వచ్చాడో ఓ వేటగాడు హంస మీదకు హఠాత్తుగా వల విసిరాడు. వలకు చిక్కిన హంస విలవిల్లాడింది. అది చూసి కప్పకు ఏం చేయాలో తోచలేదు.

"వేటగాడా.. దయచేసి తనను విడిచిపెట్టు' అని కప్ప ప్రాధేయపడింది.

'దీన్ని అమ్మితే బోలెడు డబ్బొస్తుంది, విడిచిపెట్టను' అన్నాడు వేటగాడు.

'నీకు డబ్బు కావాలి, అంతే కదా! ఉండు' అని కప్ప వెంటనే నీట మునిగి కొంతసేపాగి ముత్యంతో పైకొచ్చింది.

'దీన్ని తీసుకుని నా స్నేహితురాలిని విడిచిపెట్టు' అని కప్ప కోరింది.

వేటగాడు ముత్యం తీసుకుని హంసను వదిలిపెట్టాడు.

ఇంటికెళ్లాక అతను చెప్పినదంతా విన్న భార్య.. 'ఆ కప్ప దగ్గర ఇంకొన్ని ముత్యాలు ఉండి ఉంటాయి. వెళ్లి అవన్నీ తెచ్చెయ్' అని చెప్పింది.

దాంతో దురాశ కలిగిన వేటగాడు కప్ప



## పద్యము

**చిప్పబడ్డ స్వాతి చినుకు ముత్యంబాయె**
**నీటబడ్డ చినుకు నీటగలిసె**
**బ్రాప్తిగల్గు చోట ఫలమేల తప్పురా**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**భావం :** స్వాతి కార్తెలో చినుకు ముత్తెపు చిప్పలో పడితే ముత్యమవుతుంది. నీటిలో పడితే నీటిలోనే కలిసిపోతుంది. ప్రాప్తం ఉంటే వద్దన్నా ఫలితం దక్కుతుంది.

## శ్లోకము

**అష్టాదశ పురాణేషు**
**వ్యాసస్య వచనం ధ్రువమ్**
**పరోపకారః పుణ్యాయ**
**పాపాయ పరపీడనమ్**

**భావం :** వేదవ్యాసుడు పద్దెనిమిది పురాణాలను రాసినప్పటికీ వాటన్నిటి సారాంశాన్ని ఒక వాక్యంలో చెప్పవచ్చు. 'పరులకు మేలు చేయడమే పుణ్యం.. పీడించడమే పాపం'

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| అశోకుడు | ఆసియా జ్యోతి |
| విశ్వనాథ సత్యనారాయణ | శాస్త్రిజీ |
| గౌతమబుద్ధుడు | కవిసమ్రాట్ |
| లాల్ బహదూర్ శాస్త్రి | బాబూజీ |
| బాబూ జగ్జీవన్ రామ్ | ప్రియదర్శి |

**సమాధానాలు :** అశోకుడు–ప్రియదర్శి; విశ్వనాథ సత్యనారాయణ–కవిసమ్రాట్; గౌతమబుద్ధుడు–ఆసియా జ్యోతి; లాల్ బహదూర్ శాస్త్రి–శాస్త్రిజీ; బాబూ జగ్జీవన్ రామ్–బాబూజీ;.

## శాస్త్రవేత్తలు

### సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ (1910-95)



సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ భారత సంతతికి చెందిన అమెరికన్ శాస్త్రవేత్త. 20వ శతాబ్దంలో పేరొందిన నక్షత్ర భౌతికశాస్త్ర పరిశోధకుడు, గణిత శాస్త్రవేత్త. 'కృష్ణ బిలాల గణిత సిద్ధాంతాన్ని' కనుగొన్నారు. స్థిరమైన తెల్ల మరుగుజ్జు నక్షత్రం గరిష్ఠ ద్రవ్యరాశిని దీంతో కొలుస్తారు. నక్షత్రాల నుంచి వెలువడే రేడియేషన్ శక్తి, నక్షత్ర శకలాలు, తెల్లని పొట్టి నక్షత్రాలు మొదలైన వాటిపై పరిశోధనలు చేశారు. నక్షత్రం భరించే భారస్థితిని 'చంద్రశేఖర్ ద్రవ్యరాశి'గా, పరిమితిని 'చంద్రశేఖర్ లిమిట్'గా నిర్వచిస్తారు. ఆయన కృషి ఫలితంగా నోబెల్ బహుమతి (1983) వరించింది.



దగ్గరికి వెళ్లి 'ఏయ్.. మర్యాదగా నీ కొలనులో ఉన్న ముత్యాలన్నీ నాకిచ్చెయ్. లేకపోతే హంసను తీసుకుపోతా' అని బెదిరించాడు.

అది విన్న కప్ప.. 'సరే, ఒక్కసారి నీ చేతిలో ఉన్న ముత్యం ఇస్తావా.. అది చూసి అచ్చం అలాంటివే తీసుకొస్తాను' అని అడిగింది.

దాంతో వేటగాడు కప్పకు ముత్యం ఇచ్చాడు. కప్ప దాన్ని తీసుకుని నీటిలోపలికి పారిపోయింది. పోతూపోతూ 'నా స్నేహితురాలు ఎక్కడో దాక్కుంది. నీకు మేం దొరకం. అత్యాశతో ఉన్నది కూడా పోగొట్టుకున్నావ్ అనుభవించు' అని అరిచింది.

అది విన్న వేటగాడు 'అయ్యో ఎంత పని చేశానూ' అని బాధపడ్డాడు.. ★

## జనరల్ నాలెడ్జ్

1. ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా అని ఎవరిని పిలుస్తారు?
2. ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
3. జమైకా దేశ రాజధాని ఏది?

జవాబులు : 1. దాదా సాహెబ్ ఫాల్కే 2. మే 5; 3. కింగ్‌స్టన్.

## మెదడుకు మేత

నామము ఉంది గాని
పూజారిని కాను,
తోక ఉంటుంది కానీ
కోతిని కాను,
నేను ఎవర్ని?

జవాబు : ఉడుత


## మంచిమాట

ప్రతి అవకాశంలోనూ
కొన్ని ఆటంకాలుంటాయి.
ప్రతి ఆటంకంలోనూ
కొన్ని అవకాశాలుంటాయి.
మనం దేన్ని చూస్తామన్నదే ముఖ్యం.



# వారఫలాలు

05 -11 మే 2025




సింహంభట్ల సుబ్బారావు
6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

సమాజ సేవలో పాల్గొంటారు. రావలసిన డబ్బు సకాలంలో అందుతుంది. భూములు, వాహనాలు సమకూర తాయి. వివాహ యత్నాలు అనుకూలిస్తాయి. ప్రముఖుల నుంచి అందిన సమాచారం కొంత ఊరటనిస్తుంది. వ్యాపారులు లాభాల దిశగా సాగుతారు. ఉద్యోగులకు అనుకోని బాధ్యతలు దక్కవచ్చు. పారిశ్రామికవేత్తలు, కళా కారులకు అవకాశాలు 5,6 తేదీల్లో వృథా ఖర్చులు. మనశ్శాంతి లోపిస్తుంది. హనుమాన్ చాలీసా పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

కొత్త విషయాలు తెలుసుకుంటారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యతిరేకులు సైతం స్నేహితులుగా మారవచ్చు. ప్రముఖుల నుంచి ఆహ్వానాలు అందవచ్చు. వాహనసౌఖ్యం. వ్యాపారులు గతం కంటే అధికంగా లాభపడతారు. ఉద్యోగులకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళా కారులకు విశేష గౌరవం దక్కుతుంది. క్రీడాకారులు ఉత్సాహంగా ముందుకు సాగుతారు. 6,7 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆదాయం కంటే ఖర్చులు అధికమై డీలా పరుస్తాయి. కుటుంబసభ్యులతో అకారణంగా తగాదాలు. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు. కాంట్రాక్టులు అనుకూలించవు. వ్యాపారులకు కొంత నిరుత్సాహం. ఉద్యోగస్తులకు పనిభారం ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. పారిశ్రామిక వర్గాలకు గందరగోళం. రచయితలు, కళాకారులకు సమస్యలు పెరుగుతాయి. 5,6తేదీల్లో శుభవర్తమానాలు. వాహనసౌఖ్యం. ముఖ్య నిర్ణయాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. మాటల చాతుర్యంతో ఆకట్టుకుంటారు. భూవివాదాల నుంచి గట్టెక్కుతారు. భూములు, వాహనాలు సమకూర్చుకుంటారు. విద్యార్థులకు కార్యసిద్ధి. వ్యాపారులకు భాగస్వాముల నుంచి ప్రోత్సాహం. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. కళాకారులకు కొత్త అవకాశాలు. పరిశోధకులు, సాంకేతిక రంగాల వారికి ఆశలు. 9,10 తేదీల్లో దేవాలయ దర్శనాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కొంత కాలంగా ఎదుర్కొంటున్న సమస్య పరిష్కార మవుతుంది. వ్యాపారులు భాగస్వాములనుంచి మరిన్ని పెట్టుబడులు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు లక్ష్యాలు సాధిస్తారు. రచయితలు, క్రీడాకారులు ఊహించని అవకాశాలు పొందుతారు. 5,6 తేదీల్లో వృథా ఖర్చులు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆస్తుల వివాదాలను అత్యంత చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. వ్యాపారులు లాభాల బాటలో పయ నిస్తారు. ఉద్యోగులు విధుల్లో సమర్థత నిరూపించు కుంటారు. రాజకీయ, పారిశ్రామిక వేత్తలకు ఊహించని అవకాశాలు. పరిశోధకులు, సాంకేతిక నిపుణులు అంచనాలు నిజం చేసుకుంటారు. 10,11తేదీల్లో ప్రయాణాలలో మార్పులు. మానసిక ఆందోళన. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలు సమయానికి పూర్తి కాగలవు. దేవాలయాలు సందర్శిస్తారు. వాహన సౌఖ్యం. వ్యాపారులు ముందుకు సాగి లాభాలు పొందుతారు. ఉద్యోగులకు ఊహించని హోదాలు రాగలవు. కళాకారులకు అవకాశాలు మరింత పెరుగుతాయి. రచయితలు, క్రీడాకారులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 8,9 తేదీల్లో ఆరోగ్యసమస్యలు. బంధువులతో విరోధాలు. గణేశ్‌ను పూజించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

చేపట్టిన కార్యాలు విజయవంతంగా కొనసాగుతాయి. స్నేహితుల నుంచి శుభవార్తలు అందుతాయి. గృహం, వాహనాలు కొనుగోలు. కొత్త కాంట్రాక్టులు ఎట్టకేలకు దక్కించుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయ వేత్తలు, కళాకారులు సత్తా చాటుకుంటారు. పరిశోధకులకు నూతనోత్సాహం. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు. కనక దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త వ్యక్తులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఆత్మీయుల నుంచి ముఖ్య సందేశం అందుతుంది.. కొన్ని కార్యక్రమాలు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఉద్యోగులు విధుల్లో అవాంతరాలు అధిగమిస్తారు. వ్యాపారులకు లాభాలు. క్రీడాకారులు, రచయితలకు అన్ని విధాలా అనుకూల సమయం. 5,6 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధువిరోధాలు. కష్టానికి ఫలితం కనిపించదు. శివస్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

సమాజంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. విద్యార్థులకు అనుకున్న అవకాశాలు దక్కుతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని మనస్సులోని భావాలను వెల్లడిస్తారు. వ్యాపారులకు నూతన పెట్టుబడులు. రాజకీయవేత్తలు, సాంకేతికవర్గాలకు సమస్యలు తీరతాయి. 7,8 తేదీల్లో మానసిక అశాంతి. ప్రయాణాలలో మార్పులు. శారీరక రుగ్మతలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.


**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

అనుకున్న కార్యాలు నెమ్మదిగా సాగుతాయి. దేవాలయాలు సందర్శిస్తారు. భూములు, వాహనాలు కొంటారు. సమాజంలో గౌరవం మరింత పెరుగుతుంది. వ్యాపారులకు అనుకోని లాభాలు దక్కవచ్చు. ఉద్యోగులు విధి నిర్వహణపై మరింత శ్రద్ధ. రాజకీయ వేత్తలు, కళాకారులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. 9,10 తేదీల్లో బంధువుల ఒత్తిడులు. వ్యయప్రయాసలు. సుబ్రహ్మణ్యస్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

పలుకుబడి పెంచుకుంటారు. సమాజసేవలో భాగస్వాములవుతారు. ఆస్తుల వ్యవహారాలలో మధ్యవర్తిత్వం వహిస్తారు. వ్యాపారులకు పెట్టుబడులతో పాటు లాభాలు అందుతాయి. ఉద్యోగులు సమర్థతను నిరూపించుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక వేత్తలకు అరుదైన అవకాశాలు. క్రీడాకారులు, రచయితలు ఉత్సాహంగా ముందడుగు వేస్తారు. 5,6తేదీల్లో కుటుంబంలో చికాకులు. ఆరోగ్య సమస్యలు. ఆదిత్య హృదయం పఠించండి.

# పదరసం - 512



### ఆధారాలు

**అడ్డం**

1) కృతజ్ఞతాభివందనాలు (5)
3) నీటిని మరగిస్తే వచ్చేది (3)
5) సువాసన (2)
7) పోల్చదగనిది, సాటి లేనిది (5)
9) భద్రం (3)
10) ప్రత్యక్షం, ఎదుటనే వచ్చియున్న (3)
12) ఊరడింపు, ఓదార్పు (5)
13) విసనకర్ర (3)
14) సమయం తెలిపేది (4)
16) మన వైద్యవిధానంలో దీని పరీక్ష ప్రధానం, నరం (2)
18) అన్నం మొదలైనవి వార్చిన నీరు (2)
20) ఎండమావి (4)
22) బిరుసు (2)
23) స్వంతదారు, ఇంటి పెద్ద (4)
25) వేసవికాలం దీనిని సేవించడం మంచిది (3)
26) స్థిరత్వం లేకుండుట (3)
27) నెయ్యి మొదలైనవాటిలో ఉండే మెరుగు (2)

**నిలువు**

1) ఒక నక్షత్రం చెదరింది (3)
2) న్యాయస్థానాలలో జరిగే చర్చోపచర్చలు (6)
4) విస్తారం (3)
6) ఆపద (3)
8) వెళ్లేవారితో కొంత దూరం వెళ్లి (పంపి) రావడం సరిగా లేదు (4)
11) వ్యర్థం, నీచం (3)
12) పెద్ద శుభకార్యాల తరువాత ఈ వ్రతం చేయడం రివాజు (6)
13) పెద్ద గోల, కదం తొక్కు (3)
15) కలగూర వంటకం సరిగా లేదు (3)
17) వసంత రుతువు (3)
19) కలవరం గందరగోళమైంది (4)
21) తామర (3)
24) మరుగు, చాటు (2)

### పదరసం - 511 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| అ[1] | వ | గా[2] | హ | న[3] | ■ | తి[4] | ■ | తు[5] | లో[6] |
| ప్ర | ■ | భ | ■ | లు[7] | వా | న | ఆ | ■ | గు |
| మ[8] | గ | రా | యు[9] | డు | ■ | గా | ■ | ప[10] | ట్టు |
| త్తం | ■ | ■ | వ | ■ | ఇ[11] | తి | హా | సం | ■ |
| ■ | యం[12] | శ[13] | తి | అ[14] | ■ | న | ■ | దు[15] | రా[16] |
| ప[17] | ■ | లం | ■ | వ[18] | డ | గా | లి[19] | ■ | వ |
| రి[20] | మ్మ | క | ■ | రో | ■ | ■ | గ[21] | న | ణ |
| వ | ■ | ■ | బం[22] | ధం | సం[23] | ■ | నా | ■ | కా |
| ర్త[24] | క | ■ | గా | ■ | ట[25] | ల్లెం | ■ | క[26] | ష్టం |
| న | ■ | ట[27] | రం | పు | రం | ■ | ప[28] | సి | ■ |

సి ని మా



ప్రముఖ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, సెన్సిబుల్ డైరెక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ కాంబినేషన్ లో ఇంతవరకూ 'జెంటిల్ మేన్, సమ్మోహనం' చిత్రాలు వచ్చాయి. విజయవంతమైన ఆ రెండు చిత్రాల తర్వాత వారి కలయికలో రూపుదిద్దుకున్న మూడో చిత్రం 'సారంగపాణి జాతకం'. ఇటీవలే 'కోర్ట్' సినిమాతో చక్కని విజయాన్ని అందుకున్న ప్రియదర్శి హీరోగా నటించిన ఈ సినిమాలో నటీనటులు, సాంకేతిక నిపుణులంతా తెలుగువారే కావడం విశేషం. జాతకాలను నమ్మడం తప్పుకాదు. కానీ మూఢ నమ్మకం అనేది తప్పు. ఇదే ఈ సినిమా ద్వారా తెలిపే ప్రయత్నం చేశారు దర్శకుడు ఇంద్రగంటి. ఆయన గత చిత్రం 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో తనకు అచ్చివచ్చిన కామెడీ జానర్‌లో 'సారంగపాణి జాతకం'ను తెరకెక్కించారు.

# భేషుగ్గా సారంగపాణి జాతకం

కథ విషయానికి వస్తే... సారంగపాణి (ప్రియదర్శి) కార్ షోరూమ్‌లో సేల్స్ మన్. చిన్నప్పటి నుంచి అతనికి జాతకాలంటే పిచ్చి. తన షోరూమ్‌లోనే మేనేజర్‌గా ఉన్న మైథిలి (రూపా కొడవాయూర్)ని ప్రేమిస్తాడు. ఆమె కూడా అతన్ని ఇష్టపడుతుంది. పెద్దలను ఒప్పించి, పెళ్లి చేసుకుందాం అనుకుంటారు. ఆ సమయంలో సారంగ చేతి రేఖలు చూసిన జోగేశ్వర్ (అవసరాల శ్రీనివాస్) అతని జాతకంలో ఓ చిక్కుముడి ఉందని చెబుతాడు. సారంగపాణి చేతుల మీదుగా ఓ హత్య జరుగుతుందని నమ్మబలుకుతాడు. దాంతో షాక్‌కు గురైన సారంగ... హంతకుడిగా మారబోతున్న తాను మైథిలి మెడలో తాళి కట్టడం కరెక్ట్ కాదని భావిస్తాడు. పెళ్లిని కొన్ని నెలలు వాయిదా వేయిస్తాడు. అయితే... ఈ భూమికి భారమైన వ్యక్తినో, తీవ్రవాదినో తానే ఎంపిక చేసుకుని హత్య చేస్తే అయిపోతుంది కదా? అనుకుంటాడు. జోగేశ్వర్ చెప్పిన జాతకాన్ని పూర్తిగా బుర్రలోకి ఎక్కించుకుని ఇలాంటి వింత ఆలోచన చేసిన సారంగపాణి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అతను చేసే పిచ్చి చేష్టలతో అతనికి దూరమైన మైథిలి తిరిగి అతని చెంతకు చేరిందా లేదా? సారంగను అంతలా జోగేశ్వర్ ప్రభావితం చేయడానికి కారణం ఏమిటనేది మిగతా కథ.

జాతకాలను నమ్మి జీవితంలో కష్టపడకుండానే ఉన్నత స్థితికి చేరతామని ఆశపడిన హీరోల కథలతో ఇప్పటికే కొన్ని సినిమాలు వచ్చాయి. అప్పట్లో రాజేంద్రప్రసాద్ హీరోగా తెరకెక్కించిన 'ఆ ఒక్కటి అడక్కు' అలాంటి కథే. అయితే... ఇందులో హీరో క్యారెక్టరైజేషన్ వేరు. జాతకాల మీద పిచ్చి నమ్మకంతో హత్య చేయడానికి సిద్ధపడే పాత్ర ఇతనిది. వినడానికి ఇది కాస్తంత వింతగానే ఉంటుంది. ఎవరైనా మరీ ఇంత దారుణమైన చర్యకు పాల్పడతారా? అనే సందేహం కలుగుతుంది. కానీ భార్యకు విడాకులు ఇస్తే కలిసి వస్తుందని, వయసులో తమకంటే చిన్నవారిని పెళ్లాడితే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని నమ్మి... జీవితాలను నాశనం చేసుకుంటున్న కొందరిని చూస్తున్నాం. మనుషుల బలహీనతలను ఆసరాగా చేసుకుని దొంగ జాతకాలు చెప్పేవారి చేష్టలు ఇలానే ఉంటాయి. ఇందులోని జోగేశ్వర్ అలాంటి వాడే అని హీరో తెలుసుకోవడానికి చాలానే సమయం పడుతుంది. సినిమా ప్రారంభం కాస్తంత నిదానంగా ఉన్నా... జోగేశ్వర్ ఎంట్రీతో ఊపందుకుంది.

అది సినిమా ముగింపు వరకూ నాన్‌స్టాప్‌గా సాగిపోయింది. దర్శకుడు ఈ స్క్రిప్ట్‌మీద ఎంత హోమ్ వర్క్ చేశాడో ప్రతి సన్నివేశంలో కళ్లకు కట్టినట్టు కనపడుతుంది. ఫన్‌రైడ్‌గా సాగిపోతున్న ఈ కథలో పాటలు ఓ రకంగా స్పీడ్ బ్రేకలా అనిపిస్తాయి. పంచ్ డైలాగ్స్ అదిరిపోయాయి. మోహనకృష్ణ పాత్రోచితంగా వాటిని అద్భుతంగా రాశారు. హాస్యం పేరుతో ద్వంద్వార్థ మాటలను ప్రతి ఒక్కరు వల్లెవేస్తున్న సమయంలో ఇంద్రగంటి మోహన కృష్ణ క్లీన్ కామెడీ ఎంటర్ టైనర్‌ను అందించడానికి ప్రయత్నించారు.

నటీనటుల విషయానికి వస్తే... సారంగపాణిగా ప్రియదర్శి చక్కగా నటించాడు. అయితే... అతని స్నేహితులుగా నటించిన 'వెన్నెల' కిశోర్, ద్వితీయార్థంలో వచ్చే వైవా హర్ష... కొన్ని సన్నివేశాలలో తమ డామినేషన్‌ను చూపించారు. అక్కడ ప్రియదర్శి కాస్తంత తేలిపోయాడు. హీరోయిన్ రూప కొడవాయూర్ పాత్రోచితంగా నటించింది. ప్రధానంగా చెప్పుకోవాల్సింది వడ్లమాని సాయి శ్రీనివాస్ గురించి. పెద్ద చిన్న అనే తేడా లేకుండా తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని ఆయన చక్కగా ఉపయోగించుకుంటున్నారు. ఈ సినిమాలో హీరో తండ్రిగా నటనకు ఆస్కారం ఉన్న పాత్ర చేశారు. నరేశ్ హీరోయిన్ తండ్రిగా నటించారు కానీ ఆయన పాత్రకు పెద్దంత ప్రాధాన్యం లేకపోయింది. ఇతర ప్రధాన పాత్రలను ప్రదీప్ రుద్ర, కల్పలత, రూపలక్ష్మీ, తనికెళ్ళ భరణి, భార్గవ్, శివన్నారాయణ, రాజా చెంబోలు తదితరులు పోషించారు.

సాంకేతిక నిపుణులు సైతం తమ బాధ్యతను చక్కగా నిర్వర్తించారు. వివేక్ సాగర్ సమకూర్చిన బాణీలు ఏమంత గొప్పగా లేవు. పాటల చిత్రీకరణలో కాస్తంత గిమ్మిక్స్ ప్రదర్శించారు కానీ అవేమంత ఆకర్షణీయంగా లేవు.

అయితే నేపథ్య సంగీతం బాగుంది. పీజీ విందా సినిమాటోగ్రఫీ బాగుంది. మార్తండ్ కె. వెంకటేశ్ కూర్పు చెప్పుకోదగ్గది. మూవీలో మరీ ముఖ్యంగా క్లయిమాక్స్‌లో ఎలాంటి జర్క్ లేకుండా చక్కగా కంటెంట్‌ను అందించాడు. జనవరిలో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత ఆ తరహా ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మరేదీ రాలేదు. ఆ లోటును 'సారంగపాణి జాతకం' తీర్చబోతోంది. ఈ చిత్ర కథానాయకుడు ప్రియదర్శి 'బలగం, 35, కోర్ట్' వంటి చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్నా, థియేటర్లకు జనాలను రప్పించే స్టామినా ఇంకా సంపాదించుకోలేదు. సో... సినిమా బాగుందనే పాజిటివ్ టాక్ స్ప్రెడ్ అయ్యి... జనాలు వచ్చే వరకూ ఇది థియేటర్లలో ఉండాలి. అలా జరిగితే.... 'సారంగపాణి జాతకం' భేషుగ్గా ఉన్నట్టే. ఏదేమైనా ఈ మండు వేసవిలో చల్లని వినోదపు జల్లును కురిపించే ప్రయత్నం చేసి నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్, దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ అభినందనీయులు.

**అరుణ,** సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# పాకిస్తాన్‌లో పంచముఖ మారుతి



రామాయణంలో హనుమంతుడికి విశిష్టమైన స్థానం ఉంది. శ్రీరామ భక్తుడిగా..సీతా రాముల దాసునిగా.. అత్యంత భక్తి శ్రద్ధలతో హిందువులతో పూజలు అందుకుంటున్నాడు. ఇక మన దేశంలో ఎక్కడ చూసిన హనుమంతుడి విగ్రహాలు కనిపిస్తాయి. అయితే, మన దాయాది దేశమైన పాకిస్థాన్‌లో అత్యంత పురాతనమైన శ్రీ పంచముఖి హనుమాన్ ఆలయం ఉంది.

పాకిస్థాన్‌లోని కరాచీలో సోల్జర్ బజార్ వద్ద శ్రీరామభక్తుడు ఆంజనేయస్వామి స్వయంభువుగా వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం ఉంది. నీలం, తెలుపు రంగులో 8 అడుగుల ఎత్తు ఉండే ఆలయంలోని విగ్రహం సహజ సిద్ధంగా ఏర్పడినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం హనుమ, నరసింహ, ఆదివరాహ, హయగ్రీవ, గరుడ ముఖాలతో దర్శనమిస్తుంది.

వనవాసంలో శ్రీరాముడు సీతా సమేతంగా లక్ష్మణుడితో కలిసి ఇక్కడ విడిది చేసినట్టు స్థానిక స్థలపురాణం చెబుతోంది.

ఇక పురావస్తు శాఖ ప్రకారం ఈ ఆలయం 1500 ఏళ్ల క్రితం నిర్మించినట్టు తెలుస్తోంది. అంతేకాదు, ఆలయ ప్రాంగణ తవ్వకాల్లో పురాతనమైన వానర మూకల విగ్రహాలతో పాటు కృష్ణుడు, వినాయకుడు వంటి అనేక విగ్రహాలు బయటపడ్డాయి. నలుపు, తెలుపు పాలరాయితో నిర్మితమైన ఈ ఆలయం ముందు వాకిలిలో ఇరువైపులా పసుపు రాయి స్తంభాలతో చూపరులను ఆకట్టుకుంటుంది. ఇక పాక్‌లోని హిందువులు ప్రతి ఏటా ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటారు. ఈ ఆలయంలో మూలవిరాట్ ఉన్న ప్రాంగణంలో 21 ప్రదక్షిణలు చేస్తే కోరుకున్న కోరికలు నెరువెరుతాయని భక్తులు నమ్ముతారు.

ఈ ఆలయంలో శ్రీరామనవమి కృష్ణాష్టమి హనుమజ్జయంతి ,దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. మంగళ ,శనివారాలలో స్వామికి సిందూరం తోనూ నువ్వుల నూనెతోనూ పూజ చేస్తారు.






ఆనంద్, హిందూపురం


From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 28


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.300/-




వెల : ₹.300/-





వెల : ₹.100/-





వెల : ₹.160/-





వెల : ₹.200/-





వెల : ₹.499/-





వెల : ₹.300/-





వెల : ₹.120/-





వెల : ₹.300/-





వెల : ₹.180/-




వెల : ₹.350/-





వెల: PB ₹.550/-




వెల :₹.450/-




వెల : ₹.699/-




వెల : ₹.150/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687